ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 13.09.2024 | సంపుటి : 11 సంచిక : 64 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## స్పేస్‌ఎక్స్ ఘనత

**తొలిసారి అంతరిక్షంలో ప్రైవేట్ స్పేస్‌వాక్..**

**వాషింగ్టన్(జనంసాక్షి)** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని 'స్పేస్‌ఎక్స్ అంతరిక్ష సంస్థ చరిత్ర సృష్టించింది. తొలిసారి అంతరిక్షంలో ప్రైవేట్ స్పేస్‌వాక్‌ను నిర్వహించింది.'పొలారిస్ డాన్ ప్రాజెక్టు కింద ఫాల్కన్-9 రాకెట్ ద్వారా మంగళవారం నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన విషయం తెలిసిందే. వ్యోమగాములతో కూడిన స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ క్యాప్సుల్ ప్రస్తుతం

మిగతా 2లో..



## తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట

**విద్యుత్ కొనుగోళ్ల బిడ్‌లో పాల్గొనేలా ఆదేశం**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్: విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. విద్యుత్ కొనుగోలుకు సంబంధించి బకాయిల చెల్లింపుపై

మిగతా 2లో..

# బజారునపడ్డ రాజకీయం



## తొడగొడుతూ బూతుపురాణం చెవులు మూసుకున్న తెలంగాణ



కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళనతో కౌషిక్‌రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు.. దాడిలో పగిలిన కిటికీలు

- మహిళలను కించపరుస్తూ కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు
- మండిపడ్డ మహిళా లోకం
- బస్తీమే సవాల్ అంటూ అరికె పూడి గాంధీ వీరంగం





**శేరిలింగంపల్లి/ హైదరాబాద్(జనంసాక్షి):** ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి సవాళ్లు, ప్రతిసవాళ్లతో తెలంగాణలో పొలిటికల్ హీట్ నెలకొంది. కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి ఇంటికి అరెకపూడి పెద్ద ఎత్తున తన అనుచరులతో బయల్దేరి వెళ్లారు. గాంధీ ఇంటికి వెళ్లి భారాస కండువా కప్పుతానని ఇటీవల కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనిపై అరెకపూడి గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. ఎన్నికల్లో గెలిపించకపోతే చనిపోతానని భయపెట్టి ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్‌రెడ్డిలాంటి కోవర్టులకు తన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తన ఇంటికి ఆయన రాకపోతే.. తానే ఆయన ఇంటికి వెళతానని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కౌశిక్‌రెడ్డి ఇంటికి అరెకపూడి గాంధీ వెళ్లారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కొంతమంది అరెకపూడి అనుచరులు కౌశిక్‌రెడ్డి ఇంటి గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు యత్నించారు. కౌశిక్‌రెడ్డి ఇంటివద్ద తన అనుచరులతో కలిసి అరెకపూడి గాంధీ బైఠాయించారు. పోలీసులు ఆయన్ను పంపించే ప్రయత్నం చేయగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డిని బయటకు పిలవాలని.. లేదంటే తననే లోపలికి పంపించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు, అరెకపూడి గాంధీ అనుచరుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కొందరు అనుచరులు గేటు తోసుకుంటూ కౌశిక్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించారు. అనంతరం గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు.అంతకుముందు అరెకపూడి గాంధీ మీడియాతో మాట్లాడారు. భారాసలోకి వచ్చినప్పటి నుంచి కౌశిక్‌రెడ్డి తీరు సరిగా లేదన్నారు. ఆయన తీరు వల్లే ఆ పార్టీ ఓటమి పాలైందని విమర్శించారు. ఆయన కోవర్టుగా వ్యవహరించారన్నారు. కౌశిక్‌రెడ్డి వ్యక్తిత్వం తెలుసుకోకుండా భారాసలో స్థానం

మిగతా 2లో..

**వామపక్ష యోధుడు, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి**

# సీతారాం ఏచూరి ఇకలేరు

**ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో ఎయిమ్స్‌లో కన్నుమూత**

- ప్రధాని , మోదీ, రాహుల్ రేవంత్ దిగ్భ్రాంతి
- దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖుల సంతాపం
- భౌతిక ఖాయాన్ని ఎయిమ్స్‌కు అప్పగించనున్న కుటుంబ సభ్యులు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** మాటల్లో మెతకదనం..భావంలో తీవ్రత..మృదు స్వభావం ఆయన సొంతం. మెతకగా ఉన్నట్లు కనిపించినా...దేశం కోసం పాటుపడే ఆయన అతురత చుంకత్తిలా ఉండేది. సమస్య ఎక్కడ ఉన్నా పరుగెత్తే ప్రవాహం ఆయన నైజం. చిన్న వయసులోనే రాజకీయాల్లో ఆరితేరారు. వామపక్షభావజాలం అనుఋవణువూ నింపుకున్న ఏచూరి..నిరంతరం భారత ఆర్థిక అభివృద్ధి కోసం తపించేవారు. ఆయనే సీతారం ఏచూరి. ఇంతటి మహోన్నతుడు భారత రాజకీయాల్లో తనకంటూ ఓ చరిత్ర లిఖించుకున్నారు. అత్యతం పిన్నవయసులోనే దేశంలో అత్యున్నత స్థానానికి ఎదిగిన తెలుగు బిడ్డ. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి(72) కన్నుమూశారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో ఢిల్లీ ఎయిమ్స్‌లో కొద్ది వారాలుగా చికిత్స పొందిన ఆయన ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో భారత రాజకీయాల్లో ఓ ధృవతార నింగికేగింది. ఆయన మృతికి ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ, సిపిఎం పోలిట్ బ్యూరో సమా పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. ఆర్థికవేత్త, సామాజిక కార్యకర్త, కాలమిస్ట్‌గా గుర్తింపు పొందిన ఏచూరి.. 1992 నుంచి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. 32 ఏళ్లుగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్న ఏచూరి 2015లో ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2005 2017 వరకు బెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. ఆయన పూరి పేరు ఏచూరి సీతారామరావు. 1952 ఆగస్టు 12 చెన్నైలో వైదేహి బ్రాహ్మణులైన

మిగతా 2లో..

# భాజపా పాలిత రాష్ట్రాల్లో శాంతిభద్రతలు కరువు

**ఇంకెంత కాలం కళ్లుమూసుకుంటారు..!?: రాహుల్ గాంధీ**

**ట్రైనీ ఆర్మీ అధికారులను బెదిరించి.. స్నేహితురాలిపై గ్యాంగ్ రేప్ ఘటనపై ఆగ్రహం**



**దిల్లీ(జనంసాక్షి):** స్నేహితురాళ్లతో కలిసి బయటకు వెళ్లిన ట్రైనీ ఆర్మీ అధికారులపై కొంతమంది దుండగులు దాడి చేయడమే కాకుండా.. వారి స్నేహితురాలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందించారు. "ట్రైనీ ఆర్మీ అధికారులపై దాడి, వారి స్నేహితురాలిపై అత్యాచారం సమాజాన్ని సిగ్గుపడేలా చేసింది. భాజపా పాలిత రాష్ట్రాల్లో శాంతిభద్రలు కరువయ్యాయి. మహిళలపై రోజురోజుకు పెరుగుతోన్న నేరాల పట్ల భాజపా ప్రభుత్వం ప్రదర్శిస్తోన్న ప్రతికూల వైఖరి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. యంత్రాంగం వైఫల్యం వల్లే నేరస్థులు ఇలాంటి దుస్సాహసాలకు ఒడిగడుతున్నారు. ఇలాంటి నేరాలు అమ్మాయిల స్వేచ్ఛ, ఆకాంక్షలకు అడ్డంకిగా మారుతాయి. జనాభాలో సగ భాగమైన ఆడపిల్లలపై ఇలాంటి

మిగతా 2లో..

# ఎస్సీ వర్గీకరణపై కమిటీ

**ఉత్తమ్ అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో ఏర్పాటు**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎస్సీ వర్గీకరణపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆరుగురు సభ్య లతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ కో- ఛైర్మన్‌గా మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవిని ప్రభుత్వం నియమించింది. ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, ఈ అంశంతో ముడిపడి ఉన్న అన్ని అంశాలపై కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించనుంది.

మిగతా 2లో..



# ఎన్నోయేళ్లుగా భారత్‌తో చారిత్రక, సాంస్కృతిక అనుబంధం

12లో

ఇరాన్ డిప్యూటీ మంత్రి షల్బాఫియాన్ • హైదరాబాద్‌లో పర్యాటక రోడ్ షో • పాల్గొన్న మంత్రి జూపల్లి

## బాలిక హత్యాచారం కేసులో దోషికి మరణశిక్ష

**సంగారెడ్డి కోర్టు సంచలన తీర్పు**



**సంగారెడ్డి(జనంసాక్షి):** సంగారెడ్డి కోర్టు ఓ అత్యాచార కేసులో సంచలన తీర్పు వెలువరించింది. బాలికపై హత్యాచారం కేసులో దోషిగా తేలిన వ్యక్తికి సంగారెడ్డి జిల్లా కోర్టు మరణశిక్ష విధించింది. బిహార్‌కు చెందిన గఫాఫర్(56) గతేడాది బీడీఎల్ బానూరులో ఐదేళ్ల బాలికకు కూల్ డ్రింక్‌లో మద్యం కలిపి తాగించి.. అత్యాచారం చేసి చంపేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిపై నేరాభియోగానికి సంబంధించి ప్రాసిక్యూషన్ తగిన సాక్ష్యాధారాలను చూపించడంతో గఫాఫర్‌కు మరణ దండన విధిస్తూ జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది.

## విపక్షానికే పీఏసీ ఛైర్మన్ పదవి

**ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్య**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ పదవి ప్రతిపక్షానికే ఇచ్చామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ చివరి రోజు భారాస సభ్యుల సంఖ్యను ప్రకటించారు.. 38 మంది అని ప్రకటించినప్పుడు ఎందుకు అభ్యంతరం

మిగతా 7లో..

## అవసరమైతే రాజీనామా చేస్తా

- ప్రజల కోసం సీఎం పదవి కూడా వదులుకుంటా
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు



**కోల్‌కతా(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్ హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగిస్తున్న జూనియర్ వైద్యులకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య చర్చల విషయమై ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజల ప్రయోజనం కోసం అవసరమైతే తాను రాజీనామా చేసేందుకు

మిగతా 2లో..



## అంతర్జాతీయ క్రీడా వేదికపై మన సత్తా చాటాం

**పారాలింపిక్స్ విజేతలతో ప్రధాని మోదీ ఆత్మీయ సమావేశం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పారిస్ వేదికగా జరిగిన పారాలింపిక్స్ భారత అథ్లెట్లు సత్తా చాటారు. మొత్తం 29 పతకాలను సాధించారు. స్వదేశానికి చేరుకున్న విజేతలతో ప్రధాని మోదీ దిల్లీలోని తన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. అథ్లెట్లను అభినందించారు. దేశం కోసం వారు చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా వారితో కాసేపు ముచ్చటించారు. 'అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన భారత అథ్లెట్లు 29 పతకాలను సాధించడం అభినందనీయం. వారి అంకితభావంతోనే ఇది సాధ్యమైంది. ఎంతోమందికి ఇది స్ఫూర్తిదాయకం" అని ఎక్స్‌లో ప్రధాని మోదీ ప్రశంసించారు. తాజాగా అథ్లెట్లతో మోదీ ముచ్చటిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ భేటీలో కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, పారాలింపిక్స్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) హెడ్ దేవేంద్ర జజారియా

మిగతా 2లో..



## స్థానికతపై సుప్రీంకు తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్(జనంసాక్షి):** వైద్య కళాశాలల ప్రవేశాలలో స్థానికత వివాదంపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. తెలంగాణలోని మెడికల్, డెంటల్ కళాశాలల్లో చేపట్టనున్న ప్రవేశాల్లో ఈ రాష్ట్రంలో శాశ్వత నివాసం ఉంటున్న స్థానికులకు అవకాశం కల్పించాల్సిందేనని ఇటీవల హైకోర్టు స్పష్టంచేసింది. మెడికల్ అడ్మిషన్‌ల నిబంధనలకు జీవో 33 ద్వారా చేసిన సవరణ 3(ఏ)ను రద్దు చేస్తే... దేశవ్యాప్తంగా ఉన్నవారంతా 85% స్థానిక కోటా కింద ప్రవేశాలు పొందే అవకాశం ఉందని పేర్కొంది. ఈ కారణంగానే ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ జీవోను రద్దు చేయడం లేదని తన 71 పేజీల తీర్పులో పేర్కొంది. అయితే, విద్యార్థుల స్థానికతను నిర్ధారించడానికి ఎలాంటి

మిగతా 7లో..

## అన్నదాతల ఆత్మహత్యలు పట్టని ప్రభుత్వం

**కేటీఆర్ ఆగ్రహం**



**హైదరాబాద్(జనంసాక్షి):** అధికార కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. రుణమాఫీ కాలేదని కొందరు.. రైతు భరోసా అందక ఇంకొందరు అన్నదాతలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. అన్నదాతల పరిస్థితి ఆందోళనకరంగా మారినా.. కాంగ్రెస్ సర్కార్ మొద్దు నిద్ర వీడటం లేదంటూ బీఆర్ఎస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రైతును రాజు చేస్తే.. ఈ కాంగ్రెస్ సర్కార్ అన్నదాతల ప్రాణాలను తీస్తుందంటూ ధ్వజమెత్తారు. రైతు రుణమాఫీ బోగస్.. రైతు భరోసా కూడా బోగస్ అంటూ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఇటు బ్యాంకులు,

మిగతా 2లో..



## గాజాలో ఇజ్రాయెల్ దాడిలో ఐరాస సిబ్బంది మృతి

**వైమానికదాడిలో ఆరుగురు సభ్యులు ప్రాణాలు కోల్పోయారన్న సంస్థ**

**గాజా(జనంసాక్షి):** ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం అటు గాజా ప్రజలు, ఇటు వారి సహాయార్థం సేవలందిస్తోన్న సిబ్బంది ప్రాణాలమీదకు తెస్తోంది. బెంజమిన్ నెతన్యాహు సేనలు పాఠశాల, కొన్ని ఇళ్లపై జరిపిన వైమానిక దాడిలో 34 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక ఆసుపత్రి తెలిపింది. వారిలో తమ సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్య సమితివెల్లడించింది. ఈమేరకు యూఎన్ చీఫ్ ఆంటోనియో గుటెరస్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "గాజాలో

మిగతా 2లో..



## క్రీడలతో మానసిక ఉల్లాసం

### కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించిన 'ఉప్పల'

**హైదరాబాద్(జనంసాక్షి):**క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.నాగోల్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కబడ్డీ టోర్నమెంట్ లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం, ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడతాయి అని ఆయన అన్నారు క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వములో క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది అని ఆయన అన్నారు.హయత్ నగర్ తిపర్తి యాదయ్య, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ ఎంఈవో రామ రావు, హెడ్ మాస్టర్ లక్ష్మి దేవి,ఐవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్ ,ఎన్‌వోఎస్‌ఏ ప్రెసిడెంట్ కన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ , శ్రీనివాస్ రెడ్డి పల్లె లింగం గౌడ్, మహేశ్వర్ గుప్త, వెంకట్ రెడ్డి, మహేందర్ సాయి బాబా గౌడ్, కర్ణకర్, పద్మావతి విమల రవి కుమార్ మాధవి లత పాల్గొన్నారు.

## అవసరమైతే రాజీనామా చేస్తా

కూడా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఆర్జీ కర్ ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వైద్యులతో సమావేశం కోసం గురువారం దాదాపు రెండు గంటలపాటు ఎదురుచూశానని, అయినప్పటికీ వారి నుంచి స్పందన లేకుండా పోయిందన్నారుఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోను. పెద్దవాళ్లం కాబట్టి వారిని క్షమిస్తాను' అని మమతా బెనర్జీ చెప్పారు.

## తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట

గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రూ.261 కోట్లు చెల్లించాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఫిర్యాదు చేయడంతో తెలంగాణ డిస్కమ్‌లు విద్యుత్ కొనుగోలు బిడ్‌లో పాల్గొనకుండా నేషనల్ డిస్పాచ్ సెంటర్ అడ్డుకుంది. ఉదయం నుంచి విద్యుత్ కొనుగోలుకు బిడ్లు వేయకుండా పవర్ ఎక్ఛేంజీలు నిలిపివేశాయి.దీనిపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేసింది. విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నిర్ణయంపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## అంతర్జాతీయ క్రీడా వేదికపై సత్తా చాటాం

కూడా పాల్గొన్నారు.పారాలింపిక్స్‌లో ఆర్చరీ విభాగంలో స్వర్ణం సాధించిన హర్విందర్ సింగ్.. ప్రధానితో జరిగిన సమావేశంలోని విశేషాలను మీడియాతో పంచుకున్నాడు. "ప్రధాని మమ్మల్ని ఎంతో ప్రోత్సహించారు. మా బృందాన్ని ప్రశంసించారు. క్రీడా సిబ్బందితో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా నా బాణాన్ని ప్రధానికి బహుమతిగా ఇవ్వడం సంతోషంగా ఉంది" అని పంచుకున్నాడు. కాగా.. ఇటీవల పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో భారత్ అథ్లెట్లు అసాధారణ ప్రతిభ కనబరిచారు. ఏకంగా 29 పతకాలు సాధించి ఔరా అనిపించారు.భారత్ - బంగ్లా రెండో టెస్టు వేదిక మారనుందా? బీసీసీఐ వర్గాల క్లారిటీ!ఇందులో అత్యధిక మెడల్స్ అథ్లెటిక్స్‌లోనే రావడం విశేషం. ఈ విభాగంలో నాలుగు స్వర్ణాలు సహా 17 పతకాలు వచ్చాయి. ఓవరాల్‌గా ఏడు స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలతో 18వ స్థానంలో నిలిచింది. పారాలింపిక్స్ చరిత్రలో భారత్ అత్యధిక పతకాలు సాధించడం ఇదే తొలిసారి. 2020లో నిర్వహించిన టోక్యో పారాలింపిక్స్‌లో 5 స్వర్ణాలు సహా 19 పతకాలను భారత్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ సారి అంతకు మించి పతకాల పంట పండించింది.

## అన్నదాతల ఆత్మహత్యలు పట్టని ప్రభుత్వం

ఇటు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రుణమాఫీ కాకపోవడంతో మేడ్చల్‌లో వ్యవసాయ కార్యాలయం సాక్షిగా రైతు సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. తన తల్లికి, తనకు ఉన్న రుణం మాఫీ కాకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దగాకు బలైపోయాడని కేటీఆర్ తెలిపారు. భార్యాభర్తలిద్దరిలో ఒక్కరి కూడా రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో జగిత్యాలలో పురుగుల మందు తాగి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు రైతు సాగర్ రెడ్డి. తన పేరిట ఉన్న లక్షన్నర రుణం, తన భార్య పేరిట ఉన్న లక్షా 60 వేల రుణంలో ఏ ఒక్కరి రుణం మాఫీ అయినా గ్టటెక్కుతానని గంపెడాశలు పెట్టుకుని దారుణంగా మోసపోయాడని కేటీఆర్ పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చేసిన తీరని ద్రోహానికి ఇంకా ఎంతమంది రైతులు ప్రాణాలను బలిపెట్టాలి.. ఏకకాలంలో అందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ అని ఇచ్చిన మాటతప్పిన సీఎంను ఏం చేయాలి.. డిసెంబర్‌లో పెట్టిన డెడ్ లైన్ సెప్టెంబర్ దాటినా అమలుకాకపోతే దగాపడ్డ అన్నదాతలు ఇంకా ఎవరికి చెప్పుకోవాలి..? రూ. 49,500 వేల కోట్ల రుణమాఫీలో పావుశాతం కూడా చేయకుండా చేతులెత్తేసినందుకు రైతన్నలకు క్షమాపణలు చెప్పాలి రేవంత్ సర్కార్. ఇంకెంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే మీ కళ్ళు చల్లారుతాయి? రేవంత్ రెడ్డి ఢిల్లీ యాత్రలు చేయటం కాదు రాష్ట్రం లో ఏం జరుగుతుందో చూడు.. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు.. ధైర్యంగా ఉండాలని కోరుతున్నాను అని కేటీఆర్ తెలిపారు.

# బజారునపడ్డ రాజకీయం

కల్పించారని మండిపడ్డారు. ఆయన ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అంతకుముందు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరెకపూడి గాంధీ మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. భారాసలోనే కొనసాగుతుంటే తెలంగాణ భవన్‌కు రావాలని మరో సవాల్ విసిరారు. "భారాసతో పంచాయితీ తనకు లేదని అరెకపూడి గాంధీ అంటున్నారు. నాతోనే తన పంచాయితీ అని చెబుతున్నారు. మీతో నాకు భూతగాదాలు ఏమైనా ఉన్నాయా? భారాస బీ ఫాంపై గెలిచి కాంగ్రెస్‌లో ఎలా చేరతారు? రూ.కోట్లకు అమ్ముడుపోయారు. భూ పంచాయితీలో సెటిల్‌మెంట్ల కోసమే కాంగ్రెస్ గూటికి వెళ్లారు. ధైర్యముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలి. ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తేలిపోతుంది. అరెకపూడి గాంధీ భారాసలోనే ఉంటే తెలంగాణ భవన్‌కు రావాలి. అక్కడి నుంచి ఇద్దరం కేసీఆర్ వద్దకెళదాం. ఒకవేళ కాంగ్రెస్‌లో చేరితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. శుక్రవారం ఉదయం పార్టీ కార్యకర్తలతో కలిసి అరెకపూడి గాంధీ ఇంటికెళ్తాం. ఆయన మా పార్టీలో ఉన్నానని చెబుతున్నందునే వెళ్తున్నాం. గాంధీని సాదరంగా తోడ్కొని కేసీఆర్ ఇంటికి తీసుకెళ్తాం.గురువారం మధ్యాహ్నం మా ఇంటికి గాంధీ వస్తే ఇద్దరం కలిసి భోజనం చేస్తాం. తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి నేరుగా కేసీఆర్ వద్దకెళ్తాం. పార్టీ నుంచి వెళ్లిన ప్రతి ఎమ్మెల్యే గురించి నేను మాట్లాడను. కాంగ్రెస్‌లో చేరలేదని అరెకపూడి గాంధీ అన్నారు. మా పార్టీ ఎమ్మెల్యే కాబట్టే ఆయన ఇంటికి వెళ్తామంటున్నాం.. దీనిలో తప్పేముంది? నేను భారాసలో చేరిన రోజు కాంగ్రెస్‌లో ఉన్నది ఐదుగురే. ఐదుగురు ఎమ్మెల్యేలే ఉంటే భారాసలోకి పదిమందిని నేనెలా తీసుకెళ్తా. సీఎం రేవంత్‌రెడ్డికి ఏం సాయం చేశానో.. ఆయన్ను అడగండి" అని అరెకపూడి గాంధీని ఉద్దేశించి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**దాడి దుర్మార్గపు చర్య:హరీశ్**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నేతలు దాడి చేయటాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పట్టపగలే ఒక ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి హత్యాయత్నానికి ప్రయత్నిస్తున్నారంటే రాష్ట్రంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచి పోలీసుల సాయంతో అరికెపూడి గాంధీ అనుచరులు రెచ్చిపోయి దాడులకు పాల్పడటమేమిటని అన్నారు. రాష్ట్రాన్ని ఫ్యాక్షనిజం, రౌడీయిజానికి అడ్డాగా మార్చేస్తుండటం చూస్తుంటే బాధేస్తుందని అన్నారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించిన దాడేనని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. త కొన్ని రోజులుగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం చేస్తున్న కౌశిక్ రెడ్డిని ఈ ప్రభుత్వం టార్గెట్ చేసిందని అన్నారు. కావాలనే తనపై అక్రమ కేసులు, హత్యాయత్నాలకు పాల్పడి బెదిరించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఉడుత ఊపులకు బీఆర్ఎస్ బెదరదని కేటీఆర్ స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డిని చంపే కుట్ర చేస్తున్నారని ఆయనకు ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్తానన్న కౌశిక్ రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచిన పోలీసులు.. అరికెపూడి గాంధీని మాత్రం కౌశిక్ రెడ్డి ఇంటికి వచ్చేందుకు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది రౌడీలు కోడిగుడ్లు, రాళ్లతో దాడులు చేశారంటే పక్కా ముందస్తుగా ఎ÷–లాన్ చేసే ఈ దాడి చేశారని కేటీఆర్ అన్నారు. పూర్తిగా ప్రభుత్వం, పోలీసుల సహకారంతో కౌశిక్ రెడ్డిపై దాడి చేసే ప్రయత్నం జరిగిందన్నారు. ఇలాంటి చిల్లర చేష్టలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చూస్తుంటే జాలేస్తోందని అన్నారు.

**హైదరాబాద్ బ్రాండ్‌కు విఘాతం**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగిపోయింది. దమ్ముంటే కాస్కో అని ఒకరు అంటే.. తేల్చుకుందాం రా అని ఇంకొకరు అనడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ మాటల తూటాలతో ఇద్దరి వ్యక్తుల మధ్య నెలకొన్ని ఈ రచ్చ బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీల మధ్య గొడవగా మారిపోయింది. అక్కడితో ఆగని ఇరువురూ.. ఒకరిపై ఒకరు తిట్టిపోసుకున్నారు. కౌశిక్ ఓ బ్రోకర్ అని.. దమ్ముంటే బయటికి రా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి మరీ సవాల్ చేశారు గాంధీ. కట్టర్ తెలంగాణ బిడ్డనంటూ కౌశిక్ కౌంటరిచ్చారు. ఈ క్రమంలోనే కౌశిక్ ఇంటిపై కార్యకర్తలు, అనుచరులు టమోటాలు, గుడ్లతో దాడికి తెగబడ్డారు. ఈ వ్యవహారంతో ఒక్కసారిగా ఇది కాస్త ఉద్రిక్తంగా మారింది. ఈ ఉద్రిక్తతల మధ్యే గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు. సరిగ్గా ఈ పరిస్థితుల్లోనే మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు రంగంలోకి దిగారు. కౌశిక్‌ను పరామర్శించేందుకు ఆయన ఇంటికి హరీశ్ బయల్దేరి వెళ్లారు.' మీ చర్యల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పోయింది. మా బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడైనా ఇలాంటి దాడులు జరిగాయా? గాంధీపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలి. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి. దాడిపై సీఎం రేవంత్ రెడ్డి ఏం సమాధానం చెబుతారు?. ప్రజలకు రేవంత్ రెడ్డి ఇచ్చే సందేశం ఏంటన్నారు. ఖమ్మంలో మాపై దాడి చేస్తే ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదు. తెలంగాణలో లా అండ్ ఆర్డర్ ఉందా అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి దాడికి వస్తున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చాం. సమాచారం ఉన్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదు?. మీ చర్యల వల్ల హైదరాబాద్‌కు పెట్టుబడులు రావట్లేదు ' అని రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు కన్నెర్రజేశారు. రెచ్చగొట్టే చర్యలకు ప్రభుత్వం మద్దతు ఇస్తోందని మండిపడ్డారు.

**హైదరాబాద్ సీపీ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత**

హైదరాబాద్ సీపీ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది.సీపీ ఆఫీస్ కు వెళ్లిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తన ఇంటిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూసైబరాబాద్ సీపీ ఆఫీస్ లో పాడి కౌశిక్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. వారిని నిలదీసేలా మాట్లాడారు. కౌశిక్ రెడ్డితోపాటు హరీశ్ రావు, భారీగా బిఆర్ఎస్ నాయకులు సీపీ ఆఫీస్ కు వెళ్లారు. దీంతో హరీష్ రావుతో పాటు బీఆర్ఎస్ నాయకులను సైబరాబాద్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గులాబీ నేతలకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని.. ఏసీపీ,సీఐను సస్పెండ్ చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో పట్టపగలు ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగిందని.. బీఆర్ఎస్ కార్యకర్తలను గృహ నిర్బంధం, అరెస్టులు చేశారని మాజీ మంత్రి హరీష్ రావు అసహనం వ్యక్తం చేశారు. పైలెట్, ఎస్కార్ట్ ఇచ్చి తమ ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ వాళ్ళను దాడికి పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో తన క్యాంపు కార్యాలయంపైన కూడా దాడి జరిగిందని చెప్పారు. ఇటీవల ఖమ్మంలో వరద బాధితుల పరామర్శకు వెళ్తే కూడా తమపై దాడి చేశారని హరీశ్ రావు గుర్తు చేశారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అనుచరులు కొండాపూర్‌లోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన విషయం తెలుసుకున్న హరీశ్ రావు.. సిద్దిపేట నుంచి కౌశిక్ రెడ్డి నివాసానికి బయలుదేరి వచ్చారు. కౌశిక్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్



ప్రోత్సాహంతోనే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. రేవంత్ వెంటనే కౌశిక్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి అక్రమంగా చేర్చుకోవడంతో పాటు, వారినే తిరిగి ఉసిగొల్పి గులాబీ పార్టీ ఎమ్మెల్యేలపై దాడులు చేయించడం దుర్మార్గం అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.'కాంగ్రెస్ పార్టీలో చేరాను అని ట్విట్టర్లో పెట్టి.. ఇవాళ పీఏసీ చైర్మన్ అవ్వగానే నేను ప్రతిపక్షంలో ఉన్నా అని కూడా సిగ్గులేకుండా మాట్లాడింది నువ్వు అరికెపూడి గాంధీ. డిఫెన్సులో పడి నీ ఇజ్జత్, మానం పోయిందని ఇయాల ప్రశ్నిస్తే మా కౌశిక్ రెడ్డి మీద దాడి చేసే ప్రయత్నం చేశారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేసి పోలీసులు ఏం చేస్తున్నారు? కౌశిక్ రెడ్డిపై దాడి రేవంత్ రెడ్డి చేయించారు. ఏసీపీ, సీఐను వెంటనే సస్పెండ్ చేయాలి. కేసీఆర్ హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు కాపాడారన్నారు.అనంతరం సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేసేందుకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వెంటబెట్టుకొని కొండాపూర్ నుంచి మాజీ మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బయలుదేరి వెళ్లారు. తర్వాత సీపీ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత చోటు చేసుకుంది.

**స్టేషన్ బెయిల్‌పై గాంధీ విడుదల**

పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ స్టేషన్ బెయిల్‌పై నార్సింగ్ పోలీస్ స్టేషన్ నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలే యాదయ్య, ప్రకాశ్‌గౌడ్ తదితరులు గాంధీకి సంఘీభావం తెలిపారు. పోలీసులు ఇచ్చిన 41 నోటీసుకు వివరణ ఇచ్చినట్టు గాంధీ తెలిపారు. 'నన్ను ఆహ్వానిస్తేనే కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లా. కానీ, మాపై దాడి చేశారు. కౌశిక్ భార్య విల్లాపై నుంచి కుండీ, మొక్కలు మా కార్యకర్తలపై విసిరేశారు. 40 మంది నన్ను అడ్డుకున్నారు. ప్రాంతీయ విభేదాలు సృష్టించేందుకు కౌశిక్ ప్రయత్నించారు. నన్ను ఆంధ్రా వాడు అన్నారు. అదే భారాస విధానమైతే ఆ పార్టీ నాయకత్వం తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. లేకపోతే పార్టీ అధినేత కేసీఆర్.. కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి' అని గాంధీ డిమాండ్ చేశారు.

## గాజాలో ఇజ్రాయెల్ దాడిలో ఐరాస సిబ్బంది మృతి

జరుగుతున్నది ఏమాత్రం ఆమోద యోగ్యం కాదు. అంతర్జాతీయ మానవతాచట్టం ఉల్లంఘనలను వెంటనే ఆపాలి. యూఎన్ పాలస్తీనియన్ రిఫ్యూజీ ఏజెన్సీకి చెందిన ఆరుగురు సభ్యులు ప్రాణాలు కోల్పోయారు" అని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ విడిగా పోస్టు పెట్టింది. "నుసీరత్‌లోని పలు ప్రాంతాలు, ఒక పాఠశాలపై జరి గిన వైమానిక దాడుల్లో ఆరుగురు మా సహచర సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ స్థాయిలో నష్టం జరగడం ఇదే తొలిసారి. వారంతా శరణార్థులకు సాయంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. వారి కుటుంబాలకు మా ప్రగాఢ సాను భూతి తెలియజేస్తున్నాం. ఇక్కడ 12వేల మంది శరణార్థులు ఆశ్ర యం పొం దుతున్నారు. వారిలో మహిళలు, చిన్నారులే ఎక్కువగా ఉన్నారు. గాజాలో ఎవరూ సురక్షి తంగా లేరు.పాఠశాలలు, వాటి పక్కన ఉన్న ప్రాంతాలను ఘర్షణపరమైన ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని కోరుతున్నాం" అని అభ్యర్థించింది.

## భాజపా పాలిత రాష్ట్రాల్లో శాంతిభద్రతలు కరువు



ఘటనలు జరుగుతున్నా.. ఇంకా ఎంతకాలం కళ్లుమూసుకొని ఉంటారో..?" అని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు."మధ్యప్రదేశ్‌లో గ్యాంగ్‌రేప్, ఉత్తర్‌ప్రదేశ్‌లో వివస్త్రగా ఉన్న మహిళ మృతదేహాన్ని గుర్తించడం వంటి ఘటనలతో హృదయం ద్రవించిపోతోంది. ప్రతిరోజు 86 మంది మహిళలు అత్యాచారాలకు గురవుతున్నారు. ఇంటాబయట, రోడ్డుమీద, ఆఫీస్‌లో ఎక్కడా మహిళలకు భద్రత లేదు. ఈ పరిస్థితుల వల్ల దేశ జనాభాలో సగమైన స్త్రీల మనోధైర్యం దెబ్బతింటోంది. మహిళల రక్షణపై ప్రధానమంత్రి పెద్ద మాటలు చెప్తుంటారు. వారి రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకునే కట్టుదిట్టమైన చర్యల కోసం అంతా ఎదురుచూస్తున్నారు. ఆ ఎదురుచూపులకు ఎండ్ కార్డ్ ఎప్పుడు పడుతోందో..?" అని ప్రియాంకాగాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇండోర్ లోని మోవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణలో ఉన్న ఇద్దరు యువ ఆర్మీ అధికారులు తమ స్నేహితురాళ్లతో కలిసి సమీపంలోని ఓ పిక్నిక్ స్పాట్‌కు వెళ్లారు. అక్కడ కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వీరిపై దాడి చేశారు. తొలుత వారి వద్ద ఉన్న డబ్బు, నగలను బెదిరించి తీసుకున్న దుండగులు.. ఆ తర్వాత మహిళల్లో ఒకరిపై అత్యాచారానికి పాల్పడ్డారు.ఈ దాడి నుంచి తప్పించుకున్న ఓ ట్రైనీ ఆఫీసర్ పోలీసులు, ఆర్మీ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకునేసరికి దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. బాధిత మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. అత్యాచారం జరిగినట్లు నిర్ధరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేశారు. వీరికి గతంలో క్రిమినల్ రికార్డు ఉన్నట్లు గుర్తించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## స్పేస్‌ఎక్స్ ఘనత

భూమి చుట్టూ చక్కర్లు కొడుతోంది.జేర్డ్ ఇస్సాక్‌మన్, సారా గిల్లిలు ఒకరితర్వాత ఒకరు క్యాప్సుల్ నుంచి బయటకు వచ్చి స్పేస్‌వాక్ నిర్వహించారు. స్పేస్‌ఎక్స్ తయారు చేసిన స్పేస్‌సూట్‌ను పరీక్షించారు. వ్యోమగాములు స్పేస్‌వాక్ చేసిన మొదటి ప్రైవేట్ మిషన్ ఇదే. ఈ ప్రాజెక్టులో మొత్తం స్పేస్‌ఎక్స్ పరికరాలనే వినియోగించారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (ఎల్ఎ) శాఖ
**ఫారం - సి**
ప్రకటన
(చట్టంలోని సెక్షన్ 11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు గలదు)
(రూల్ 6/12 చూడండి)

గెజిట్ నెం:జిహెచ్ఎంసి-133 తేది: 04-09-2024
నెం.ఎ/332/ఎస్ఆర్‌డిపి/2024 తేది: 03-09-2024

తెలంగాణ ప్రభుత్వము / స్పెషల్ కలెక్టర్ (ఎల్ఎ) మరియు కమిషనర్, జిహెచ్ఎంసి వారు హైదరాబాద్ జిల్లా, బహదూర్‌పుర మండలం మీర్‌సాగర్ & అత్తాపూర్ గామములలో ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా ఎస్ఆర్‌డిపి క్రింద మీరాలం చెరువు నుంచి జూ పార్క్ ప్రతిపాదిత 45 మీటర్ల అడుగుల వెడల్పు రోడ్డు కోసం మొత్తం **1111.61 చ.గ.ల** విస్తీర్ణం గల భూమి అవసరమై ఉందని భావిస్తున్నారు.

కావున హైదరాబాద్ జిల్లా, బహదూర్‌పుర మండలం మీర్‌సాగర్ & అత్తాపూర్ గామములలో సుమారు **1111.61 చ.గ.ల** ప్రామాణిక కొలతలు గల భూమి కొద్దిగా ఎక్కువ లేదా తక్కువగా పైన తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు ప్రతిపాదించబడినది. సేకరణ కొరకు ప్రతిపాదించిన దాని యొక్క వివరణాత్మక వివరణ ఈ దిగువ విధంగా ఉన్నది.

| క్రమ సంఖ్య | అవరణలు నెం. | టైటిల్ రకం | భూమి రకం | విస్తీర్ణం చ.గ. | ఆసక్తి గల వ్యక్తి పేరు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు రకం | సంఖ్య | కట్టడాలు రకం | విస్తీర్ణం చ.గ. |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 19-4-438/ ఎ/4/1/ఎ | - | - | 78.15 | హసీబున్నీసా | స్కెచ్ ప్రకారం | | | | - | - | - | - |
| 2 | 19-4-438/ ఎ/4/1 | - | - | 70.58 | ఉమ్-ఎ-హబీబ్ అరిఫా | | | | | - | - | - | - |
| 3 | 19-4-274/10/3 | - | - | 59.88 | మహమ్మద్ ఇషాక్ | | | | | - | - | - | - |
| 4 | 19-4-274/ 10/3/1 | - | - | 67.47 | ఎం.ఎ.ఖాదర్ | | | | | - | - | - | - |
| 5 | 19-4-274/ 10/2/1 | - | - | 26.40 | మహమ్మద్ అబ్దుల్ ఖుద్దూస్&మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూమ్ | | | | | - | - | - | - |
| 6 | 19-4-274/10/2 | - | - | 34.00 | మహమ్మద్ వాజిద్ | | | | | - | - | - | - |
| 7 | 19-4-274/10/1 | - | - | 25.43 | మహమ్మద్ ఉస్మాన్ | | | | | - | - | - | - |
| 8 | 19-4-279/9/జి | - | - | 595.54 | మధుసూదన్ సింగ్ మరియు ఇతరులు | | | | | - | - | - | - |
| 9 | 19-4-280/బి/ 115/22/1/ఎ/ఎం | - | - | 19.16 | సయ్యద్ ఉమైద్ మహమ్మద్ షా | | | | | - | - | - | - |
| 10 | 19-4-282/1 | - | - | 20.00 | హఫీజ్ అబ్దుల్ అలీమ్ | | | | | - | - | - | - |
| 11 | 19-4-280/ఎ/1 | - | - | 115.00 | అలి బిన్ అఫ్జార్ | | | | | - | - | - | - |
| | మొత్తం | | | 1111.61 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, రీసెటిల్‌మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21 ఆఫ్ 2017)లో సముచిత పరిహారం, పారదర్శకత కొరకు హక్కు ద్వారా సవరించబడిన విధంగా భూసేకరణ, పునరావాస, రీసెటిల్‌మెంట్ చట్టం 2013 (కేంద్ర చట్టం 30/ 2013)లో సముచిత పరిహారం మరియు పారదర్శకత కొరకు హక్కు యొక్క సెక్షన్ -11(1)లో నిబంధనల క్రింద సంబంధితులందరికీ ఈ ప్రకటన చేయబడినది.

భూమి ప్లాన్ స్పెషల్ కలెక్టర్ (భూ.సే) మరియు కమిషనర్, జిహెచ్ఎంసి, హైదరాబాద్ కార్యాలయంలో ఏ పని రోజునైనా పనివేళల్లో పరిశీలించుకోవచ్చును. తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్ (భూ.సే) & కమీషనర్, జిహెచ్ఎంసి హైదరాబాద్-కం-సరియైన ప్రభుత్వం వారు సదరు చట్టంలోని సెక్షన్-12లో తెలిపిన మరియు నిర్దేశించిన విధంగా తమ పని తగు విధంగా నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర చట్టాలను చేయుటకు, భూమిలోనికి ప్రవేశించి భూమి సర్వే చేయుటకు, ఏ భూమి ఎత్తుపల్లాలను తీసుకొనుటకు, సబ్ సాయిల్ త్రవ్వటకు లేదా బోర్ వేయుటకు అధీకృత అధికారి అనగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, జిహెచ్ఎంసి, హైదరాబాద్ మరియు ఆయన సిబ్బందికి ఇందుమూలంగా అధికారమిస్తున్నారు.

చట్టంలోని సెక్షన్ 11(4) క్రింద స్పెషల్ కలెక్టర్ (భూ.సే) & కమీషనర్, జిహెచ్ఎంసి హైదరా బాద్ వారి ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి ఏ వ్యక్తి కూడా అట్టి భూమి యొక్క ఏదేని లావాదేవీలు లేదా లావాదేవీలకు కారణమయ్యే దేనిని అంటే అమ్మకం/ కొనుగోలు వగైరాలు చేయరాదు లేదా అట్టి భూములపై ఎటువంటి తాకట్టు రుణభారాలు కల్పించలేదు.

పరిహారం సంప్రదింపుల ద్వారా పరిష్కారానికి ఆసక్తిగల /ప్రభావితమయ్యే వ్యక్తుల నుంచి క్లెయింలు, సేకరణ కోసం అభ్యంతరాలు ఏమైనా ఉంటే భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి 60 (అరవై రోజులు) లోగా స్పెషల్ కలెక్టర్ (భూసే) & కమీషనర్, జిహెచ్ఎంసి హైదరాబాద్/ అధీకృత అధికారి వారి సమక్షంలో దాఖలు చేయవచ్చును.

సం/- స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఎ), జిహెచ్ఎంసి, హైదరాబాద్
సం/- స్పెషల్ కలెక్టర్ (ఎల్ఎ) & కమిషనర్, జిహెచ్ఎంసి, హైదరాబాద్
DIPR RO.No.249/LA/PP/Advt/Pub/2024-25


### వామపక్ష యోధుడు, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి

# సీతారాం ఏచూరి ఇకలేరు



సర్వేశ్వర సోమయాజులు ఏచూరి,కల్పకం దంపతులకు జన్మించారు. తండ్రి సర్వేశ్వర సోమయాజులు ఏచూరి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ కార్పొరేషన్లో ఇంజినీర్‌గా పని చేశారు. తల్లి కల్పకం ఏచూరి ప్రభుత్వ అధికారిగా ఉండేవారు. ఏచూరి బాల్యం ఎక్కువగా హైదరాబాద్‌లోనే సాగింది. భాగ్యనగరంలోని అల్ సెయింట్స్ హైస్కూల్లో ఆయన మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అనంతరం ఢిల్లీకి వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్లో చేరారు. 1970లో సీబీఎస్సీ సెకండరీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకర్‌గా నిలిచారు. సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఎకనామిక్స్‌లో బీఏ పూర్తి చేశారు. జేఎన్‌యూ నుంచి ఎంఏ పట్టా పొందారు. అనంతరం అక్కడే పీహెచ్డీ కోర్సులో చేరారు. అయితే అప్పటికే దేశవ్యాప్తంగా ఎమ్జ్గ÷న్సీ విధించడం.. ఏచూరీని అరెస్ట్ చేయడంతో పీహెచ్‌డీని కొనసాగించలేకపోయారు. సీతారం ఏచూరి రెండు వివాహాలు చేసుకున్నారు. ఆయన మొదటి భార్య ఇంద్రాణి మజుందార్ కాగా.. జర్నలిస్టు సీమా చిత్తీ రెండో భార్య. ఏచూరి రెండో భార్య సీమా చిస్తీ జర్నలిస్టు. తన భార్య తనకు ఆర్థికంగా సహకరిస్తుందని ఏచూరి ఒకసారి చెప్పారు. మొదటి భార్యకి ఒక కుమార్తె, కుమారుడు సంతానం ఉండేది. అయితే కుమారుడు ఆశిష్.. 2021 ఏప్రిల్ 22న కొవిడ్‌తో మరణించారు. తప్పు జరిగితే సహించలేని మనస్థత్వం ఏచూరిది. అందుకే చిన్నప్పటి నుంచే రాజకీయాల్లోకి రావాలనే కుతూహలం ఉండేది. విద్యార్థిగా ఉన్నప్పుడే ఎస్ఎఫ్ఎస్ఐ నేతగా 1974లో సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది.1975లో జేఎన్‌యూ విద్యార్థిగా ఉన్నప్పుడు కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై సీపీఎంలో చేరారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ బాధితుల్లో ఏచూరీ కూడా ఒకరు. ఎమర్జెన్సీ సమయంలో ఆయన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. జేఎన్‌యూ విద్యార్థి సమాఖ్యకు ఏచూరి మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్‌తో కలిసి జేఎన్‌యూను వామపక్షాలకు కంచుకోటగా మార్చారు. అనంతరం ఎస్ఎఫ్ఎస్ఐ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. 1984లో సీపీఎం కేంద్ర కమిటీలో చేరారు. 1990లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, 2005లో వెస్ట్ బెంగాల్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సీపీఎం మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేరళ విప్లవ సూర్యుడు వీఎస్ అచ్యుతానందన్‌కి ఏచూరి అత్యంత సన్నిహితుడు. ప్రజా సమస్యలను, ఇతర అంశాలపై గళం విప్పుతూ.. ఎగువ సభలో సీతారాం ఏచూరి గుర్తింపు పొందారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం 'కామన్ మినిమమ్ ప్రోగ్రామ్' ముసాయిదాను రూపొందించడం లో మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరంతోపాటు ఏచూరి కీలకంగా వ్యవహరించారు. 2004లో యూపీఏ సంకీర్ణ ప్రభుత్వ నిర్మాణంలోనూ ముఖ్య భూమిక పోషించారు.

**భౌతికకాయం ఎయిమ్స్‌కు అప్పగించనున్న కుటుంబ సభ్యులు**

రాజకీయ నేత, సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరికి అంత్యక్రియలు నిర్వహించరని పార్టీ తెలిపింది. ఆయన భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన తరవాత బాడీని ఎయిమ్స్‌కు అందచేస్తారు. ఆయనకు అంత్యక్రియలు నిర్వహించటం లేదని కుటుంబ సభ్యులు కూడా తెలిపారు. ఆయన బతికి ఉన్నప్పుడే.. తాను చనిపోతే.. తన పార్థివదేహాన్ని వైద్య పరీక్షల కోసం.. వైద్య విద్యార్థుల రీసెర్చ్ కోసం ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు ఆయన పార్థివదేహాన్ని ఢిల్లీలోని ఎయిమ్స్ మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యులు దానం చేయనున్నారు .మెడికల్ కాలేజీకి ఆయన పార్థివదేహాన్ని అప్పగించే ముందు.. ఢిల్లీలోని తన ఇంట్లో నివాళులు అర్పించనున్నారు. ప్రముఖులు, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నేతలు అనుచరులు. ఇప్పటికే చాలా మంది ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా తమ సంతాపం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో నివాళులు అర్పించిన తర్వాత.. ఆయనకు అంత్యక్రియలు నిర్వహించకుండా.. ఆ పార్థివదేహాన్ని ఢిల్లీ ఎయిమ్స్ మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యులు అప్పగిస్తారు.

# ర్యాగింగ్ చట్టరీత్య నేరం

- గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు
- జీవితాలు నాశనం చేసుకోవద్దు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** మహిళల రక్షణ,ఈవ్ టీజింగ్,ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై పాలిటెక్నిక్, డిగ్రీ, జేఎన్టీయూ కలశాలల విద్యార్థిని విద్యార్థులకు గురువారము వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి ఆధ్వర్యంలో అర్బన్ మండలంలోని అగ్రహారం శ్రీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావానికి ముఖ్య అతిధిగా హాజరై జిల్లా అఖిల్ మహాజన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైందని అన్ని విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ మొదటి దశలోనే కట్టడి చేయాలన్నారు.కలశాల యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లను, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని,తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురి చేయడం మంచి విద్యార్థి లక్ష్యం కాదన్నారు.విద్యార్థులు సీనియర్స్,జూనియర్స్ అనేది లేకుండా స్నేహపూర్వకంగా కలిసి మెలిసి విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని వారికి సూచించారు.ర్యాగింగ్ చేయడం నేరమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అయన హెచ్చరించారు.ర్యాగింగ్ కు పాల్పడే వారి వివరాలను డయల్ 100 కు తెలియజేసి సమాచారం అందించాలన్నారు.యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలాంటి వ్యసనాలకు బానిసై విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.విద్యార్థినిలు మహిళలు మౌనం విడి ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని,నిర్భయంగా ముందుకు వచ్చి మీ సమస్యలను చెప్పుకున్నాప్పుడే మరింత భద్రత ఏర్పాటు చేస్తామన్నారు.మహిళలు, విద్యార్థినిలు జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,సిఐ వీరప్రసాద్, ఎస్ఐలు రమేష్,అంజయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, జె ఎన్ టి యు కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చారి, షీ టీమ్ సిబ్బంది,భరోసా సెంటర్ సిబ్బంది, ఆయా కళాశాలల యాజమాన్యం,విద్యార్థిలు పాల్గొన్నారు.



# వినాయక నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తొద్దు

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- పటిష్ట మైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు : ఎస్పీ కిరణ్ కారే



**మహాదేవపూర్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** ఈ నెల 16, 17 తేదీల్లో కాళేశ్వరం వద్ద గోదావరి లో వినాయక నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కాళేశ్వరంలోని రాజరాజేశ్వర వసతి గృహంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కిరణ్ కారే తో కలిసి రెవిన్యూ పోలీస్ పంచాయతీ ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, నేషనల్ హైవే .విద్యుత్ అగ్నిమాపక వైద్య ఆరోగ్య మత్స్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఈనెల 16 17 తేదీల్లో కాళేశ్వరం వద్ద గోదావరిలో వినాయక నిమజ్జనానికి భూపాల్ పల్లి ములుగు వరంగల్ పెద్దపెల్లి జిల్లాల నుండి వినాయక విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని. కాళేశ్వరం గోదావరిలో వినాయక నిమజ్జనానికి వచ్చి భక్తులు ప్రశాంత వాతావరణంలో జరిగే అందుకు యంత్రాంగం సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా నిభంజన కార్యక్రమాలు పర్యవేక్షణకు అధికారులకు విధులు కేటాయించామని ఆయా శాఖల అధికారులు సిబ్బంది సిక్తుల వారిగా 24 గంటలు విధులు నిర్వహించాలని అన్నారు నిమజ్జనం చేయడానికి రెండు పాయింట్లు అలాగే రెండు క్రేన్లు ఏర్పాటు చేయడం జరిగిందని ట్రైన్స్ ద్వారానే విగ్రహాలు నిమజ్జనం జరుగుతుందని తెలిపారు నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు జిల్లా యంత్రాంగం నిర్దేశించిన ప్రదేశం వరకే అనుమతి ఉంటుందని భక్తులు సహకరించాలని సూచించారు నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సిస్టం చేశారు. అలాగే పంచాయతీరాజ్ డబ్బులు శాఖ ద్వారా భక్తులు త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు అంతరాయం లేకుండా విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఏదైనా సమస్య వచ్చిన విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యామ్ ఏర్పడుతూ సిద్ధంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మేఘ సంస్థ ద్వారా రెండు జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని గజాహితగాళ్లు లైఫ్ జాకెట్లు ధరించి సిద్ధంగా ఉండాలని మచ్చా శాఖ అధికారిని ఆదేశించారు ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ రహదారులపై గుంతలు ఏర్పడ్డాయని మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని తెలిపారు. మరుగుదొడ్లు గుర్తించే విధంగా సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు ఏదేని సమస్య వస్తే అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు తొమ్మిది రోజులపాటు నైవేద్యాలు అందుకున్న వినాయకుడు గంగమ్మ వడికి చేరుతాడని ఎలాంటి అపశ్రుతులకు అవకాశం లేకుండా భక్తి శ్రద్ధతో ప్రశాంతంగా నిమజ్జనోత్సవం జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు యంత్రాంగం సలహాలు సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణ కాటారం సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్ పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు రెండు రోజులు మద్యం విక్రయాలు నిలిపివేయాలని సూచించారు. అనంతరం ఎస్పీ కిరణ్ కారే మాట్లాడుతూ పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు శోభయాత్ర కొనసాగే మార్గాలలో పటిష్టమైన నిగా ఉంటుందని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రాణాలిక బద్ధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు భూపాల్ పెల్లి కాటారం మహదేవ్పురు ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని 24 గంటలు పని చేయు విధముగా అత్యవసర చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఈ సమావేశ కార్యక్రమాలు కాటారం సబ్ కలెక్టర్ మాయాంక్. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి డిపిఓ నారాయణరావు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గానసభలో సెవెన్ హిల్స్ సినీ గీతాల ఆలాపన



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** సెవెన్ హిల్స్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లయన్ అరిగిపూడి కృష్ణకుమారి విజయ్ కుమార్ దివ్య ఆశీస్సులతో మధుర గాయకులచే ' సెవెన్ హిల్స్ సినీ గీతాల' కార్యక్రమం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ముఖ్య అతిథి గా గుదిబండ వెంకటరెడ్డి, జీ వి ఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు హాజరుకాగా, కార్యక్రమాన్ని నవరస గాయని ఆమని ప్రార్థనా గీతంతో ప్రారంభించారు. తదుపరి రమాదేవి, షాలిని రమేష్, ఆనందలక్ష్మి, రమేష్ రేపాల, సుభాష్, ఆర్. నాగరాజు,శ్రీధర్ ఎస్ పరిగి, ఉదయ్ కుమార్, నందు, రవిచంద్ర మొదలగు గాయనీ గాయకులు చక్కటి పాటలు ఆలపించారు. వారిని ముఖ్య అతిథితోపాటు గాయని ఆమని సత్కరించగా, జనం సాక్షి చీఫ్ ఎడిటర్ ఎం ఎం రహమాన్ శుభాశీస్సులు అందించారు. గాయనీ గాయకులందరూ సాంస్కృతిక సేవకులు గుత్తుల మీరాకుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ సెవెన్ హిల్స్ సంస్థ అధ్యక్షులు వి. ఏడుకొండల రావు ధన్యవాదాలు తెలుపగా, చివరిగా అందరూ జాతీయ గీతాన్ని ఆలపించారు

# పాడి కౌశిక్ రెడ్డి మహిళలందరికీ క్షమాపణ చెప్పాలి

- చైతన్య మహిళా సంఘం డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మహిళల ధరించే చీరను, గాజులను చిన్నచూపు చూస్తూ అవి పనికిరాని వస్తువులుగా హేళనతో మాట్లాడిన మాటలకు యావత్ దేశ మహిళల కు క్షమాపణ చెప్పాలని చైతన్య మహిళా సంఘం డిమాండ్ చేస్తుంది. పార్టీ ఫిరాయింపులు చేసిన ఎమ్మెల్యేలకు చీర గాజులు పంపిస్తానని అవి కట్టుకొని తిరగండి అని అపహాస్యం చేస్తూ ప్రెస్ మీట్ లో మాట్లాడడటాన్ని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కో- కన్వీనర్స్ రాధ, శ్రీదేవి తీవ్రంగా ఖండించారు. మహిళల అవయవాలను బూతులుగా చేస్తూ వారి వస్త్రధారణకు సంబంధించిన, శరీర అవయవాలను అత్యంత అవహేళనగా చేస్తూ వేదికల మీద, సినిమాల్లో, టీవీ షోలో మాట్లాడటం సర్వ సాధారణం అయిపోయిందని, పురుషాధిక్యత పితృస్వామ్య భావజాలంతో నిండిన బుర్రల్లో మహిళలను ఎంత నీచంగా చూస్తున్నారో స్పష్టంగా కనబడుతోందని, ఎలక్షన్స్ సమయంలో మహిళల దగ్గరికి వెళ్లి అక్క, అమ్మ, తల్లి అంటూ మహిళలను ఓటు బ్యాంకుగా అడుక్కునే రాజకీయ నాయకులకు ఆ సమయంలో మహిళలు ధరించే చీరలు గాజులు కనబడలేదా? ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఆడవాళ్లను అవహేళన చేసి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. గాజులు, చీర ఎందుకు పంపాలని అనుకున్నారో మహిళలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన ఇంట్లో తల్లి భార్య కూతురు ఇవే ధరిస్తారని, వాళ్ళ సహాయం లేకుండా ఆయన కు ఒక్క క్షణం గడవదని, మరి అలాంటప్పుడు తమ ఇంట్లో వారిని అవమానపరిచేటట్లు మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఇతనికి ఓట్లు వేయడానికి వచ్చిన మహిళలందరూ కూడా ఇవే గాజులు చీరలు ధరిచారని తెలియదా.. అప్పుడు ఆయనకి ఇవి కనిపించలేదా.. ఆయనకు ఓటు వేసి గద్దినెక్కించిన మహిళల ను అందరినీ అవమాన పరిచే హక్కు కౌశిక్ రెడ్డికి లేదు.. వెంటనే ఎమ్మెల్యే పదవి నుంచి ఆయన దిగిపోవాలని డిమాండ్ చేశారు. మనువాద భావజాలంతో నిండిన రాజకీయ నాయకుల ఆలోచనలు క్షమించరానిది.మాట్లాడే టపుడు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని, కౌశిక్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని, లేదంటే కౌశిక్ రెడ్డి ఇంటిని ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

# ఏచూరి మృతికి చిన్నారెడ్డి సంతాపం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందడం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని , సంతాపాన్ని తెలిపారు. నాలుగు దశాబ్దాల కాలం నుంచి బడుగు వర్గాల అభ్యున్నతి కోసం, వారి హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని చిన్నారెడ్డి పేర్కొన్నారు. సీతారాం ఏచూరి చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని, తెలుగు రాష్ట్టానికి చెందిన సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు అని చిన్నారెడ్డి అన్నారు.

# సెల్ఫ్ హెల్ప్ గ్రూపు పథకానికి ప్రారంభం

- మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం: సీతక్క



**ములుగు, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని కోటి మహిళలను కోటీశ్వరులుగా మార్చడానికి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు మహిళలు 17 రకాల వ్యాపారాలు చేసుకోవడానికి ప్రభుత్వం రుణాలనుమంజూరు చేస్తున్నదని మంత్రి సీతక్క అన్నారు. గురువారం ములుగు మండలం మల్లంపల్లి గ్రామంలోని ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ మహాలక్ష్మి మిల్క్ పార్లర్, కోమలి డిజిటల్ స్టూడియో, బుక్ స్టాల్, జిరాక్స్, ఇంటర్నెట్ సెట్ సెంటర్, సునిత ఎంబ్రాయిడరీ వర్క్స్, శ్రీ వెంకటేశ్వర కిరాణం జనరల్ స్టోర్‌లను ప్రారంభించారు.అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో 20 ఎకరాల స్థలంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి మహిళలు ఒక అప్పగిస్తా మన్నారు. వడ్డీ లేని రుణాలను తీసుకుంటున్న మహిళలు సకాలంలో అప్పు చెల్లించాలని, తిరిగి పెద్ద మొత్తంలో అప్పు కోరిన మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ములుగు జిల్లాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి అన్ని పార్టీల నాయకులు ముందుకు రావాలన్నారు.

# 16, 17, 18 తేదీల్లో సింగూర్ ఉర్సు ఉత్సవాలు



**పుల్కల్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** పుల్కల్ మండల పరిధిలోని సింగూర్ గ్రామంలో ఈ నెల 16, 17, 18వ తేదిలలో 79వ ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సహేబ్ తెలిపారు. గత 79వ సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు కుల మతాలతకు అతీతంగా వేలాది మంది ప్రజలు పాల్గొంటున్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దర్గాను రంగు రంగుల దీపాలతో అందంగా అలంక రిస్తారు. ఎంతో పవిత్రత కల్గిన గంధం, చాదర్ ఇంటి నుండి తీసుకొని దర్గా లోకి తీసికెళ్లి కీలక ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. 17వ తేదిన పొద్దున కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం నాతే మై ఫీల్ సమ, అన్నదాన కార్యక్రమం ఉంటుదన్నారు. ముఖ్య అతిథులు అన్నసాగర్ పీఠాధిపతి హజ్రత్ సుఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ పాల్గొంటారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన ఈ ప్రకటనలో కోరారు.

# శ్రీ భద్రకాళి హుండీ ఆదాయం రూ.69,05,827



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** శ్రీ భద్రకాళి దేవాలయం హుండి లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. హుండీ ఆదాయం 69,05,827/- ఆదాయం సమకూరింది. 517 యూఎస్ఏ డాలర్లు మరియు 40 నేపాల్ రుపీస్ మరియు 50 సౌత్ ఆఫ్రికా ర్యాంట్స్ లభించాయి. హుండీలో వెళ్లినటువంటి మిశ్రమ వెండి మరియు బంగారం తిరిగి హుండీలో వేయనైనది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమానికి దేవాదాయశాఖ పరిశీలకులు సంజీవరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి 80 మంది సభ్యులు పాల్గొన్నారనీ దేవాలయ కార్య నిర్వహణ అధికారి శేషు భారతి తెలిపారు.



# అదుపు తప్పిన స్కూల్ బస్సు

- ప్రమాదం నుంచి బయట పడిన విద్యార్థులు

**పెద్దవంగర, సెప్టెంబర్ 12(జనం సాక్షి ) మండల** కేంద్రం పోలీస్ స్టేషన్ సమీపంలోని బ్రిడ్జి దగ్గర తొర్రూర్ కు చెందిన లిటిల్ ఫ్లవర్ స్కూల్ బస్సు గురువారం సాయంత్రం పిల్లలను స్కూలు నుండి ఇంటికి తీసుకెళ్తున్న సమయంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదం జరిగిందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సులో ఉన్నటువంటి విద్యార్థులకు ఎవరికి ఎలాంటి అపాయం జరగన్నందున విద్యార్థులు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ మరియు స్కూలు యాజమాన్యం మీద తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆదేశించారు.

# అనుమానస్పదంగా వివాహిత మృతి..



**కాసిపేట, సెప్టెంబర్ 11 (జనం సాక్షి) :** అనుమానస్పదంగా వివాహిత మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.స్టేషన్ పెద్దనపల్లికి చెందిన కావ్య ను అదే గ్రామానికి చెందిన యువకుడు సాయికిరణ్ తో మూడేళ్ల కిందట వివాహం జరిగింది.. విరి బంధానికి ఈ నెల 5న బెల్లంపల్లిలో ఆడపిల్లకు జన్మించారు. మూడు రోజుల తరువాత ఇంటికి వచ్చిన ఆమెకు మరల అనారోగ్యానికి గురికాగా మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె చెందిందని డాక్టర్ ధృవీకరించారని తెలపడంతో తమ సోదరి మృతి పై పలు అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఐ ధర్నా



**మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో జరిగిన నష్టానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించి తెలంగాణ రాష్ట్టానికి పదివేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించాలని కోరుతూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్టానికి వెంటనే పదివేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు 8 మంది ఎమ్మెల్యేలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి బిజెపి చేసిందేమీ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. చెరువులు తెగి దెబ్బతిన్న గ్రామాల అన్నింటిలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి నెల రోజులపాటు ఆహార పదార్థాలు అందించాలని కోరారు. ఇసుకమేటు వేసిన పంట పొలాలను ప్రభుత్వమే యంత్రాలతో శుభ్రం చేసి పంట అవసరానికి నిమిత్తమైన మట్టి పోసి రైతులకు పంటలు పండించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి కేవలం పర్యటనలు తప్ప రాష్ట్రంలో వరద సాయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం వారి ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలనే చూస్తుందని వారు ప్రభుత్వాలు లేని చోట పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు . ముఖ్యంగా జిల్లాలో వరద నష్టం ఎంత జరిగిందో అధికారులు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాల వల్ల ఇల్లు కూలిపోతే ఇల్లు కట్టిస్తాం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** కామారెడ్డి పట్టణంలోని ఆరవ వార్డు పాత రాజంపేట గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మల్లయ్యకు చెందిన ఇళ్ళు కూలి పోవటంతో వెంటనే స్పందించి ఆయన ఇల్లును గురువారం ఆర్ఐ నరసింహారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ త్వరలో ఎవరెవరి ఇండ్లు కూలిపోయాయో త్వరలో ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్ ఐ నరసింహారెడ్డి,వార్డ్ కౌన్సిలర్ ఆకులరూప రవికుమార్, పిడుగు మమత సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
13 సెప్టెంబర్ 2024

# మనసుకవి - మన సుకవి ఆత్రేయ



కారులో షికారుకెళ్లే పాల బుగ్గల పసిడి అందాలను వర్ణించాలన్న, ఈ సృష్టికే అందాన్ని తెచ్చి పెట్టిన శిలలపై శిల్పాలు చెక్కినారు అంటూ ప్రకృతి అందాలను వర్ణించాలన్న, ముద్దబంతి పువ్వులో పరిమళాలకు పాటలతో ప్రాణం పోయాల న్నా అది ఆత్రేయకు మాత్రమే సాధ్యం అనిపించేలా తెలుగు సినిమా సాహిత్యం తనదైన శైలిలో పాటల ప్రవాహాన్ని పరవళ్ళు పెట్టించారు."ఆత్రేయ"అంటేనే తెలుగు సినీ గీతాలకు ఒక ప్రత్యేకమైన ముద్ర. తన సరళమైన భాష, ప్రజా జీవనం నుండి స్ఫూర్తి పొందిన అద్భుతమైన పాటలతో తెలుగు సినీ సంగీతానికి ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆత్రేయ 1921 మే 7న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సుళ్లురుపేట మండలంలో గల మంగళం పాడు గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచి పద్యాలను రాగయుక్తంగా పాడటం అలవాటు చేసుకున్న ఆత్రేయ, 1942 క్విట్ ఇండియా ఉద్యమ ంలో భాగస్తులై ఆ తర్వాత దేశ విభజన జరిగిన తర్వాత హిందూ ముస్లింల మధ్య జరిగిన హింసను గురించి ఈనాడు నాటకాన్ని రచించారు. రాయల సీమ ప్రాంతంలోని కరువులను వర్ణిస్తూ మాయ నాటకాన్ని రచించారు. ఆ తర్వాత విశ్వశాంతి సామ్రాట్ అశోక్ బుద్ధ మొదలగు నాటకాలు రచించి నాటక రంగంలో ప్రసిద్ధుల య్యారు. ఆ తర్వాత తన మిత్రుడు సినిమా నటుడు జగ్గయ్య ప్రోత్సాహంతో సినీ రంగ ప్రవేశం చేసి 1950లో దీక్ష సినిమాకి గీతరచన అందించారు అదే సంవత్సరం సంసారం అనే చిత్రానికి కథా రచన చేశారు. 1961 లో వాగ్దానం సినిమాని నిర్మించి సినీ రంగంలో తన ప్రత్యేకతను చాటుకున్నారు. రాకరాక వచ్చే చందమామ అంటూ అర్ధాంగి చిత్రంలో అద్భుతమైన గీతాన్ని అందించారు. 'నేనొక ప్రేమ పిపాసినినీ ఒక ఆశ్రమ వాసవి" అంటూ ఇంద్రధనస్సు చిత్రంలో చిక్కనైన పాటను అందించారు. "చిన్నారి పొన్నారి కిట్టయ్య నిన్ను ఎవరు కొట్టారు" అంటూ స్వాతిముత్యం సినిమాలో అమాయకత్వానికి నిదర్శనాన్ని ఇచ్చే సాహిత్యాన్ని అందించారు. దాదాపు 1400 తెలుగు పాటలను అందించిన ఆత్రేయ ఒక మంచి కవి మనసు కవి మన సుకవి అంటూ చలనచిత్ర రంగంలో అనేకమంది తన గురించి ప్రస్తావించారు. ఈ పరిస్థితిలో అత్యంత ప్రభావవంతులైన పాటలు రచయిత లలో ఒకరు. ఆయన రచించిన పాటలు తెలుగు ప్రేక్షకుల హృదయాలను ఎప్పటికీ ఆకట్టుకుంటూ ఉంటాయి. ఆయన రచనలలోని సాహితీ ప్రతిభ బాబు చేయడం సంగీ తంతో కలిసిపోయి ఒక అద్భుతమైన అనుభవాన్ని అందిస్తాయి. ప్రారంభ జీవితం ఆత్రేయ విశాఖపట్నం జిల్లాలో జన్మించారు. చిన్నప్పటి నుండి కవిత్వం వైపు ఆకర్షితుల య్యారు. సినీ రంగంలోకి అడుగు పెట్టిన ఆత్రేయ తన మొదటి పాటతోనే ప్రేక్షకులను అలరించారు. ఆయన రాసిన పాటలు ప్రజల హృదయాలను తాకి, ఎప్పటికీ మరచిపోలే నివిగా నిలిచిపోయాయి ఆత్రేయ గారి పాటలు సరళమైన భాషలో, ప్రజల భావాలను ప్రతిబింబి స్తాయి. గ్రామీణ జీవనం, ప్రేమ, విరహం, సమాజ సమస్యలు వంటి అనేక అంశాలపై ఆయన పాటలు రాశారు. "పల్లెటూరులో జన్మించాను", "మనసు మాటలు", "చినుకు చినుకు రావే", "పాప నా ప్రాణం" వంటి పాటలు ఆయనకు ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టాయి.ప్రజా జీవనంపై అనుబంధంఆయన రాసిన పాటలు ప్రజల జీవితాలకు ఎంతో దగ్గరగా ఉంటాయి. ఆయన పాటల భాష చాలా సరళంగా ఉండటం వల్ల అందరూ అర్థం చేసుకోగలుగుతారు.ప్రేమ, విరహం, సమాజ సమస్యలు వంటి వివిధ అంశాలపై ఆయన పాటలు రాశారు. 1950 నుండి 1989 తన చివరి శ్వాస విడిచే వరకు 400 చిత్రాలకు పైగా పాటలో మాటలు అందించారు. అర్ధాంగి తోటి కోడలు మంచి మనసులు మూగమనసులు అంతస్తులు ప్రేమ నగరు మరోచరిత్ర ఇంద్రధనస్సు అంతులేని కథ స్వాతిముత్యం ఆరాధన శ్రీ వెంకటేశ్వర స్వామి మహత్యం జయభేరి మాంగల్య బలం వంటి చిత్రాలకు పాటలో మాటలు అందించారు. ఆయన రాసిన పాటలు కాలాన్ని మించి నిలిచి ఉంటాయి. తెలుగు సాహిత్య రంగానికి ఆత్రేయ చేసిన కృషిగాను బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాత్రైన డాక్టరేట్ తో సత్కరించింది. ఆత్రేయ రాసిన పాటలన్నీటిని తోడేకరించి 2007 సంవత్సరంలో "మనసుగతి ఇంతే"అనే పేరుతో పాటల పుస్తకాన్ని ప్రచురించారు. ఆత్రేయ తెలుగు సినీ గీతల చేతగా మాత్రమే కాకుండా తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించారు ఆయన రాసిన పాటలు ఎప్పటికీ తెలుగు ప్రజల హృదయాలలో నిలిచి ఉంటాయి.



**కవి సాహితి విశ్లేషకులు**
**పూసపాటి వేదాద్రి**

# అబద్దాల్లో అగ్రజుడు డొనాల్డ్ ట్రంప్

*కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విదేశాల్లో కూడా మన దేశంలో మాదిరే నిజం మాట్లాడడం నచ్చడం లేదు! తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్ నీతి వెనక ఈ రాష్ట్రం పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యం జీవన విధ్వంసం కాకుండా జీవించే హక్కు దాగి ఉన్నది.*



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా పోటీలో ఉన్న మాజీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, కమలా హారీస్ మధ్యన డిబేట్ జరుగగా ఫ్యాక్ట్ చెక్‌లో ట్రంప్ ఫెయిల్, హారీస్ పాస్ అయ్యారు. ఇందులో ఎవరు ఎన్ని అబద్దాలు చెప్పారు. ఎవరు ఎన్ని నిజాలు మాట్లాడారు, ఎవరు నిజాయితీగా సమాధానం చెప్పారు, అనే దానిమీద ఫ్యాక్ట్ చెక్ ఉంటుంది. ఇలాంటి డిబేట్ కోసం ఇండియా లోనూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మన పీఎం నరేంద్ర మోడీని ఆఫర్ చేశారు. అయితే కనీసం ప్రెస్ మీట్‌లో కూడ పాల్గొనడానికి సిద్ధం కాని మన పీఎం రాహుల్ ఆఫర్ ను కనీసం పట్టించుకోలేదు. నిజంగా అదే మన ఇండియాలో లో జరిగితే మన పీఎం అబద్దాలు చాలా పట్టుబడేవి! ఎన్నికలలో ఇచ్చిన హామీలు, వాటి అమలు అన్నీ అమెరికా లో జరిగే డిబేట్‌లో లెక్కకడుతారు.



**30,573 అబద్దాలు చెప్పిన ట్రంప్**

గతంలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడుగా ఉన్నపుడు నాలుగేండ్లలో 30,573 అబద్దాలు చెప్పినట్లు వాషింగ్టన్ పోస్ట్ పేర్కొన్నది. ఇంటర్నెట్ తర్వాత, మీడియా ఈకోసిస్టం వల్ల తప్పులు పట్టడంలో స్పీడ్ పెరిగింది. 2019లో ట్రంప్ 5,276 అబద్దాలు చెప్పాడని డేనియల్ డెల్ అనే జర్నలిస్ట్ పేర్కొంటాడు. 2018లో 1930 అబద్దాలు ట్రంప్‌వి రికార్డు అయ్యాయి. 1938లో కేవలం 23 మందిగా మాత్రమే ఉన్న ఫ్యాక్ట్ చెక్కర్ల సంఖ్య ఇటీవల 1933కు పెరిగిందని ఒక అమెరికా మీడియా సంస్థ ప్రకటించింది. కళాశాల చదువులు పూర్తి అయినా ఆడపిల్లలు ఎక్కువ ఫ్యాక్ట్ చెక్కర్స్‌గా ఉంటున్నారు అంటున్నారు. ఫ్యాక్ట్ చెక్కర్ల గొంతు ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్నది. రోనాల్డ్ రీగన్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్నపుడు పొల్యూషన్ వాహనాల కన్నా ఎక్కువ చెట్ల వల్ల వస్తుందని పేర్కొన్నాడు. అప్పుడు పెద్ద వివాదమే చోటు చేసుకున్నది. ఇక్కడ మన ఇండియాలో మన పీఎం తన పుట్టుకే బయోలజికల్ కాదని, తనతో ఈశ్వరుడు, మాట్లాడుతాడని,కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల పుస్తెల తాడు లాక్కుంటారని చెప్పినా జనం పట్టించుకోరు, మన ఫ్యాక్ట్ చెక్కర్ అపుడపుడు నిజాలు వెలికి తీస్తే ఆయన మీద కేసులు పెడతారు. అమెరికాలో ఒక ఛానల్ ఇటీవల నిర్వహించిన ప్రెసిడెన్షియల్ డిబేట్ లో సిఎన్ఎన్ నుంచి డేనియల్ డేల్ ట్రంప్ అన్నీ అబద్దాలు చెప్పి, డిబేట్ వన్ సైడ్ జరిగింది అంటాడు అన్నారు. ఏబీసీ ఛానల్ మోడరేటర్ కు ఫ్యాక్ట్ చెక్ భాధ్యతలు ఇచ్చారు. ఒక గేమ్ లో మాదిరి మోడరేటర్ ఎంపైర్ లా ఉంటాడు.

**దేశంలోకి ప్రవేశాలలోను అబద్దాలే..**

ఇతర దేశాల నుంచి వచ్చిన వారి విషయంలో అన్నీ ట్రంప్ అబద్దాలే చెప్పారు. తన పాలన సందర్భంగా ఆర్థిక వ్యవస్థ, విదేశీ నీతి,విదేశీయులు అమెరికాలో, కుక్కలు, పిల్లులు తింటున్నారని, అక్రమంగా దేశంలో ఇతర దేశాలవారు చొరబడిన వారి సంఖ్య పెరిగిందని,మాక్సికో నుంచి వస్తున్నారని, ఇలా ఆధారాలు లేని ఎన్నో అబద్దాలు ట్రంప్ చెప్పారు.

అమెరికాలో క్రైమ్ విషయంలోనూ అబద్దాలే చెప్పారని ఫ్యాక్ట్ చెక్కర్స్ చెబుతున్నారు. అమెరికాలో ఒపీనియన్ పోల్ కు చాలా ప్రాధాన్యతను ఇస్తారు. కమలా హారీస్ కు మద్దతు ఇచ్చిన ప్రముఖ సింగర్ టైలర్ స్విఫ్ మీద కూడ ఆరోపణలు చేస్తున్నారు. అమెరికాలో నాగరికులు కాని వారు ఓటు వేస్తున్నారని కూడ ట్రంప్ అబద్దాలు చెబుతారు. అదే కమలా హారీస్ ఆచి తూచి, అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ట్రంప్ చెప్పిన మాటలకు అసలు ఆధారలే లేవు!అయితే డిబేట్ ల లలో ఫ్యాక్ట్ చెక్కర్ల రిపోర్ట్ ప్రకారం అధ్యక్షుడు ఎన్నికల్లో గెలుపు ఓటములను అంచనా వేయలేము.

**ఇండియాలోనూ అమెరికా మాదిరి డిబేట్లు కావాలి :** మొత్తానికి ఇలాంటి డిబేట్‌లు ఇండియా లోనూ కావాలి, ఉండాలి అని బుద్ది జీవులు కోరుకుంటున్నారు.ఫక్తూ హిందూ, ముస్లిం, సిక్కు, ఈసాయి అంటూ, విద్వేష రాజకీయాలు చేసే వారికి మన్కి వన్సైడ్ బాత్ వినే అలవాటు అయిపోయింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విదేశాల్లో కూడ మన దేశంలో మాదిరే నిజం మాట్లాడడం నచ్చడం లేదు!

తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్ నీతి వెనక ఈ రాష్ట్రం పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యం జీవన విధ్వంసం కాకుండా జీవించే హక్కు దాగి ఉన్నది. అదే యూపీలో అక్కడి సీఎం యోగి ఆదిత్యనాథ్ బుల్డోజర్ నీతి లో ఒక సామాజిక వర్గం పట్ల విద్వేషం, విషం చిమ్మడం చూస్తున్నాము. ఇవన్నీ బంద్ కావాలంటే నిజం జనం తెలుసుకోవాలంటే, అమెరికాలో మాదిరి డిబేట్ లు, ఫ్యాక్ట్ చెకింగ్‌లు కావాలి.

# సమాజ పురోగతిలో కుటుంబ భాగస్వామ్యం పాత్ర



భారతీయ సంప్రదాయ సంస్కృతి రక్షణకు సమాజ పటిష్టతకు ద్రుఢత్వాన్ని అందిస్తూ సమాజ ఐక్యతకు సుసంపన్నమైన సామాజిక వ్యవస్థకు సమగ్ర రూపం ఇచ్చేది మన దేశ కుటుంబ వ్యవస్థ. భారతీయ సమాజం లో కుటుంభం ఒక అవిభాజ్య సంస్థ. ఆదిమ కాలం నుండి ఆధునిక కాలం వరకు కొనసాగుతూ సమిష్టి సంస్కృతికి విశిష్ట ప్రతీక కుటుంబ వ్యవస్థ .ఇతర దేశాలతో పోలిస్తే వసుదైక కుటుంబకం( ప్రపంచమే ఒక కుటుంభం ) అన్న భావన మన జాతి రక్తములో జీర్ణించుకు పోయింది. హైటెక్ జీవన శైలి ఆధునికీకరణ ప్రపంచీకరణ పరిణామాల ప్రభావం మారిన సమకాలీన సామాజిక ఆర్థిక పరిస్థితుల వల్ల కుటుంబ వ్యవస్థ బలిహీనమవడం.వల్ల ఏర్పడే దుష్ పరిణామాలను గ్రహించి ఐక్యరాజ్య సమితి 1993 మే 15 తేదీన అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం జరుపాలని నిర్ణయించింది. కుటుంబాల విలువలు కుటుంబ పెద్దల పట్ల ఆదరణ గౌరవం పటిష్ఠమైన కుటుంబ వ్యవస్థ పునరుద్దరణకు అవసరమగు కార్యాచరణ పట్ల ప్రజల్లో అవగాహన చైతన్యం కోసం ప్రపంచ వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తారు. ఈ సంవత్సరం "ఫ్యామిలీస్ అండ్ న్యూ టెక్నాలజీ" అనే నినాదాన్ని ఎంపిక.చేశారు. సమాజంలో ఆధునికత విదేశీ సంస్కృతి నాగరికత పెరిగి ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో మౌలిక మార్పులు జరుగుతున్నాయి (సంభవిస్తున్నాయి) . త్వరలోనే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగయ్యే పరిస్థితులు రానున్నాయి. నేటి రోజుల్లో ఎవ్వరూ ఫ్యామిలీ అంటే ఇష్ట పడటం లేదు.చిన్న కుటుంబాలు చింతలేని కుటుంబాలు నాటి సామెత నేడు చిన్న కుటుంబాలలో చింతలు ఎక్కువ గొడవలు వ్యసనాలు' గౌరవాలు తక్కువై వ్యక్తి కేంద్రంగా కుటుంబాలు రూపు మార్చు కుంటున్నాయి. ఒక నాడు సుఖ దుఃఖాలకు సంతోషాలకు ఆనందాలకు వేదికగా నిలిచిన కుటుంబ వ్యవస్థ నేడు అహానికి వ్యక్తి స్వార్థానికి కేంద్ర బిందువైంది. కలిస్తే కలహాలు పలకరింపులకు బదులు పగలు ప్రతీకారాలకు వేదికలుగా మారిన దౌర్భాగ్య స్థితి నెలకొంది.ఫ్యామిలీ అంటే ఇష్టంలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇష్టం లేకున్నా ఏదో తూ తూ మంత్రంగా ఇష్టం ఉన్నట్టు నటిస్తున్నారు. మనుషులతో కలవడానికి మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. మనుష్యులు అంటేనే జనాలకు అలెర్జీ పుడుతుంది. దగ్గరి వారు అంటే నచ్చడమే లేదు.

**ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగు కావడానికి కారణాలు:**

**అహం అధికారం**

సమాజములో పేరుకుపోయిన నిరక్షరాస్యత అనాలోచిత వైఖరి అతి తెలివి అహం ఇతరులను తక్కువగాచూసే మనస్తత్వం అధికార చెలాయింపు చిన్న తప్పును భరించే శక్తి , సహనం ఓర్పు లేకపోవడం

**స్వేచ్ఛా జీవనం**

కుటుంబంలో సంపూర్ణ ప్రజాస్వామ్యం రాజ్యమేలడం స్వేచ్ఛా యుత జీవనాన్ని కోరుకోవడం పెద్దల నియంత్రణ లేకపోవడం సమిష్టి భావన లోపించడం, పెద్దలు, పిల్లలు అందరు కూర్చొని భోజనం చేయక పోవడం మాట్లాడుకొక పోవడం.సమిష్టి బాధ్యతలు లోపించడం వల్ల ఉమ్మడికుటుంబాలు తగ్గి పోతున్నాయి. కుటుంబ సభ్యులు ఎంతసేపూ ఎంటర్ టైన్ మెంట్ ప్రోగ్రాంలలో మునిగి పోవడం. ఎక్కడో ఉన్న సినిమా నటులు ఈరోజు ఏమి చేశారో చెప్ప గలుగుతున్నారు. కానీ, ఇంట్లోని వారు ఎప్పుడు ఏమి చేస్తున్నారో చెప్పలేని దుస్థితి నెలకొంది. జవాబుదారీతనం లోపించింది.

**పెరుగుతున్న శాడిజం**

చిన్న పొరపాటుకు అలిగి దగ్గరి వారిని రక్తసంబంధం వున్న వారిని దూరం చేసుకుంటున్నారు. ఒకరి నోటి దురుసు తనం కాఠిన్యత సంకుచిత మనస్తత్వం శాడిజం కుటుంబాన్ని మొత్తం చిన్నా భిన్నం చేస్తుంది. పోటీతత్వం పోలికత్వం ఆర్థిక సమస్యలు సోషల్ స్టేటస్ విలాస జీవనం ఇతరులతో పోల్చుకొనే పోటీ తత్వం రాబడిని మించిన ఖర్చు ఇంటి పెద్దలు సరిగ్గా మేనేజ్ చేయలేక పోవడం వల్ల కుటుంబాలు పతమౌతున్నాయి.

**సామాజికవేత్తల ఆందోళన**

భార్యా' భర్తలు (తల్లి దండ్రులు) మధ్య అవగాహన లేకపోవడం ప్రతి చిన్న విషయానికి తగాదా పడుతూ ఉంటే ఇంటిల్లి పాది ఏదో దిగులుకు గురై ఇంటి నుండి వెళ్లిపోవడం. ఫ్యామిలీల్లో గొడవలు, కొట్లాటలు తగాదాలు చూసి ఫ్యామిలీ అంటే జడుసు కుంటున్నారు. అన్యోన్యత ఆత్మీయత అనురాగాలు, ప్రేమతో, అవగాహనతో ఉన్న ఫ్యామిలీస్ కనుమరుగై పవిత్రమైన పునాదుల కలిగిన ఉమ్మడి కుటుంబాలు దూరమై కుటుంబ వ్యవస్థపై నమ్మకం సడలి పోతుందని ఈ స్థితి పలు సామాజిక సమస్యలకు దారి తీస్తుందని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఒంటరితనం వ్యసనాలు**

కుటుంబ వ్యవస్థలోని మార్పులు పరిస్థితులు యువతను ప్రభావితం చేస్తున్నాయి .పిల్లలను హాస్టళ్లలో వుంచి చదివించడం వల్ల సురక్షిత భావన లోపించి ఒంటరితనం వ్యసనాలు పెరిగాయి .యువత లో మాదక ద్రవ్యాల ( డ్రగ్స్) వినియోగం పెరిగింది . వయసు 31 యేళ్లు దాటినా యువత పెళ్లి ముచ్చట ఎత్తడమే లేదు. గత నాలుగు దశాబ్దాలుగా కుటుంబాల్లో జరుగుతున్న మనస్పర్థలు, గొడవలతో విసిగి వేసారిన జనం ఫ్యామిలీ వ్యవస్థ వద్దు బాబోయ్ అని తమ పిల్లలకు నేరుగానే చెప్పే విచిత్ర పరిస్థితి దాపురించే సామాజిక ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయి.

**ప్రపంచీకరణ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ**

ప్రపంచీకరణ 'కార్పొరేట్ కల్చర్ ఆర్థిక స్థాయి ఆధునిక అవసరాలు, విదేశీ చదువులు విదేశీ కొలువులు ఆర్థిక వ్యత్యాసాలు, పోల్చుకోవడం పోటీ తత్వం తదితర కారణాల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నిలబడని స్థితి నెలకొన్నది.

**కుటుంబ విలువల క్షీణత**

కుటుంబాలలో మమత మానవీయత' నైతిక విలువలు సహకారం' ప్రేమ 'దయ 'కరుణ జాలి 'అంతరించాయి. వ్యక్తుల్లో భౌతిక వాదం పెరిగి స్వార్థపూరిత మనస్తత్వం పగలు ద్వేశాలు పెరిగాయి .మనుష్యులు అంటే విలువ లేదు. మనిషికి మరో మనిషి అంటే బోర్ వచ్చేసింది. మానవీయ బంధాలు అంతరించి "మనీ" సంబంధాలే బంధాలైనాయి. (రాజ్యమేలుతున్నాయి) అధిక జనాభా, విలాస జీవనశైలి తమ సుఖ సంతోషాలకు అడ్డు వచ్చిన వారిని అంతమొందించే హింసా ప్రవృత్తి కుటుంబాల్లో పెరిగి నేర సంస్కృతి నెలకొనడం గమనార్హం.

కౌన్సెలింగ్( మధ్యవర్తిత్వ) వ్యవస్థ లేకపోవడం. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై స్వేచ్ఛా స్వతంత్ర కుటుంబాల సంఖ్య పెరిగింది . కుటుంబాలలో ఏర్పడే వివాదాలు తగాదాలు తీర్చే పెద్దల కౌన్సెలింగ్ వ్యవస్థ లేదు. మధ్య వర్తిత్వం వహించే పెద్దలు వృద్ధులు ఓల్డేజ్ హోంల్లో ఉంటున్నారు. రాజీ కుదిర్చే వ్యవస్థ లేకపోవడం కుటుంబాలను కంట్రోల్ చేసే సామాజిక వ్యవస్థ లోపించడం వల్ల వ్యక్తుల ఇష్టాలకు ప్రాధాన్యత పెరిగింది.

**నిర్వహణ నైపుణ్యం**

గృహనిర్వహణ కుటుంబ నిర్వహణ గొప్పకళ. అనుభవం వయసుతో నిర్వహణ కళ అబ్బుతుంది కుటుంబ బడ్జెట్ రూప కల్పన గొప్ప కళ అందరికీ లేకపోవడం వల్ల కుటుంబ వ్యవస్థ అతలా కుతలం అవుతుంది.

**ఎవరికి వారే యమునా తీరే**

మెరుగైన మానవ సంభందాలు సత్ ప్రవర్తన సచ్ఛీలత మర్యాధలు అవగాహన కుటుంబ విలువలు పాటించే పరిస్థితులు క్షీణిస్తున్నాయి. మొండిగా మొరటుగా ప్రవర్తిస్తున్నారు. నేను నాభార్య/భర్త నా పిల్లలు అనే సిద్ధాంతం పోయి నాది నాదే అనే పాలసీ వచ్చింది. పిల్లలకు పెళ్లి కాగానే వేరు పడేయటం వేరు పడి సొంత ఇల్లు / అద్దె ఇల్లు తీసుకొని పెళ్లి చేసుకునే సంపూర్ణ స్వతంత్ర వ్యక్తుల సంఖ్య పెరిగపోవటం నూతన ఆచారమైంది. ఎవరికి వారే యమునా తీరే సంస్కృతి నెలకొంది.

**విలువల క్షీణత**

కుటుంబ విలువలు,కట్టు బాట్లు ఇక ఉండవు. ఇష్టారాజ్యం రోజులు వచ్చాయి. అన్నా దమ్ములు, అన్నా చెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ళ, భార్యా భర్తల మధ్య బలమైన బంధాలు ఇప్పుడు లేనే లేవు. సమస్త మానవ సంబంధాల స్వభావ స్వరూపాలు మారిపోయి కుటుంబ పరువు ప్రతిష్టలు మసక బారుతున్నాయి. మనిషి తత్వం అంతరించి" మనీ"తత్వం పెరిగింది

**నెట్టింట బంధాలు**

ప్రపంచీకరణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజిటలీ కరణ విస్తరించి డిజిటల్ ప్లాట్ ఫామ్ పైన ఉన్నటువంటి నెట్టింట (ఇంటర్నెట్) బందియైన సంబంధ బాంధవ్యాలే తమకి నిజమైనవి అని అపోహలో బతుకుతున్న జనం పెరిగి పోతున్నారు.

**ఆన్‌లైన్ శ్రద్ధాంజలి**

ఒక వ్యక్తి మరణిస్తే వాట్సాప్‌లో ఫేస్బుక్లో ఆకర్షణీయమైన మెసేజ్ పెట్టి అంతటితో వదిలేస్తున్నారు. తన శ్రద్ధాంజలి( సంతాపాన్ని) నలుగురి మధ్య ఘటించే ఓపిక లేకుండా బిజీ జీవనానికి అలవాటు పడటం శోచనీయం. మోయడానికి కూడా నలుగురు రాని పరిస్థితులు దాపురించాయి.

**సామాజిక ఉద్యమం**

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనానికి సమాజంలోని అన్ని వ్యవస్థలు సమాన బాధ్యత వహించాలి. కుటుంబ ప్రాముఖ్యత పాటించాల్సిన నైతిక సామాజిక విలువలు సూత్రాలు కట్టుబాట్లు విధులు బాధ్యతలు తెలియచేయాలి. వ్యక్తి సంస్కరణతో ప్రారంభం కావాలి. పటిష్ఠమైన కుటుంబ వ్యవస్థ వల్ల ఒనగూరే ప్రయోజనాల పట్ల స్వచ్ఛంద సాంస్కృతిక సంస్థలు అవగాహన కలిగించాలి. సుస్థిరమైన పటిష్ఠమైన కుటుంబ వ్యవస్థ సుస్థిరమైన పటిష్ఠమైన కుటుంబ వ్యవస్థ పునరుద్దరణకు సమాజం ప్రభుత్వాలు సమిష్టిగా కృషి చెయ్యాలి. కుటుంబాలలో నెలకొన్న విభేదాలను కుటుంబ పెద్దలు తొలగించాలి. కుటుంబాలలో ప్రేమ 'ఆప్యాయత అనురాగాలు' ఆత్మీయత 'అభిమానం సుఖ 'శాంతులు నెలకొల్పాలనే ఉదాత్త లక్ష్యాలతో సామాజిక పరివర్తన చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి. నైతిక విలువలు మానవీయ విలువలు పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి ప్రభుత్వం నూతన విద్యా విధానం లో నైతిక విలువలు మానవీయ విలువలను పాఠ్యాంశంగా చేర్చాలి. పాఠశాల కళాశాల స్థాయిలో హిందూ సంస్కృతి 'ఆధ్యాత్మికత' వేదాలు ఉపనిషత్తులు 'భగవద్గీత పారాయణం పట్ల విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించాలి. ఉమ్మడి కుటుంబం పవిత్రత ప్రాముఖ్యత పట్ల ప్రతి కుటుంబంలో చర్చించాలి .

సుద్రుధ కుటుంబ వ్యవస్థ ప్రతేక వ్యూహం ఆధునిక టెక్నాలజీ మోజులో పడి కుటుంబాలను అశ్రద్ధ చేయకూడదు ఆదునిక సాంకేతిక ప్రవాహంలో కుటుంబ వ్యవస్థ కొట్టుక పోకుండ సుదృఢమైన కుటుంబ వ్యవస్థ నిర్మాణమే లక్ష్యంగా. ప్రతేక సామాజిక వ్యూహాలను ప్రభుత్వాలు రూపొందించాలి. పర్యావరణం విధ్వంసం వల్ల జరిగే ఉపద్రవాల కన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనమైతే జరిగే సామాజిక ఆర్థిక ఉపద్రవాల గురించి మీడియా సినిమా ప్రచారం చెయ్యాలి. ప్రభుత్వం' స్వచ్ఛంద సామాజిక సంస్థలు ధార్మిక సంస్థలు మహిళా సంఘాలు యువజన సంఘాలు గ్రామ పంచాయితీలు సమిష్టిగా కృషి చెయ్యాలి. స్వాతంత్ర ఉద్యమ తరహాలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పునర్జీవనానికి బలమైన సామాజిక ఉద్యమాన్ని నిర్మించాలి.

నేదునూరి కనకయ్య
**అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**సామాజిక ఆర్థిక విశ్లేషకులు**
**ఫ్రీలాన్స్ రచయిత**
**9440245771**



# పీడిత తాడిత ప్రజల నేత సీతారాం ఏచూరి



దేశంలో పీడిత, తాడిత ప్రజల వైపు నిలబడి, వారి జీవితాల బాగు కోసం పాటుపడిన నేత, దేశంలో రాజీలేని జీవితం ఆయనది. రాజ్యం హింసను జంకు, బొంకు లేకుండా వ్యతిరేకించిన దిక్కార స్వరం ఆయనది. ఇప్పుడా స్వరం, ఎన్నో ప్రజా హిత వ్యాసాలు కూడ రాసిన ఆ నిర్మొహమాట కలం మూగవో యింది! ఆయనే సీతారాం ఏచూరి.

ఏచూరి ఇండియా కూటమి ఏర్పాటులోనూ ప్రధాన పాత్ర పోషించారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడారు. మహిళా రిజర్వేషన్ల కోసం పోరాడారు. రైతుల ఉద్యమానికి మద్దతుగా నిలబడ్డారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సిపిఎం ప్రధాన కార్యదర్శి. ప్రముఖ భారతదేశ రాజకీయ, కమ్యూనిస్ట్ యోధుడు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు, పలుమార్లు రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి ఈ నెల 12న ఢిల్లీలోని ఆసుపత్రి లో చికిత్స పొందుతూ ఊపిరి విడిచారు. ఏచూరి 12 ఆగస్టు, 1952లో చెన్నైలో జన్మించారు. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ రాజ్యసభ (2005–2017)లో కొనసాగారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా సీతారాం ఏచూరి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. విశాఖపట్నంలో జరిగిన సీపీఎం మహాసభల్లో అతను పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. సీనియర్ కామ్రేడ్ ఎస్.రామచంద్రన్ పిళ్లై పోటీ నుంచి వైదొలగటంతో సీతారాం ఎన్నికైనట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ అప్పట్లో ప్రకటించారు. అంతకుముందు సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కారత్ వరుసగా మూడుసార్లు (2010–2015) పనిచేశారు.

1974లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఎస్ఐ)లో సభ్యుడిగా ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఆ మరుసటి ఏడాదే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సభ్యునిగా చేరారు. అత్యవసర పరిస్థితికి కొంతకాలం ముందు ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. అత్యవసర పరిస్థితి ఎత్తివేసిన తర్వాత జేఎన్యూ విద్యార్థి నాయకునిగా ఏచూరి మూడుసార్లు ఎన్నికయ్యారు. 1978లో అఖిల భారత ఎస్ఎఫ్ఎస్ఐ సంయుక్త కార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి, సీపీఎం ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1985లో భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలో, 1988లో కేంద్ర కార్యవర్గంలో, 1999లో పొలిట్ బ్యూరోలో ఏచూరికి చోటుదక్కింది. 2005లో బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

పార్లమెంటు దృష్టికి ఎన్నో ముఖ్యమైన సమస్యలను తీసుకురావటంతో పాటు వాటిపై ప్రశ్నలు సంధించిన సభ్యునిగా రాజ్యసభలో ఏచూరి గుర్తింపు పొందారు. సమస్యలను సభ దృష్టికి తేవడానికి పార్లమెంటును అడ్డుకోవడాన్ని ఏచూరి సమర్థిస్తారు. ప్రజాస్వామ్యబద్ధ పాలనలో చట్టబద్ధమైన అంశమని పేర్కొంటారు. 2015 మార్చి 3న బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానానికి రాజ్యసభలో ఏచూరి సవరణలు ప్రతిపాదించారు. దీనిపై జరిగిన ఓటింగ్లో ఆయన సవరణ ప్రతిపాదన నెగ్గింది. రాజ్యసభ చరిత్రలోనే ఇలా జరగటం నాలుగోసారి. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించింది. అమెరికా విదేశాంగ విధానాన్ని ఏచూరి తీవ్రంగా వ్యతిరేకిస్తారు. భారత గణతంత్ర వేడుకలకు బరాక్ ఒబామా ముఖ్య అతిథిగా రావటాన్ని కూడా ఆయన వ్యతిరేకించారు. ఒబామా రాకను వ్యతిరేకిస్తూ, దేశవ్యాప్తంగా వామపక్షాలన్నీ నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. ఇస్లాం ఛాందసవాదం పెరగడానికి అమెరికాయే కారణమని ఏచూరి నిందిస్తారు. పశ్చిమాసియాలో అమెరికా సైనిక జోక్యం తీవ్రమైన అశాంతికి దారితీసిందని ఆరోపిస్తారు. అమెరికా సైనిక జోక్యం వల్ల ఛాందసవాదం పురుడుపోసుకుంటోందని, ఇటీవల ఇస్లామిక్ స్టేట్ సృష్టిస్తున్న మారణకాండయే నిదర్శనమంటారు. యావత్ ప్రపంచంపై అమెరికా పెత్తనపు ధోరణికి పాల్పడుతోందని ఏచూరి ఆరోపిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇంధన వనరులను దక్కించుకోవటా నికే, పెత్తనం కోసం అర్రులు చాస్తోందని విమర్శిస్తారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఇంధన రవాణా, వ్యాపారాన్ని నియంత్రించాలన్నదే అమెరికా లక్ష్యమంటారు. ఇదే కారణంలోనే పాలస్తీనా ప్రజలకు వారి మాతృభూమిపై చట్టబద్ధమైన హక్కు దక్కుకుండా సైన్యం జోక్యం చేసుకుంటోదన్నది ఏచూరి ఆరోపణ. జాతీయాంతర్జాతీయ అంశాలను అనర్గళంగా విశ్లేషించగలిగే ఏచూరి లోటు పూడ్చలేనిది. సీతారాం అమర్ రహే! అద్భుతమైన మీ ప్రజా జీవితం చిరస్మరణీయం.

**ఎండి.మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**విశ్లేషకులు, 9951865223**

## ఆమె కథ..!

పశుత్వపు పాదముద్రల్లో ఇంకిన సౌకుమార్యాల
కన్నీళ్ళు
మదాంధ ముళ్లపొదల్లో పీలికలై ఎగురుతున్న
అందాల ఆఖరి ఆనవాళ్ళు
గుండె నెత్తుర్లు కాలువలు కట్టిన అతివల
అంతరంగ సౌందర్యాలు
వివర్ణమై వెక్కిరిస్తూన్న ఆకాశంలో సగం
వెలుతుర్లు
చేతన నుండి అచేతకు జారిపోతున్న అమృత
హస్తాలు
అమ్మను కూడా పరిగెత్తించే ఆబోతుల
రాజ్యంలో బొమ్మలు విరిగిపోక ఏంచేస్తాయ్!
వచ్చింది అమ్మస్థానం నుంచి పెరిగింది అమ్మ
స్తనం తాగి...
అమ్మను బొమ్మ చేసి ఆడుకొని విరిచేసి...
ఆ వికృతానందమే మగతనమనుకొని రొమ్ము
విరుచుకొని తిరుగుతోంటే అలాంటి పశువులు
మధ్య అబల ఎంతని పరిగెడుతుంది...
దొరికినపుడల్లా తనువు చాలిస్తుందంతే
ఆత్మవంచననే విత్తులు నాటి అవినీతి,
అకృత్యాల ఫలాల కాపు దించుకొంటూ
జీవితాల్ని అన్యాయమనే విషసర్పంతో
పెనవేసుకొని దుర్మార్గాల బురదల్లో
మానవత్వాల్ని పారేసుకొని తొక్కుకుంటూ
తోసుకొంటూ సాగిపోతున్నాం ఏ దిశగానో...?

**భీమవరపు పురుషోత్తమ్**

# రోగుల పట్ల నిర్లక్ష్యం వద్దు

**పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ**

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వన్ కుమార్**



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 12 జనం సాక్షి):**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ పట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవల గురించి మెడికల్ ఆఫీసర్ ను మరియు పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది రోగుల పట్ల సానుకూల దృక్పథంతో ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫార్మసీ స్టోర్ లోని మందులను, లాబరేటరీని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ రిజిస్టర్ లను, వ్యాక్సిన్ నిల్వ ఉంచు ఎల్ ఆర్ మరియు డీ ఫ్రిడ్జ్ లను తనిఖీ చేశారు. వీటి నిర్వహణ పట్ల వైద్యాధికారి మరియు సిబ్బందికి తగు సూచనలు చేయడం జరిగింది. ప్రజలకు అంటువ్యాధుల గురించి, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని, అన్ని రకాల జ్వరాలు డెంగ్యూ జ్వరాలు కావని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భవతులకు అన్ని రకాల పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేయించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. డిఎంహెచ్ఓ పాటు డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ బుచ్చిబాబు ఉన్నారు.

# కుట్రపూరిత రాజకీయాలకు స్థానం లేదు

**ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతూ ప్రజల ఆశీర్వాదంతో నిస్వార్ధ రాజకీయాలలో క్రియాశీల పాత్రను పోషిస్తున్న తనపై అవకాశవాద రాజకీయాలు, బ్రోకర్ రాజకీయాలకు పాల్పడుతూ భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) పార్టీ పతనానికి మూల కారణమైన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాచికలు తెలంగాణ రాష్ట్రంలో పారే అవకాశం లేదని, ఇకముందు కూడా అతని ఎత్తులను, జిత్తులను అడ్డుకొని తీరుతామని శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ గత మూడు, నాలుగు రోజులుగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిచ్చి పట్టిన తీరుగా మాట్లాడుతూ, ఓవైపు కాంగ్రెస్ పార్టీని... మరోవైపు ఎమ్మెల్యేలను అడ్డగోలుగా దూషిస్తూ వ్యక్తిగత జీవితాలపైకూడా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నప్పటికీ సభ్య సమాజంలో ఇది కరెక్ట్ కాదని తాను ఎన్ని రోజులు స్పందించలేదని, చివరకు నా ఇంటికి వచ్చి నా పైనే దాడి చేస్తానని సవాళ్లు విసురుతున్నా స్పందించకుంటే శేరిలింగంపల్లి ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అరికపూడి అభిమానులు చూస్తూ ఊరుకోరని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యేగా పాడి కౌశిక్ రెడ్డి విజయమే పరమ దరిద్రం అని, ఓట్లేసి గెలిపించకుంటే ఆత్మహత్యకు పాల్పడతానని హుజూరాబాద్ వాసులను బెదిరించి సాధించిన గెలుపు ఒక గెలుపని నేను భావించానని, అలాంటి చిల్లర వ్యక్తి ఎలాంటి అవినీతి మచ్చ, రాజకీయ భేదాభిప్రాయం లేని తనలాంటి వ్యక్తిపై సవాళ్లతో కూడిన వ్యక్తిగత దూషణకు దిగడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇష్టారీతిన వ్యవహరించే హక్కు ఎవరికీ లేదని, ప్రజల ఓట్లతో, వారి నమ్మకంతో గెలిచినప్పుడు వారి మనోభావాలు దెబ్బ తినకుండా నడుచుకోవడం ప్రతి ఎమ్మెల్యే బాధ్యతగా ఆయన అభివర్ణించారు. పాడి కౌశిక్ రెడ్డి పై తాము దాడి చేయలేదని, కేవలం నిరసనను వ్యక్తం చేయడానికి కొండాపూర్ లోని కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లడం జరిగిందని, ఆ సమయంలో భావోద్వేగానికి గురైన ఒకరిద్దరు కార్యకర్తలు కొద్దిగా తొందరపడ్డారని, అంతమాత్రానికి తాము దాడి చేసినట్టు కాదని ఎమ్మెల్యే అరికెపూడి వివరించారు. ప్రజలకు తాను సేవ చేస్తున్న విధానం, మచ్చలేని రాజకీయాలను కొనసాగిస్తున్న వైనాన్ని పరిగణలోకి తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తనకు పిఎసి( ప్రజాపద్దుల కమిటీ) చైర్మన్ పదవిని కట్టబెట్టిందని, దానికి మరింత వన్నె తెచ్చే విధంగా భవిష్యత్ కార్యాచరణ ఉండబోతుందని ఎమ్మెల్యే అరికెపూడి తెలిపారు. పాడి కౌశిక్ రెడ్డి లాంటి చిల్లర వ్యక్తులు వెయ్యి మంది ఒకసారి వచ్చినా తనను టచ్ చేయలేరని... తన అభిమానులు, శేరిలింగంపల్లి ప్రజలే తన బలమని అరికెపూడి గాంధీ భరోసాని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



**కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేసిన వర్కింగ్ జర్నలిస్టులు**

**చేవెళ్ల,సెప్టెంబర్ 12 (జనంసాక్షి)**

నిబంధలనకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వర్కింగ్ జర్నలిస్టులు గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావుకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల వర్కింగ్ జర్నలిస్ట్ మద్దెల సురేందర్ మాట్లాడుతూ...అక్రెడిటేషన్ ఉన్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీపై 2024 జులై 15వ తేదీన జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు ప్రొసీడింగ్‌ను విడుదల చేశారని తెలిపారు. ప్రొసీడింగ్ పత్రంతో పాటు అక్రెడిటేషన్ (జర్నలిస్ట్? గుర్తింపు కార్డును జోడించి) తన కుమారుడు చదువున్న చేవెళ్లలోని వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో అందజేయగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వేణు కుమార్ దురుసుగా మాట్లాడరని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలో రూల్స్?? మాట్లాడితే పనులు జరగవని, ఎవరు సక్కగ పనిచేస్తున్నారని, కలెక్టర్, సంబంధిత శాఖ మంత్రి ఎవరూ సక్రమంగా పనిచేయడం లేదని ప్రిన్సిపాల్ మాట్లాడడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఈ విషయమై సెల్ ఫోన్‌లో రికార్డు చేసి కలెక్టర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తాననగా దిక్కున్నచోట చేసుకో అని అవమానకరంగా మాట్లాడడం బాధకలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పాఠశాల యాజమాన్యంపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరామని, దీనికి కలెక్టర్, డీఈవో సానుకూలంగా స్పందించారని వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్, డీఈవోను కలిసిన వారిలో వర్కింగ్ జర్నలిస్టులు మద్దెల సురేందర్, ప్రవీణ్ కుమార్, స్థానికుడు సాయి తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**




రోడ్డు ప్రమాదాలు జరగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిరా బోయి అన్నారు. గురువారం ఐడిఓసి లో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల విషయంలో ఏర్పాటుచేసిన రోడ్డు భద్రత జిల్లాస్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది అత్యంత ప్రాధాన్యమైనదని, మానవ తప్పిదాల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఈ రోడ్డు ప్రమాదాలలో 18 నుండి 45 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారు ఎక్కువగా చనిపోతున్నారని, వీటిని నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే 44, 167 మరియు స్టేట్ హైవే 20 పై పోలీస్ అధికారుల ద్వారా కనుగొన్న బ్లైండ్ స్పాట్ల వద్ద రేడియం స్టికర్లతో కూడిన సూచికలను ఏర్పాటు చేయాలని, రహదారుల పై వాహన వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్స్ ను అవసరమైన చోట ఏర్పాటు చేయాలని, రహదారులపై కెమెరాలు, లైట్లు, స్పీడ్ కెమెరాలు, పాదచారులు రోడ్డు దాటే చోట జీబ్రా క్రాసింగ్, లైటింగ్, రోడ్డు రిఫ్లెక్టింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని, తమ వాహనము ఎంత వేగంతో వెళ్తున్నది వాహన చోదకున్ని అలెర్ట్ చేసేలా రోడ్లపై వేగాన్ని సూచించే డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వాహనదారులు రహదారిపై వచ్చే వాహనాలకు ఎదురుగా వెళ్లకుండా అవసరమైన చోట సర్వీసు రోడ్లను నిర్మించేందుకు సంబంధిత శాఖ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. పోలీస్ శాఖ ద్వారా కనుగొన్న బ్లైండ్ స్పాట్లను పోలీస్ శాఖ మరియు రవాణా శాఖ మరోసారి ఆ స్థలాలను పరిశీలించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎస్పీ డి. జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అడిషనల్ ఎస్పీ రాములు, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, రవాణాశాఖ అధికారి, మహబూబ్నగర్ డిఎస్పి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈ ఈ, ఎల్టి మరియు ఆయా సంస్థల అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకర్లు సకాలంలో పంట రుణాలను అందజేయాలి



**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

బ్యాంకర్లు సకాలంలో పంట రుణాలు అందజేసి రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి డిసిసి డీఎల్ఆర్సి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..2024 -25 లో 3061.11 కోట్ల రుణ ప్రణాళిక లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఎన్‌పిఏ అవుట్ స్టాండింగ్ పై చర్చించారు. యూనియన్ బ్యాంకు వారు వడ్డీ శాతం చాలా తక్కువగా ఉన్నదని తెలిపారు. పీఎం ఈజీవై టార్గెట్ పై ఎస్‌బిఐ అధికారులకు, బ్యాంకుకు లేఖ రాయాలని ఆదేశించారు. వ్యవసాయ పంట రుణాలను అన్ని బ్యాంకులు రెన్యువల్ చేసి కొత్త రుణాలు ఎక్కువగా ఇవ్వాలని పనులు వేగవంతం చేయాలన్నారు.ఈ సందర్భంగా మహిళా శక్తిపై చర్చించారు. మహిళా శక్తి పై చేసిన ప్రతిపాదనలపై బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా ఆర్బిఐ అధికారి మాట్లాడుతూ ఆర్బిఐ వజ్రోత్సవాల సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు ఆన్లైన్లో పోటీపరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎల్ఎం స్కీం ఎంకరేజ్ చేయాలని కోరిన బ్యాంకర్లు పీఎం ఈజిపి ప్రాజెక్టు కాస్ట్ మూడు లక్షలు ఉంటుందని తెలిపారు. అనంతరం కేంద్ర ఐటి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పిఎంఈ జీపి ద్వారా వందమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించడం కోసం 100 మాడల్ కామన్ సర్వీస్ సెంటర్లు ను స్థాపించేందుకు కలెక్టర్ అనుమతి మంజూరు చేస్తూ ప్రాజెక్టు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ట్రైని కలెక్టర్ గారిమా నరుల,విజయ్ కుమార్ యల్‌డిఎం.డిఆర్డిఏ మొగులప్ప, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్, డీఎండబ్లు ఓఎంఏ. రషీద్, ఆర్బిఐ ఎల్‌డిఓ దేబోజత్ బరువ, నాబార్డ్ అధికారి షణ్ముఖ చారి, లీడ్ బ్యాంకు మేనేజర్ విజయ్ కుమార్‌తో పాటు ఏపీజీవీబీ, యుబిఐ, కెనెరా, యూకో, ఐసిఐసిఐ, డిసిసిబి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగ్యూ రోగులకు ప్లేట్ లైట్స్ అందించే సౌకర్యం

**జిల్లా కలెక్టర్ సంతోష్**



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 12 (జనం సాక్షి)**

డెంగ్యూ రోగులకు ప్లేట్‌లెట్స్ అందించే సౌకర్యం మరింత మెరుగుపరుచుటకు బ్లడ్ బ్యాంక్‌లో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ మిషన్‌ను జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ ప్రారంభించారు. గురువారం గద్వాల ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ మిషన్‌ను కలెక్టర్ వైద్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగ్యూ వంటి వ్యాధులలో రోగుల ప్రాణాలను కాపాడటంలో ప్లేట్‌లెట్స్ అత్యంత కీలకమని వివరించారు. మిషన్ ద్వారా రోగులకు అత్యవసర సమయంలో ప్రాణాధారమైన ప్లేట్‌లెట్స్‌ను సమయానికి అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. డెంగ్యూ వంటి రక్త సంబంధిత వ్యాధుల కారణంగా ప్లేట్‌లెట్స్ అవసరమయ్యే సమయంలో, దూరంగా ప్రయాణించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ సదుపాయం అందుబాటులో ఉందని, ప్రజలందరూ అవసరమైనప్పుడు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని నూతన సాంకేతిక తలు మరియు పరికరాలు అందుబాటులోకి తీసుకోస్తామని అన్నారు. వైద్యాధికారులు మరియు టెక్నీషియన్లను సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ మిషన్ ఎలా పనిచేస్తుందో, మిషన్ యొక్క పూర్తి ప్రక్రియను కలెక్టర్ కు వివరించారు. వైద్య సిబ్బంది ఈ సాంకేతికతను సమర్థంగా ఉపయోగించి ప్లేట్‌లెట్స్ అవసరమైన రోగులకు తక్షణ సహాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛత మరియు వ్యాధి నివారణ చర్యలను పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులకు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్క వైద్యాధికారి, సిబ్బంది తమ బాధ్యతను మరింత నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి, వారి ఆరోగ్యాలను కాపాడే దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ వినోద్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ పార్వతమ్మ ,డా.మాదవి, అసోసియేట్ పాతాలజిస్ట్, మెడికల్ ఆఫీసర్ వృషాలి, ఇతర వైద్యులు, టెక్నీషియన్ రామ కృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెడితే చర్యలు

**ఎస్పీ యోగేష్ గౌతమ్**



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబి పండగల సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేష్ గౌతం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాజకీయంగాను, కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్ బుక్, ఇన్స్టాగ్రాం ఇంస్టాగ్రామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్‌నీ బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయి అని తెలిపారు.సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపైన ప్రత్యేకంగ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది కావున ఈ తరహా నేరలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.




# మైనర్ బాలిక అత్యాచారం, హత్య

- నిందితులకు మరణశిక్ష
- 27ఏండ్ల తర్వాత మరణ శిక్ష విధించడం ఇదే తొలిసారి
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

**సంగారెడ్డిప్రతినిధి, సెప్టెంబర్ 12(జనంసాక్షి)**

మైనర్ బాలిక పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులకు ఉరిశిక్ష పడింది. 27ఏండ్ల తర్వాత మరణ శిక్ష విధించడం ఇదే తొలిసారని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియా సమావేశంలో తెలిపారు. బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చింతల శ్రీనివాస్‌రావు కూతురును నిందితుడు గఫార్ మద్యం మత్తులో కూల్‌డ్రింక్ ఇప్పిస్తానని చెప్పి అందులో మద్యం కలిపి పాపకు తాగించాడు. అపై పత్తి చేనులో ఆ పాప పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తుందేమోనన్న అనుమానంతో పాపను హతమర్చాడు. తండ్రి శ్రీనివాస్ రావు ఫిర్యాదు మేరకు గఫర్‌ను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చాగా గౌరవ స్పెషల్ ఫోక్సో జడ్జీ జయంతి నిందితునికి ఉరి శిక్షణను విధించినట్లు ఎస్పీ తెలిపారు. బాధితురాలి రక్త సంభందికులకు 10 లక్షల నష్ట పరిహారం ఇవ్వవలసిందిగా గౌరవ న్యాయస్థానం ఆదేశించినట్లు తెలిపారు.

# 24 కోట్ల రూపాయలతో జేఎన్‌టియూ నూతన భవన నిర్మాణాలకు శ్రీకారం

- విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో సెప్టెంబర్12 (జనంసాక్షి)**

వనపర్తిలోని జేఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాలకు త్వరలోనే నూతన భవనాల నిర్మాణాలను ప్రారంభిస్తామని, ప్రభుత్వం ఇట్టి నిర్మాణాలకు 24 కోట్ల రూపాయలను మంజూరు చేసి ఉందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. గురువారం వనపర్తి పట్టణ శివారులోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలలో ఏర్పాటు చేసుకున్న గణనాథునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తిలోని జేఎన్టీయూ కాలేజీలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు తాను ఎల్లవేళలా సహకరిస్తారని ఎంఎల్ఏ అన్నారు. విద్యార్థులు కళాశాలకు వచ్చిపోయేందుకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందువుతోందని తన దృష్టికి వచ్చిన వెంటనే ఆర్టిసి డిపో మేనేజర్‌తో మాట్లాడి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యే చూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యశీల రెడ్డి శ్రీహరి రాజు తదితరులు పాల్గొన్నారు.

**ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని వినియోగంలోకి తీసుకరండి**

వనపర్తి పాత మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సందర్శించి పరిశీలించారు.కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ భవన సముదాయం నిరుపయోగంగా ఉందని ఉపయోగంలోకి తీసుకురావాలని మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ను ఆయన ఆదేశించారు. విద్యాలయాలకు సంబంధించి సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతూ లక్షల రూపాయల అద్దె చెల్లిస్తున్నామని అలాంటి అవకాశాన్ని కూడా మార్కెట్ యార్డ్ సద్వినియోగపర్చుకొనె సూచించారు. వీలైనంత త్వరగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను టౌన్ హాల్ను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, కౌన్సిలర్లు నక్క రాములు శరవంద మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు సురేష్ లతీఫ్, నాయకులు సత్యశీల రెడ్డి శ్రీహరి రాజు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

- డంపు యార్డుల్లో బయో మైనింగ్ పనులు వేగవంతం చేయాలి
- రోజుకు 1500 మెట్రిక్ టన్నుల చెత్తను వేసేలా ప్లాంట్
- డిసెంబర్ చివరి వరకు అందుబాటులోకి బయో మైనింగ్ ప్లాంటు
- మోడల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 12 (జనం సాక్షి)**

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం కంది ,హత్నూర మండలాలలో కలెక్టర్ ,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లు కలిసి పర్యటించారు. ముందుగా ఇస్మాయిల్ ఖాన్ పెట్‌లో డంప్ యార్డుపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో డంప్ యార్డును కలెక్టర్ పరిశీలించారు. డంపు యార్డులో చెత్త బయట వేయకుండా బయో మైనింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పురపాలక శాఖతో సృష్టి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేసుకున్న ఒప్పందం మేరకు వర్షాలు తగ్గుముఖం పట్టగానే బయోమైనింగ్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రోజుకు 1500 మెట్రిక్ టన్నుల చెత్తను చేసేలా ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సంవత్సరం డిసెంబర్ నెల వరకు బయో మైనింగ్ ప్లాంటు అందుబాటులోకి రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఇస్మాయిల్ ఖాన్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ,అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న విద్యార్థులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఇటీవల వచ్చిన డెంగ్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి రోజు డ్రై డే కార్యక్రమంలో భాగంగా జ్వర సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడి కేంద్రంలో కొత్తగా చేరిన పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రం ద్వారా బాలింతలు గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవలో ఎలాంటి లోపం లేకుండా పోషకాహారం అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం హత్నూర మండలం గుండ్లమాచనూర్, మోడల్ స్కూల్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుటూన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు దేవదాసు , పర్వీన్ షేక్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పక్కాగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనం సాక్షి):**



తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీన జిల్లాలో జరిగే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా కే .కేశవరావు, (అడ్వైజర్ టు గవర్నమెంట్) రానున్నట్లు తెలిపారు. ఆ రోజున అన్ని పాఠశాలల్లో, కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటల వరకు జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. అలాగే సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం, ముఖ్యఅతిథి సందేశం, పోలీసుల గౌరవ వందనం స్వీకరణ, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు కార్యక్రమాలు ఉంటాయని అందుకు గాను మినట్ టూ మినట్ ప్రోగ్రామ్ షెడ్యూల్ తయారు చేసుకొని తగిన ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.

# ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించండి



### అదనపు కలెక్టర్ మాధురి

**కొండాపూర్ సెప్టెంబర్ 12:(జనం సాక్షి)**

ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ మాధురి సంబంధిత అధికారులకు సూచించారు. మండల కేంద్రమైన కొండాపూర్ మండల తాహసిల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేశారు. ధరణి ద్వారా జరుగుతున్న రిజిస్ట్రేషన్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించారు. ఆస్పత్రిలోని పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే వారికి సరైన వైద్యము అందించాలని వైద్యాధికారులకు తెలిపారు. తదనంతరం స్థానిక పాఠశాల వెళ్లి అక్కడ ఉన్న విద్యార్థులతో సంభాషించారు. సరైన భోజనం వసతి ఉందా లేదా అని విద్యార్థులతో మాట్లాడారు. చాలా బాగానే ఉన్నాయని విద్యార్థులు చెప్పారు. పాఠశాల ఆవరణలో ఉన్న బోరు నీటిని వృధాగా పోకుండా చూడాలని పాఠశాల హెచ్ఎంకి సూచించారు. పాఠశాల ప్రాంగణంలోనే ఉన్న అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. చిన్నారులు భోజనం చేస్తున్నా సమయంలో వెళ్లి భోజన వసతి ఎలా ఉంది అని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. ముసిముసి నవ్వులతో బాగానే ఉన్నాయని చెప్పారు. అక్కడనుండి గిర్మాపూర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేసినారు. పాఠశాల ప్రిన్సిపాల్‌తో పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచేట్లు చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అలాగే మెరుగైన విద్యను బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్, ఆయా పాఠశాల, ఆస్పత్రి కి సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో శాంతిభద్రతలు ఉన్నట్టా లేనట్టా..?

- రాజధాని నడిబొడ్డున విపక్ష ఎమ్మెల్యేపై దాడి చేస్తారా..?
- సీఎం ప్రోత్బలంతోనే ప్రతిపక్ష ఎమ్మెల్యే నివాసంపై దాడి
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ తీవ్ర ఆరోపణ



**హుస్నాబాద్ సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**

గడచిన తొమ్మిది సంవత్సరాలలో మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ఏ ఒక్క మత ఘర్షణ లేకుండా, ఎలాంటి గొడవలు, గుండాయిజం, హత్యా రాజకీయాలు లేకుండా సురక్షితమైన రాష్ట్రంగా రూపాంతరం చెందదేట్లు నిర్మాణం చేస్తే, తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో శాంతిభద్రతలో ఉన్నట్టా.. లేనట్టా అనే సందేహం ప్రజల్లో నెలకొనే పరిస్థితి ఏర్పడిందని దీనికి, సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజ మెత్తారు. గురువారం ఆయన ఒక పత్రిక ప్రకటనలో ఈ విధంగా పేర్కొన్నారు. రాజధాని నగరం నడిబొడ్డున బిఆర్ఎస్ పార్టీ భవన్ పై దాడి చేయడాన్ని, విపక్ష ఎమ్మెల్యే పై ఆయన నివాసం పై రాళ్లతో కోడిగుడ్లతో టమాటాలతో దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. దాడుల సంస్కృతి సరికాదని మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో సుఖశాంతులతో వికసించిన తెలంగాణ రాష్ట్రం, నేడు హత్యలు, దాడుల పరంపరతో కకవికాలంగా మారడం కాంగ్రెస్ ప్రభుత్వ ఘెర వైఫల్యమైన అని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి అనుమతి ఇచ్చి, పోలీసులు గాంధీ కాన్వాయ్‌కి రక్షణ కవచంలా మారి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డినీ ఇంట్లో నుంచి బయటికి రాకుండా నిర్బంధించడం, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగునా అని ప్రశ్నించారు. హెూంశాఖ తన వద్ద పెట్టుకొని ఎమ్మెల్యేల అనర్హతపై పోరాడుతున్న కౌశిక్ రెడ్డిపై దాడులు చేయించే సంస్కృతి సరి కాదని హితువు పలికారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అనుచరులు గుండాల వలె మారి కౌశిక్ రెడ్డి నివాసం పై దాడులు చేయడం తెలంగాణ భవన్‌పై దాడులు చేయడం పిరికిపందల చర్యగా అభివర్ణించారు. గడచిన తొమ్మిది నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో రాష్ట్రంలో హత్యలు, దాడుల సంస్కృతి హెచ్చరిల్లుతోందని బీహార్ తరహా గుండా రాజ్‌గా తెలంగాణను సీఎం రేవంత్ మార్చారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్బలంతోనే విపక్ష ఎమ్మెల్యే పై ఆయన నివాసం పై తెలంగాణ భవన్‌పై దాడి జరిగి దాడి జరిగిందని ఆరోపించారు. కౌశిక్ రెడ్డిని కట్టడి చేసినట్టు అరికెపూడి గాంధీని ఎందుకు నిలువరించలేకపోయారని ప్రశ్నించారు. పోలీసుల తీరు విపక్ష ఎమ్మెల్యేపై తెలంగాణ భవన్ భద్రతపై ఒరకంగా ఉంటే అధికార పార్టీలో చేరిన అరికెపూడి గాంధీకి ఆయన అనుచరులకు రక్షణ కవచంలా పోలీసులు మారడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కౌశిక్ నివాసం నివాసంలోకి దూసుకొచ్చి తెలంగాణ భవన్లోకి దూసుకొచ్చి రాళ్లతో కోడి గుడ్లతో టమాటాలతో దాడి చేస్తున్న పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం అంటే ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అరికెపూడి గాంధీ అనుచరులకు వెన్నుదన్నుగా ఉన్నట్టేనని ఆరోపించారు. దాడుల సంస్కృతి సరికాదని ప్రజాస్వామ్య యుతమైనటువంటి తెలంగాణ నిర్మాణంలో భాగంగా ఒక మంచి వాతావరణంలో రాజకీయాలు ఉండాలే కానీ, ప్రభుత్వానికి ఓపిక ఉండాలి కానీ, దాడుల సంస్కృతి రూపుమాపాలని లేకుంటే తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# గెలుపోటములు సహజం

### ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**శివ్వంపేట సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**

క్రీడలతో చదువుకు లింకు ఉన్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోమారం గ్రామంలో ఈనెల 12,13 తేదీలలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్జీఎఫ్ క్రీడలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో దాగి ఉన్న క్రీడాకారులను గుర్తించడానికి ఈ క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. క్రీడలతో బ్రెయిన్ షార్ప్ అవుతుందని జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. గ్రౌండ్ కు సంబంధించిన 25 లక్షల రూపాయలను తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆటల పోటీలలో గెలుపోటములు సహజమని ఓడిన వారు నిరుత్సాహానికి గురికాకుండా రేపటి గెలుపుకు నాందిగా ఈ ఓటమిని మలుచుకోవాలని ఆమె సూచించారు. గత ప్రభుత్వ పాలనలోనే గ్రామీణ క్రీడలను గుర్తించి, పిల్లలు ఆటలు ఆడేందుకు, క్రీడలను ప్రోత్సహించడానికి, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం జరిగిందని సునీతా రెడ్డి గుర్తు చేశారు. ఆ తర్వాత సర్వీస్ చేసి ఆమె వాలీబాల్ ఆటను ప్రారంభించారు. అంతకుముందు ఎస్జిఎఫ్ మండల స్థాయి తరఫున ఆమెకు మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీపీల పోరం అధ్యక్షులు, స్థానిక మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, మండల విద్యాశాఖ అధికారి బుచ్చా నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగాల రమేష్, నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు లాయక్, నాయకులు కొత్తపేట యాదాగౌడ్, సుధీర్ రెడ్డి, బి. నర్సయ్య, సిల్వర్ ఆంజనేయులు, రంగీలా ఆంజనేయులు, ఆయా పాఠశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థినీ, విద్యార్థులు క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీసులకు శారీరక సామర్థ్యం ఎంతో అవసరం

### బాల్యం నుండే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

### జిల్లా ఎస్పీ డి. జానకి





**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

పోలీసింగ్ వ్యవస్థ అన్ని రంగాల్లో పటిష్టంగా పనిచేయాలంటే శారీరక సామర్థ్యం, నైపుణ్యం ఎంతో అవసరమని జిల్లా ఎస్పీ డి. జానకి అన్నారు. గురువారం జడ్చర్ల లోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో (ఎస్‌సిపిసిఎస్) స్పోర్ట్స్ మరియు గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పలు రకాల ఇండోర్ మరియు ఔట్ డోర్ గేమ్స్ నందు విజేతలుగా నిలిచిన శిక్షణా పోలీసు కానిస్టేబుల్ లకు బహుమతులు ప్రధానం చేశారు. శాంతిభద్రతలను కాపాడుతూ, ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ, నేరాలు, విధ్వంసాలూ జరగకుండా నిరోధిస్తూ కాపాడేందుకు రూపొందించిన వ్యవస్థే పోలీస్ వ్యవస్థ అని అన్నారు. మరి పోలీసింగ్ వ్యవస్థ అన్ని రంగాల్లో పటిష్టంగా పనిచేయాలంటే శారీరక సామర్థ్యం, నైపుణ్యం ఎంతో అవసరమని అందుకు శిక్షణ ఒక్కటే సరిపోదని, క్రీడలు కూడా ఎంతో దోహద పడుతాయని, క్రీడలు పట్టుదలను, శక్తి సామర్థ్యాలను, పోటీ తత్వాన్ని, ఆనందాన్ని పెంచుతాయన్నారు. క్రీడలు మనిషి ఆలోచన విధానాన్ని, సాధించాలనే తపన ను కూడా కలిగిస్తాయని, గెలుపు ఓటమి లను శాసిస్తూ జీవితం గమ్యాలను కూడా నిర్థేశిస్తాయన్నారు. క్రీడలు ప్రేక్షకులకు వినోదాన్ని, వారి శారీరక ఆనందాన్ని, ఆరోగ్యానికి కూడా సానుకూల ఫలితాలను ఇస్తాయన్నారు. అందుకే విద్యార్థి దశ నుండే క్రీడలను పోషించాలని ఆమె సూచించారు. పోలీసులపై ప్రజలకు ఎంతో నమ్మకం, ధైర్యం, భరోసా కల్పించే విధంగా పోలీసులు నడుచుకోవాలని ఎస్పీ సచించారు. అందుకే ప్రతి పోలీసు అన్ని రంగాలలో ప్రతిభ కనబరిచినప్పుడే ఈ సమాజాన్ని సంరక్షించే శక్తి సామర్థ్యాలను పొందుతూ, ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, డిటిసి వైస్ ప్రిన్సిపల్ డిఎస్పి నరసింహులు, డిటిసి అవుట్డోర్ ఇన్చార్జి ఆర్ఐ రమేష్, చీఫ్ లా ఇన్స్పెక్టర్ రవికుమార్, ఇతర శిక్షణా సిబ్బంది పాల్గొన్నారు.



## గొర్రెల పెంపకందారులకు సబ్సిడీ రుణాలు అందివ్వాలి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

**మహబూబ్ నగర్ టౌన్ సెప్టెంబర్ 12 (జనం సాక్షి)**

గొర్రెల పెంపకం దారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి గురువారం ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఏహెచ్‌డిడి సభ్యసాచి ఘోష్ కు మహబూబ్ నగర్ గొర్రెల పెంపకం దారుల సంఘం సభ్యులతో కలిసి రిప్రజెంటేషన్ అందజేశారు. మహబూబ్ నగర్ జిల్లా యూనియన్ మొత్తంలో సభ్యులు లక్షకు పైగా ఉన్నారని, వారంతా కూడా గొర్రెలను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని, వీరికి 2012 సంవత్సరంలో 64 కోట్లను 20 శాతం సబ్సిడీతో రుణం మంజూరు చేశారని గుర్తు చేశారు. గతంలో రుణాలు పొందిన వారిలో మొత్తంలో 1640 మంది సభ్యులు పూర్తి స్థాయిలో రుణాలను చెల్లించారని, గొర్రెల కాపర్ల నుంచి భారీ డిమాండ్ ఉన్నందున మహబూబ్ నగర్ జిల్లాలో కొత్తగా గొర్రెల పెంపకదారులకు రుణాలు మంజూరు చేసేందుకు 200 కోట్ల రూపాయలు 20% సబ్సిడీతో మంజూరు చేసేలా ఎన్సిడిసి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన ప్రిన్సిపల్ సెక్రెటరీని కోరారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా గొర్రె కాపర్ల చైర్మన్ శాంతన్న యాదవ్, జిల్లా డైరెక్టర్ రాజగోపాల్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## చిన్నపిల్లల ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనంసాక్షి):**

సకాలంలో విధులకు హాజరై చిన్నపిల్లల కు వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం ఉదయం నారాయణపేటలోని పీడియాట్రిక్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో విధులు నిర్వహించే డాక్టర్ లేకపోవడం పట్ల జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో హాజరై సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉండడం చూసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. శానిటేషన్ సిబ్బంది ఎంతమంది ఉన్నారని అడిగారు. ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చిన్నపిల్లలకు వైద్యం అందించే ఆసుపత్రిని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్టెండెంట్ డాక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వాకిటి



**మక్తల్ సెప్టెంబర్ 12 (జనంసాక్షి)**

మక్తల్ మండలంలోని కాచ్వార్, గోలపల్లి గ్రామాలలో మహాలక్ష్మి పథకాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ప్రభుత్వం అభయహస్తం కార్యక్రమం ద్వారా కేవలం 500 రూపాయలకే ఎల్.పి.జి సిలిండర్ ను అందించాలనే లక్ష్యంతో మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. ఈ పథకం లక్ష్యం మహిళా సాధికారత, ముఖ్యంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిపై ఆర్థిక భారం తగ్గించడం మరియు వారికి కాలుష్యరహిత వంట మాధ్యమాన్ని అందించడం ప్రభుత్వం యొక్క ముఖ్య లక్ష్యం అని తెలియజేశారు. ఈ పథకంలో అందరినీ లబ్ధిదారులుగా ఎంపిక చేయడం జరిగిందనీ తెలిపారు. "గత 3 సంవత్సరాలుగా ఒక్కో కుటుంబానికి సగటుగా ఎన్ని సిలిండర్లు వినియోగం అవుతున్నాయన్నదాన్ని ఆధారంగా తీసుకుని సంవత్సరానికి సరిపడ సిలిండర్ లను ప్రభుత్వం కేవలం 500/- రూపాయలకే అందించనుందని తెలియజేశారు. మీకు రావాల్సిన గ్యాస్ సబ్సిడీ డబ్బులు ప్రభుత్వమే నేరుగా మీ గ్యాస్ సిలిండర్ అకౌంట్ కు జతచేయబడిన బ్యాంక్ అకౌంట్ లో కేవలం నాలుగు రోజులలో జమ చేస్తుందని తెలియజేశారు. ఈ విషయాల్లో ఏమైనా అవకతవకలు జరుగుతున్నట్లయితే 1967 లేదా 18004250033 పోన్ నంబర్లకు సంప్రదించగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల నాయకులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## నేడు అందోల్ ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారం

**జోగిపేట సెప్టెంబర్ 13 (జనం సాక్షి):**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు శుక్రవారం నాడు అందోల్ నియోజకవర్గం ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార కార్యక్రమం ఉంటుందని పిఆర్టియు రాష్ట అసోసియేట్ అధ్యక్షులు ఆకుల మానయ్య తెలిపారు, శ్రీ లక్ష్మీదేవి గార్డెన్లో జరిగే కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరవుతారని, తెలిపారు, నియోజకవర్గం లోని 9 మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు పురస్కార కార్యక్రమం ఉంటుందన్నారు, ఈ కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, శాసనమండలి సభ్యులు కూర రగోతం రెడ్డి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు హాజరవుతారని తెలిపారు.

# పంటల నష్టం, రోడ్ల ధ్వంసంపై కలెక్టర్‌కు నివేదికలు..!



### జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్ రావు

**న్యాల్ కల్, సెప్టెంబర్ 12, (జనం సాక్షి) :**

పక్షం రోజులుగా మండలంలో కురిసిన భారీ, అధి భారీ వర్షాలతో దెబ్బతిన్న పలు ఖరీఫ్ పంటలు, భారీగా వచ్చిన వరద ఉధృతితో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల అభివృద్ధి, మరమ్మత్తులకై అతి త్వరలోనే జిల్లా కలెక్టర్ కు నివేదికను పంపనున్నట్లు జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ లు స్పష్టం చేశారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతా లైనా చాల్కి, రాఘవపూర్, చీకూర్తి, హుస్సేనగర్, తదితర శివారులో జహీరాబాద్ నియోజకవర్గపు వ్యవసాయ విస్తరణ అధికారి బిక్షపతి, మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం. రవీందర్ లతో కలిసి అధిక వర్షంతో దెబ్బతిన్న పెసర, మినుము, సోయా, పత్తి పంటలను పరిశీలించారు. గ్రామాల వారిగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదికను సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులను సూచించారు. అత్యంత పెను ప్రమాదకరంగా మారిన పలు కల్వర్టులు, చిన్నపాటి వంతెనలను పరిశీలించారు. రాఘవపూర్/ కుసునూర్, చాల్కి/చీకూర్తి గ్రామాల మీదుగా వెళ్లే ప్రధాన రహదారుల మధ్యన గల పలు కల్వర్టులు, చిన్నపాటి వంతెనలు అత్యంత ప్రమాదకరంగా మారాయని, వీటి మరమ్మత్తులు, రోడ్ల అభివృద్ధి కోసం అతి త్వరలోనే జిల్లా కలెక్టర్ కు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, రోడ్ల మరమ్మతుల నిధుల మంజూరు కోసం నివేదికలు అందజేస్తామని ఎమ్మెల్యే, డీసీఎంఎస్ చైర్మన్ లు "జనం సాక్షి"కి వివరించారు. మండలంలో నష్టపోయిన రైతులను, రోడ్ల మరమ్మత్తులకు ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ:10 వేల మేర నష్టపరిహారం అందించాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, పార్టీ శ్రేణులు నరసింహ గౌడ్, ప్రభు పాటిల్, సుధాకర్ రెడ్డి, అహ్మద్ అలీ, భూమా రెడ్డి, విట్టల్, ఆనంద్, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.





**ఈ మధ్య కాలంలో పిల్లల మీద విపరీతంగా లైంగిక దాడులు పెరిగిపోయాయి. ఒక పేరున్న హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదివే ముగ్గురు కుర్రాళ్ళు రెండో తరగతి చదువుతున్న పాప పట్ల అసభ్యంగా, అభ్యంతరకరంగా ప్రవర్తించారు. వారం వారం షీ టీమ్స్ కౌన్సిలింగ్‌కి పోలీసులు తీసుకొచ్చే మగపిల్లలు రోడ్ల మీద ప్రవర్తిస్తున్న తీరు గమనిస్తే తీవ్రమైన కోపంతో పాటు ఆందోళన కూడా కలుగుతుంది.**



# చిన్నోడికి ప్రేమతో..

– కొండవీటి సత్యవతి

చదువుకున్న వాళ్ళతో పాటు, చదువు సంధ్య లేకుండా బేకారుగా రోడ్ల మీద తిరిగే మగపిల్లలు బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, అమ్మాయిల పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో పోలీసులు రికార్డు చేసే వీడియోల్లో చూస్తుంటే వీళ్ళ వల్ల ఎంత పబ్లిక్ హింస జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. గుంపులు గుంపులుగా మోటార్ వాహనాలతో తిరుగుతూ బస్ స్టాపుల దగ్గర, ఆడపిల్లల కాలేజీలు, హాస్టళ్ళ దగ్గర అసభ్యకరమైన కామెంట్లు చెయ్యడం, దగ్గరకొచ్చి ముట్టుకోవడం, ఫోటోలు, వీడియోలు తీయడం, వాటిని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, బెదిరించడం ఇలా ఎన్నో అకృత్యాలకు మగపిల్లలు తెగబడుతున్నారు. సభ్యత, సంస్కారం అనే మాటలకి వీళ్ళకి అర్థం తెలియదు. వీరి చర్యల్ని గమనించినపుడు బహిరంగ ప్రదేశాలు మహిళలకు ఎంత అభద్రంగా ఉన్నాయో అర్థమౌతుంది. ఇలా పోలీసులకు పట్టుబడిన మగపిల్లలకి కౌన్సిలింగ్ చేసేటప్పుడు కౌన్సిలర్లు బహిరంగ ప్రదేశాల్లో వారు చేస్తున్న వికృత చర్యల పరిణామాల గురించి, చట్టాల గురించి, పోలీస్ కేస్ అయితే భవిష్యత్తులో వారు ఎదుర్కోబోయే పరిణామాల గురించి వివరంగా చెప్పినప్పుడు వాళ్ళు చాలా భయపడతారు. ముఖ్యంగా సైబర్ క్రైంకి పాల్పడినప్పుడు అరెస్టులు, జైళ్ళు ఉంటాయని చెప్పినప్పుడు మరింత భయపడతారు. ఒకవేళ ఎఫ్ఐఆర్ అయితే వారి పై చదువులు, విదేశాలకు వెళ్ళాలంటే వీసా రాదని, ఉద్యోగం రాదని ఇలా ఎన్నో విధాలుగా మాట్లాడి కౌన్సిలర్ వాళ్ళు చేసిన చర్యల పరిణామాలను వివరిస్తారు. ఒకసారి కౌన్సిలింగ్‌కు వచ్చిన వాళ్ళు రెండో సారి పోలీసులకు దొరికిన కేసులు ఒక్కటి కూడా లేవు. దీనిని బట్టి అర్థమౌతున్నది ఏమిటంటే మగ పిల్లలకి మంచి చెడూ చెప్పేవారు, వారి చర్యల పర్యవసానాల గురించి వివరించే వారు ఎవ్వరూ లేరు. తల్లిదండ్రులు కానీ, స్కూల్లో టీచర్లు గానీ ఈ అంశం మీద వివరంచడం లేదు. తల్లిదండ్రులు వారి వారి జీవన పోరాటాల్లో మునిగి ఉండడం, టీచర్లకు సమయం ఉండక పోవడం లాంటి ఎన్నో కారణాలు. పై నేపథ్యంలోంచి చూసినపుడు డాక్టర్ విజయలక్ష్మిగారు ప్రచురించిన "చిన్నోడికి ప్రేమతో" పుస్తకం ఎంత విలువైనదో అర్థమౌతుంది. డాక్టర్ ఏ విజయలక్ష్మి గారు చాలా కాలంగా తెలుసు. పిల్లల కోసం ఆవిడ నిర్వహించే కార్యక్రమాలు తెలుసు. పిల్లలంటే ఆమెకు వల్లమాలిన అభిమానం. ఇటీవల విజయలక్ష్మి గారు ప్రచురించిన పుస్తకం "చిన్నోడికి ప్రేమతో" పేరుతో తెచ్చిన పుస్తకం అన్ని విధాలా చాలా విలక్షణమైంది. ఈ పుస్తకమంతా ఉత్తరాల రూపంలో ఉంది. దాదాపు 250 పేజీల పుస్తకం. చిన్నోడికి ప్రేమతో అంటూ తన కొడుకు ప్రకాష్‌కి రాసిన ఈ ఉత్తరాల పూల తోటలో ఎన్నో పూలు వికసించాయి. పరిమళాలు వెదజల్లాయి. ఒక్కో ఉత్తరం చదువుతూ పోతుంటే అమ్మ నుంచి అపారమైన ప్రేమతో పాటు ఎన్నో అంశాల గురించి ఉగ్గుపాలతో రంగరించినట్టు ఆమె చెప్పిన విధం అద్భుతం.

ముందే నేను ఉత్తరాల ప్రేమికురాలను. ఉత్తరం రాయడం, అందుకోవడం మహా ఇష్టం నాకు. ఇన్ని ఉత్తరాలు ఒకేసారి అదీ తల్లి తన పిల్లవాడికి ప్రేమగా రాసినవి చదవడం గొప్ప అనుభవం. విజయలక్ష్మి చాలా బిజీగా ఉండే డాక్టర్. అయినప్పటికీ అనివార్యంగా హాస్టల్‌లో ఉన్న కొడుకు కోసం టైం తీసుకుని ఎన్నెన్నో అంశాలను పిల్లవాడికి ఉత్తరాల రూపంలో అవగాహన కలిగించగలిగారు. పర్యావరణం గురించి, ప్రకృతికి సమీపంగా ఉండడం గురించి ఆటలు, పాటలు, చుట్టూ కమ్ముకుని ఉండే మొక్కల గురించి ఎంతో వివరంగా రాయడమే కాక పిల్లాడు వాటి పట్ల ప్రేమ పెంచుకునేలా రాసారు. సైన్స్ గురించి, పుస్తకాల గురించి, స్ఫూర్తి ప్రదాత లైన వ్యక్తుల గురించి మనసుకు హత్తుకునేలా రాసారు.

"పుస్తకాలతో స్నేహం" పేరుతో రాసిన ఉత్తరంలో

"తల్లిగా లాలించి తండ్రిగా నడిపించి–గురువుగా మనసులో బరువు దించి నిశ్శబ్ద మిత్రుడై నీడగా వెన్నంటి–పదిమంది సభలోన పరువు నిలిపి బ్రతుకు శూన్యంబుగా పల్కరించిన వేళ–బాసటగా నిలిచి బాట చూపి సందేహములు చేరి సందడి చేయగా–నిక్కచ్చి ఐనట్టి నిజము చెప్పి ప్రగతి దారుల పయనించు తెగువ నిచ్చి–చేతబట్టిన ప్రతి ప్రతివారికీ ఊతమిచ్చి ఆశ్రయించిన వారికి అర్థమగుచు మస్తకంబుల మలచు పుస్తకంబు" ఇలాంటి ఆణిముత్యాలు ఈ పుస్తకం నిండా దొరుకుతాయి. ప్రతి తల్లీ, తండ్రీ, గురువూ ఇలాంటి అంశాలను గురించి జీవన నైపుణ్యాల గురించీ, సమాజంలో వారు ఎలా ప్రవర్తించాలి, సభ్యతా సంస్కారాలు ఎలా అలవర్చుకోవాలి, తనతో పాటు బతికే అమ్మాయిల పట్ల ఎలా సెన్సిటివ్‌గా వ్యవహరించాలి అనే విషయాలను పదే పదే చెప్పాలి. బయట ప్రపంచంలో తమ సుపుత్రులు ఎలాంటి ప్రమాదకరమైన పనులు చేస్తున్నారో గమనించుకోకపోతే "పోక్సో" లాంటి తీవ్రమైన చట్టాల్లో ఇరుక్కు పోయే ప్రమాదం ఉంది. చాలా సులభంగా అందరికీ అందుబాటులోకి వచ్చేసిన గంజాయి లాంటి మత్తు పదార్థాల ప్రభావంలో పడుతున్నారేమో కూడా గమనించుకోవాలి. సమాజపు పోకడలతో పాటు పుస్తకాలని, ప్రకృతిని, సైంటిఫిక్ టెంపర్ని బిడ్డల ఎదుగుదలకు అవసరమైన సమస్త అంశాలని ప్రేమతో రంగరించి తన కొడుక్కి ఉత్తరాల రూపంలో అందించిన విజయలక్ష్మి గార్కి ధన్యవాదాలు, అభినందనలు. అందరూ ఈ పుస్తకం చదవాలని తమ పిల్లలతో చదివించాలని కోరుకుంటూ?



# హైడ్రా అభయం



ఎప్పుడు పిలిచినా ఎక్కడికో పారిపోతావు
ఇప్పుడేమో వద్దన్నా వరదలతో ముంచెత్తుతున్నావు
ఎంత మొరపెట్టుకున్నా మబ్బుల్లోనే
మాయమైతావు
రైతన్నల పాలిట శాపమై నిలుస్తావు
పురుగుమందు తాగి బతుకును బలి
చేసుకునేలా చేస్తావు
ఇప్పుడే మొకంటతడి పెడుతున్నా
కనికరం లేకుండా వెంట పడుతున్నావు
కరువు కాటకాలతో కడుపులు మాడుతున్నప్పుడు
మండే ఎండలతో మలమల మాడ్చి చంపావు
వద్దు వద్దంటూ వరుణ దేవుని వేడుకుంటున్నా
కుండపోత వర్షాలతో ఊరువాడా ముంచేస్తున్నావు
అప్పుడు ఇప్పుడు పేదోడి బతుకు అరణ్యరోదనలే
నడిరోడ్డున పడేది ఈ బడుగు జీవులే పాపం
ఎవరిదిఎప్పుడూ ఉన్నోళ్ల జీవితాలు విలాస మందిరాలే కూటికి
లేనోళ్లపైనే కన్నెర్రజేస్తాయి
ప్రకృతి వైపరీత్యాలు కడుపు నిండినోళ్లకు
తెలియవు కన్నీటి బాధలు
చెరువులు, కుంటలు పూడ్చి కబ్జా చేసేది
బడా బాబులు ఊళ్లను ఉప్పెనలై ముంచేస్తున్నాయి
వానలు, వరదలు.చెరువులను చెరబట్టి నిర్మిస్తున్నారు
ఆకాశహర్మ్యాలు చెల్లాచెదరైపోతున్నాయి
అమాయక ప్రజల జీవితాలు వ్యథలు బాధలు గాథలై
మరపురాని వ్యథలై కన్నీటి వరదలై విలయతాండవం ఆడే వేళ
ఎవరోచేసిన పాపానికి శిక్ష అనుభవిస్తున్నారు
ప్రజలుఅవినీతి అధికారులే ఈ పాపాలకు బాధ్యులు
హైదరాబాదు రక్షణకోసం హైడ్రా నిర్వహిస్తోంది విధులు
లబోదిబమంటున్నా కూల్చేస్తున్నారు ఇల్లు గుడిసెలు.
వారి కలల సౌదాలను వారి కళ్ళముందే నిర్వీర్యం చేస్తున్నారు
చోద్యం చూస్తూ నిలబడుతున్న ఈ మధ్యతరగతి జీవితాలు
విల్లాలుపైసా పైసా కూడబెట్టి కొనుక్కున్న కలల లోగిళ్ళు కనికరం
లేకుండా నేలమట్టం చేస్తున్నాయి హైడ్రా బుల్డోజర్లుదొంగల్లా
దాక్కుంటున్నారు అనుమతులిచ్చిన అధికారులునిక్కి నిక్కి చూస్తున్నాయి
నాయకులు నిర్మించిన మేడలు మధ్యతరగతి వారిపై కొరడా
ఝుళిపించిన హైడ్రా అధికారులు మర్మమేమి లేకుండా కూల్చేయాలి
దురాక్రమణల కట్టడాలు హైడ్రా అంటేనే హడలిచస్తున్నారు ప్రజలు
కాపాడాలి భాగ్యనగర వాసుల కన్నీటి కష్టాలు
హైదరాబాదు అందాలను కాపాడగ అవతారం ఎత్తాడు రంగనాథుడు
అందరి నమ్మకాలను నిలబెట్టాలి అవతార పురుషుడు
ప్రజా క్షేమం కోసం ఏర్పాటుచేసిన హైడ్రా పనులు ప్రక్షాళనచేయగా
అవుతాయేమో మోహిని భస్మాసుర హస్తాలు.
ఈ బడుగు జీవుల నష్టపరిహారానికి బాధ్యులు ఎవరు
దోచుకొని దాక్కుంటున్న అనుమతులు ఇచ్చిన అధికార దొంగలదా
కొరడా జల్పించిన అధికారులదా ప్రభుత్వానిదా
ఆ పరమాత్ముడుకే తెలియాలి

– రాజేశ్వరి రెడ్డి నిజాంపేట్



## కీచక పీఈటీని తొలగించండి

- గురుకుల పాఠశాలలో విద్యార్థులపై అమానుషంగా దాడిచేసిన ఉపాధ్యాయురాలు
- గోడ దూకి వచ్చి ప్రధాన రహదారిపై ధర్నా విద్యార్థులు
- ఉపాధ్యాయురాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**తంగళ్ళపల్లి సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థినిలు మాకు న్యాయం చేయాలంటూ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల పిఈటి జోత్స్న విద్యార్థినులు జ్యోతి, అశ్విని అలేఖ్య అర్చనలు బాత్రుంలో స్నానం చేస్తుండగా ఎలాంటి కారణం లేకుండానే బాత్రూంలో స్నానం చేస్తున్న విద్యార్థులపై డోరు పగలగొట్టి తన మొబైల్ ఫోన్ లో, ఫోటోలు వీడియోలు తీస్తూ ఒక్కసారిగా విద్యార్థులపై దాడి చేసిందని తెలిపారు. ఈ విషయమై విద్యార్థినిలకు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక గురువారం వేకువ జామున పాఠశాల గోడను దూకి సుమారు రెండు కిలోమీటర్ల వరకు విద్యార్థులు నడుచుకుంటూ వచ్చి తమ గోడును వెల్లవించుకునేందుకు సిరిసిల్ల, సిద్దిపేట ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా బాధిత విద్యార్థినిలు మాట్లాడుతూ గత కొద్ది రోజుల నుండి విద్యార్థుల పట్ల అసభ్య పదజాలంతో దూషిస్తూ, తిడుతూ, కొడుతూ పి ఈ టి చర్ ఓ సైకోల వ్యవహరిస్తుందని వెల్లడించారు. వెంటనే ఆ టీచర్ ను సస్పెండ్ చేసి మళ్లీ ఏ పాఠశాలలో పనిచేయకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

**పీఈటీ సస్పెన్షన్..**

ఉదయం నాలుగు గంటల నుండి 8 గంటల వరకు విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి ఎంఈఓ రఘుపతి చేరుకొని విద్యార్థినిలను సముదాయించిన వినలేదు. ఈ విషయమై డీఈఓ దృష్టికి తీసుకువెళ్లగా ఆ టీచర్ను వెంటనే సస్పెండ్ చేసి ఉత్తర్వులు జారీ చేయడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. జిల్లాలో ఇలాంటి గురుకుల పాఠశాలలు ఎన్నో ఉన్నాయని వారి సమస్యలు బయటకు రాకుండా విద్యార్థులలో జైలులో బంధించినట్లుగా ఉంటున్నారని, విషయం బయటకు వచ్చి ధర్నా చేసేంతవరకు అసలు గురుకులాలలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెల కొందని వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగులదే కీలక పాత్ర
- 17న ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- టీఎన్జీవో సంఘం నేతలతో ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్‌రావు



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులంతా కంకణ బద్ధులై ఉన్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. గురువారం వెలిచాల రాజేందర్ రావు కరీంనగర్ లోని తన ఇంటిలో టీఎన్జీవోల సంఘం రాష్ట్ర నేతలతో పాటు జిల్లా నాయకులు, ప్రతినిధులను బ్రేక్ ఫాస్ట్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారితో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో వెలిచాల రాజేందర్ రావు మాట్లాడారు. ఉద్యోగుల సహకారంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు విజయవంతం అవుతాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు చిత్తశుద్ధితో విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ తో పాటు టీఎన్జీవో సంఘం నాయకులను వెలిచాల రాజేందర్ రావు సన్మానించారు. మారం జగదీశ్వర్, ఉద్యోగ సంఘాల నేతలు కరీంనగర్ మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు వెలిచాల జగపతి రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. టీఎన్జీవో సంఘం నాయకులు పలు సమస్యలను వెలిచాల రాజేందర్ రావు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను ముందుండి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. తాను స్థానికంగా కరీంనగర్ లోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. తన తండ్రి జగపతిరావుతో ఉద్యోగులకు ఉన్న అనుబంధాన్ని ఆత్మీయంగా పంచుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు ఉద్యోగులకు ఎల్లవేళలా అండగా ఉంటానని వెలిచాల రాజేందర్ రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, టిజిఓ నాయకులు కాళీ చరణ్, మామిడి రమేష్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మేందర్ సింగ్, రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, తిమ్మాపూర్ అధ్యక్షులు పోలు కిషన్, జిల్లా నాయకులు రవీందర్ రెడ్డి, రమేష్ గౌడ్, భీమ్రావు రాజేశ్వరరావు, మల్కా రాజేశ్వరరావు, గాలి సత్యనారాయణ, శంకర్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

## విపక్షానికే పీఏసీ చైర్మన్ పదవి

చెప్పలేదని ప్రశ్నించారు. 2019 నుంచి అక్బరుద్దీన్ పీఏసీ ఛైర్మన్‌గా ఎలా ఉంటారు? కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉంటే ఎంఐఎంకు పీఏసీ ఛైర్మన్ పదవి ఎలా ఇచ్చారు? బతకడానికి వచ్చినోళ్ల ఓట్లు కావాలి కానీ, వాళ్లకు సీట్లు ఇవ్వొద్దా? బతకడానికి వచ్చినోళ్లు అంటూ కౌశిక్ చేసిన వ్యాఖ్యలు సరికాదు. పార్టీ ఫిరాయింపులపై చట్టం కఠినంగా ఉంటే మంచిదే. కోర్టు తీర్పులు మాకే మేలు చేస్తాయని సీఎం రేవంత్ అన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు మిసిమి విద్యార్థులు



**కమ్మర్పల్లి12సెప్టెంబర్(జనంసాక్షి)**

రాష్ట్ర స్థాయి హండ్ బాల్ పోటీలకు మిసిమి హై స్కూల్ విద్యార్థులు ఎంపిక అయ్యారని పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. గురువారం రోజున ఆర్మూర్ లో విశాఖ స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి హండ్ బాల్ పోటీలకు150 మంది విద్యార్థులు పాల్గొనగా జిల్లా జట్టుకు మిసిమి హై స్కూల్ విద్యార్థులు సౌమిత్, శాశ్వంత్ ఎంపికైనందుకు విద్యార్థులను అభినందించారు. ఈనెల 14, 15 తేదీల్లో హన్మాకొండలో జవహర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టులో పాల్గొని మంచి ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య పి ఇ టి సంజీవ్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## స్థానికతపై సుప్రీంకు తెలంగాణ ప్రభుత్వం

మార్గదర్శకాలు లేవని, వాటిని రూపొందించే అవకాశాన్ని ప్రభుత్వానికి ఇస్తున్నామని తెలిపింది. తెలంగాణలో చదువుకోలేదన్న కారణంతో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించరాదని ఆదేశాల్లో పేర్కొంది. తాజాగా.. హైకోర్టు తీర్పుపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద తెలంగాణ తరఫు న్యాయవాది మెన్షన్ చేశారు. త్వరగా విచారణకు తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం తెలిపింది.

## భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలు

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్..**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** వినాయక నిమజ్జన ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ నెల16న వేములవాడలో వినాయక నిమజ్జన ఉత్సవాన్ని నిర్వహించనుండగా, రాజన్న ఆలయ గుడి చెరువులో చేస్తున్న ఏర్పాట్లను గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఆయా శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పోలీస్ అధికారుల సూచనల మేరకు మండపాల నిర్వాహకులు, యువత, ప్రజాప్రతినిధులు పాటించి, సహకరించాలన్నారుఉత్సవాలను శాంతియుత వాతావరణంలో చేసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్, సెస్, మత్స్య, పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై చర్చించారు. నిమజ్జనానికి కావాల్సిన క్రేన్స్, జేసీబీలు, విద్యుత్ దీపాలు, నీటి సదుపాయం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు. అన్ని మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా నిర్ణీత సమయానికి తరలించి, సహకరించాలని కోరారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో సిబ్బందిని నియమించి లైఫ్ జాకెట్లు సమకూర్చాలని, ఎక్సైజ్, అగ్ని మాపక శాఖలు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. వారి వెంట మున్సిపల్ చైర్ పర్సన్ రామ తీర్థపు మాధవి రాజు, వైస్ చైర్మన్ బింగి మహేష్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, రాజన్న ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, తహసిల్దార్ మహేష్, సెస్ ఎడి శ్రీధర్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## రాహుల్ వ్యాఖ్యలపై భగ్గుమన్న బీజేపీ

- నగరంలో భారీ నిరసనలు.. దిష్టిబొమ్మ దహనం.
- దేశ ప్రతిష్టతను దిగజార్చిలా మాటలు సిగ్గుచేటు
- రిజర్వేషన్లు రాజ్యాంగం ఇచ్చిన హక్కు..
- బిజెపి అధికారంలో ఉండగా రిజర్వేషన్లకు డోకా లేదు.
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశాల్లో పర్యటిస్తూ.. దేశాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడంపై, రిజర్వేషన్ల రద్దు పై మాట్లాడిన తీరు పై బిజెపి శ్రేణులు భగ్గుమన్నారు. ఈ మేరకు గురువారం రోజున కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో బిజెపి జిల్లా శాఖ భారీ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించింది. రాహుల్ గాంధీ కి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టి, దిష్టిబొమ్మను దహనం చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... రాహుల్ రాజకీయ పరిణితి పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అమెరికాలో ఆయన మాటలు వింటుంటే అయన భారతీయుడేనా..? అన్న అనుమానం కలుగుతోందన్నారు. ముఖ్యంగా రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లిన ప్రతి సమయంలో భారత్ ను చులకన చేస్తూ అనేక పిచ్చికూతలు కూసారని ఆయన ఈ సందర్భంగా మండిపడ్డారు. ఈ దేశంలో స్వేచ్ఛ లేకపోతే తెలంగాణ, కర్ణాటక ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్ ఎలా గెలిచిందన్నారు. దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ సమావేశాలు జరపడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలంతా గ్రహించాల న్నారు. స్వార్థ రాజకీయాల కోసం భారత దేశాన్ని కించపరుస్తూ దేశ వ్యతిరేక శక్తులతో కలిసి రాహుల్ గాంధీ కుట్రలు చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కళ్లెం వాసుదేవ రెడ్డి, సీనియర్ నాయకులు వాసాల రమేష్, కార్పొరేటర్లు కోలగాని శ్రీనివాస్, బండ రమణారెడ్డి, పెద్దపెల్లి జితేందర్, కాసర్ల ఆనంద్, జ్యోతి శివ, సత్యనారాయణ రెడ్డి, స్వామి, లక్ష్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిలింగ్ మెంబర్ శ్రీనివాస్, కొమురయ్య, కళ్యాణ్ చంద్ర, బీజే వైఎం జిల్లా అధ్యక్షుడు సంపత్ , వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**16న మండలాల తాసిల్దార్ కార్యాలయల ముందు ధర్నాకు పిలుపు.**

ఆర్మూర్ (జనంసాక్షి):హామీలను విస్మరించి, రైతులను యాప్ లంటూ కాలయాపన చేస్తుందని, రైతు రుణమాఫీ పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని రైతు ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు మండిపడ్డారు. ఆర్మూర్ పట్టణంలోని ఎమ్ ఆర్ గార్డెన్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. షరతులు లేకుండా రెండులక్షల రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వాలని గత నెల 24 తారీఖున చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి సెప్టెంబర్ 15 వరకు గడువు ఇచ్చామని అన్నారు. రైతు రుణమాఫీ పై మోసగిస్తున్న ప్రభుత్వాన్ని నిలదీస్తూ 16న అన్ని తాసిల్దార్ కార్యాలయాల ముందర ధర్నాకు పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు లింగారెడ్డి, శ్రీనివాస్, యాదగౌడ్, దేవరాం, సుక్కి సుధాకర్ తిరుపతి రెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.



# ఈ నెల17న ప్రజాపాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించాలి

## కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**నల్లగొండ బ్యూరో,సెప్టెంబర్ 12,(జనం సాక్షి):** ఈనెల17న ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు.ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన జిల్లా అధికారులను ఆదేశించారు.17వ తేదీ నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్ల పై గురువారం అయన జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.17 వ తేదీన జిల్లా కేంద్రం మొదలుకొని, గ్రామపంచాయతీ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీలలో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కలెక్టర్ చెప్పారు.జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 17వ తేదీ ఉదయం10 గంటలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని,పోలీసు గౌరవ వందనం తో పాటు,జిల్లా ప్రజలను ఉద్దేశించి సందేశం ఇస్తారని,ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.ప్రజాపాలన దినోత్సవానికి పోలీస్ పరేడ్ మైదానంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమాలకు విద్యార్థులతో పాటు,అంగన్వాడీ,ఆశ కార్యకర్తలు, జిల్లా కేంద్రంలోని అన్ని కార్యాలయాల ఉద్యోగులందరూ హాజరుకావాలని ఆదేశించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో,డిపిఆర్ఓ లను ఆదేశించారు.ప్రజాపాలన దినోత్సవ వేడుక ఆహ్వాన పత్రికలను ప్రజా ప్రతినిధులు,ముఖ్యులు అధికారులందరికీ ముందే పంపించాలని,జాతీయ పతాకావిష్కరణ తర్వాత ముఖ్య అతిథి జిల్లా ప్రజలకు ఇచ్చే సందేశాన్ని తయారు చేయాలని ముఖ్య ప్రణాళిక అధికారిని ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే వారందరికీ సీటింగ్ ఏర్పాట్ల తో పాటు,తాగునీరు,టెంట్లు, శానిటేషన్,ఇతర అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ పోలీస్ పరేడ్ మైదానంలో ప్రజాపాలన దినోత్సవ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లతో పాటు,పోలీసు గౌరవ వందనానికి,అలాగే బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని,ఇందుకోసం ప్రత్యేకంగా ఒకరిని నోడల్ అధికారిగా నియమించనున్నట్లు తెలిపారు.అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించి చేసే ఏర్పాటులపై మాట్లాడారు.ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చెప్పారు.ఈ టెలికాన్ఫరెన్స్ కు జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు.

# సమస్యాత్మకంగా ఉంటే ప్రత్యేక జ్వర సర్వే చేపట్టాలి

- చిన్నారులలో పోషణలోప నివారణ చర్యలు పటిష్టంగా తీసుకోవాలి
- ఆకస్మికంగా సందర్శించిన కలెక్టరు హనుమంత్ కే. జెండగే





**భువనగిరి ప్రతినిధి, సెప్టెంబర్ 12 ( జనంసాక్షి):** సమస్యలు ఉన్నచోట ప్రత్యేకంగా జ్వర సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ హనుమంతుకి జండేగా అధికారులను ఆదేశించారు.గురువారం గుండాల మండలం అనంతారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలను, మందులను, రిజిష్టర్లు భౌతికంగా ఉన్న స్టాక్ వివరాలను, పేషెంట్ల ప్రిస్క్రిప్షన్స్ పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల క్షేత్రస్థాయిలో అవగాహన చర్యలు చేపట్టాలని ఆరోగ్య కేంద్రం డాక్టర్ యూనస్ కు సూచించారు. అనంతారం జిల్లా పరిషత్ స్కూల్ సందర్శించి పదవ తరగతి ఫిజికల్ సబ్జెక్ట్ సంబంధించిన డిజిటల్ క్లాస్ లను చూశారు. ఎనిమిదవ తరగతి విద్యార్థులను వారి సబ్జెక్టులపై అడిగి తెలుసుకున్నారు. ప్రక్కనే పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ అస్సెస్మెంట్ క్యాంప్ పరిశీలించారు. వయస్సుకు తగిన ఎత్తు, బరువు లేని పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని, పోషణ లోప నివారణపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని, మెనూ ప్రకారం ఆహారం అందించాలని, తరచూ మెడికల్ పరీక్షలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయురాలు పునర్వసు, అంగన్వాడీ టీచర్ స్వప్నకు సూచించారు.అనంతరం కొమ్మాయిపల్లి సబ్ సెంటర్ సందర్శించి వైద్య సేవల పట్ల డాక్టర్ హైమావతిని అడిగి తెలుసుకున్నారు. పేషెంట్లతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కొమ్మాయిపల్లి అంగన్వాడీ చిన్నారులతో మాట్లాడారు. చిన్నారులు పాటలు పాడారు. అల్ఫాబెట్ అప్పజెప్పడంతో కలెక్టరు సంతృప్తి వ్యక్తం చేశారు.



# వరద ముంపు గ్రామాలను పరిశీలించిన కేంద్ర బృందం

**కోదాడ, రూరల్ 12 (జనంసాక్షి):** కోదాడ నియోజకవర్గం లోని వరద ప్రభావిత ముంపు ప్రాంతాలైన అనంతగిరి మండలం గోండ్రియాల, కోదాడ మండలం తొగర్రాయి, నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం లను క్షేత్ర స్థాయిలో కేంద్ర అధికారుల బృందం , గురువారం పరిశీలించారు. ఈ బృందం లో కల్నల్ కేపీ సింగ్, మహేష్ కుమార్, శాంతినాథ్ శివప్ప లు కోదాడ నియోజకవర్గం లో పర్యటించి వరద ముప్పు కి గురైన ఇండ్లను, వరద లో మునిగిన అలాగే ఇసుక మెటలు పెట్టిన పొలాలను, వరదతో దెబ్బతిన్న విద్యుత్ స్టంబాలను పరిశీలించారు.నిరుపేదలం భరించలేని నష్టం జరిగింది,ఆదుకోవాలని కేంద్ర బృందాల కు రైతులు వేడుకొన్నారు. నీట మునిగిన పొలాలు, ఇసుక మేట వేసిన పంటలు చూసారు, పూర్తి నివేదిక అందిస్తామన్నారు.ఖమ్మం నుంచి వచ్చిన అధికారుల బృందానికి గోండ్రియాల లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆహ్వానించారు.గోండ్రియాల లో వరద ముప్పు తో కూలిన గూటి పార్వతమ్మ,గంటు గరతయ్య ఇండ్లని పరిశీలించారు, అలాగే వరదతో ఇంట్లోని సామాగ్రి అంత కొట్టుకోనిపోయిన గౌరవరపు రవి ఇంట్లోకి వెళ్ళి చూసారు.అలాగే మండల ప్రాథమిక పాఠశాలను, ఉన్నత పాఠశాలలను అధికారుల బృందం పరిశీలించారు. గ్రామం లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా బ్లీచింగ్ వేదజల్లాలని, యాంటీ లార్వా స్ప్రే చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.గ్రామం లో 15 రోజులలో 3 సార్లు డోర్ టూ డోర్ ఫీవర్ సర్వే చేయాలని వైద్యాధికారులకు సూచించారు.నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం వద్ద యన్ ఎస్పి ఎడమ కాలువకు పడిన గండి ని పరిశీలించారు. పాలేరు రిజర్వాయర్ లో 9 అడుగులు మర నీరు ఎక్కువ రావటం తో అవి వెనక్కి వచ్చి గండి పడిందని కలెక్టర్ వివరించారు. వేగవంతంగా కాలువ లైనింగ్ పనులు , గండి పూడ్చటం త్వరగా పూర్తి చేసి ఆయకట్టుకి నరు విడుద చేస్తామని కేంద్ర అధికారుల బృందానికి తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ఆర్ డి ఓ సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి,ఇరిగేషన్ డి ఈ రఘు,తహసీల్దార్లు హిమ బిందు,వాజీద్ అలీ, సరిత,యం పి ఓ పాండు రంగన్న, కార్యదర్శిలు వీర ప్రభాకర్, అభిలాష్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలి

- ఫోన్ లో బ్యాంక్ వివరాలు అడిగితే సైబర్ మోసగాళ్లని గుర్తించండి
- లోన్ యాప్ ల నుండి రుణాలు తీసుకోవద్దు
- సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఎత్తుగడలను గుర్తించాలి
- జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా సైబర్ మోసగాళ్లు అనేక రకాలుగా సైబర్ నేరాలకు పాల్పడుతూ, ప్రజల బ్యాంక్ ఖాతాల నుండి డబ్బును దొంగలించి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. సైబర్ నేరగాళ్లు సాంకేతికతను సద్వినియోగం చేసుకొని, ప్రజల అవసరాలను ఎరగా వేసి సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు.ప్రజలు అజాగ్రత్తగా ఉండి అపరిచితులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా, పిన్ నంబర్, ఓటిపి నంబర్స్, ఆధార్, పాన్ కార్డ్ నంబర్స్ తెలిపితే మోసపోతారని అన్నారు.ప్రజల సెల్ ఫోన్లకు, మెయిల్ అకౌంట్లకు బ్లూ లింక్ మెసేజ్ లు పంపడం, బహుమతులు వచ్చాయంటూ ప్రలోభ పెట్టడం, బ్యాంకులో వివరాలు తప్పుగా నమోదయ్యాయని ఫోన్ కాల్ ద్వారా నమ్మించడం, ఇంట్లో వారికి లేదా స్నేహితులకు ఆరోగ్యం బాగాలేదని అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయని తెలిసిన వాళ్ళ సోషల్ మీడియా అకౌంట్స్ నుండి మెసేజ్ పెట్టీ డబ్బులు కావాలని అడగడం, వాహనాలు, ఫర్నిచర్, ఆర్నమెంట్స్ లాంటివి మీకు బహుమతి వచ్చాయని చెప్పడం, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లయితే మీకు బహుమతులు అందిస్తామంటూ ఫోన్ కాల్ ద్వారా నమ్మించడం, మీ అకౌంట్ కు మిస్టేక్ లో డబ్బులు ట్రాన్స్ఫర్ అయ్యాయని తెలపడం, ఇలాంటివి అన్ని సైబర్ మోసగాళ్లు ఎత్తుగడలని ప్రజలు గ్రహించాలన్నారు. ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళు వినియోగదారు లను నమ్మించి వారి బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులు కాజేస్తున్నారని అన్నారు.సైబర్ మోసానికి గరై డబ్బు పోగొట్టుకుంటే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం అందిస్తే, కేసు నమోదు చేసి మీ నగదును హోల్డ్ చేసే అవకాశం ఉందన్నారు.సైబర్ మోసానికి గురైన ప్రతి ఒక్కరూ కచ్చితంగా పిర్యాదు చేయాలని సూచించారు.సైబర్ మోసాలను అరికట్టడానికి ప్రజల జాగ్రత్తలు చాలా ముఖ్యమైనవని పేర్కొన్నారు.సైబర్ మోసాల నివారణకు జిల్లాలో సైబర్ సెక్యూరిటీ సెల్ పటిష్టంగా పని చేస్తుందని, సైబర్ మోసాల పట్ల సైబర్ వారియర్స్ ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ నందు సైబర్ వారియర్స్ పని చేస్తున్నారని తెలిపారు. కేసులను వేగంగా పరిష్కరించడానికి కార్యాచరణతో పని చేస్తున్నారని చెప్పారు.సైబర్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పోలీసు కళాజాత బృందం, సైబర్ సెక్యూరిటీ సెల్, స్థానిక పోలీసులు కళాశాలల్లో, కాలనీల్లో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

## సుభాని ఖాన్ ను సన్మానించిన జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు



**ఖమ్మం, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** ప్రకాష్ నగర్ వంతెన పై మున్నేరు వరద ఉధృతతో ఉధృతలో చిక్కుకున్న తొమ్మిది మంది ప్రాణాలను కాపాడి కాపాడిన శుభాని ఖాన్ ను తమ ప్రాణానికి తెగించి పోతే తాను ఒక్కడే పోతా వస్తే 10 మంది వస్తాం అని ధైర్యం తో ప్రకాష్ నగర్ వంతెన పై మున్నేరు వరద ఉధృతలో చిక్కుకున్న 9 మంది ప్రాణాలు కాపాడిన జెసిబి డ్రైవర్ సుభాని ఖాన్ ను హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో సన్మానించి 25000/- చెక్ అందించినా జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఖాలిద్ ముబశ్శిర్ ఉజ్ జఫర్ , స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ హాఫీజ్, ప్రముఖ సోషల్ యాక్టివిస్ట్ ఖాలిదా పర్వీన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ప్రజా పాలన దినోత్సవం

- సెప్టెంబర్ 17న శాసనమండలి చైర్మన్ గుత్తా సికిందర్ రెడ్డిచే పతాకావిష్కరణ
- ఏర్పాట్లపై అధికారులను ఆదేశిస్తూ సమీక్షించిన
- కలెక్టర్ హనుమంత్ కె జండేగా



**భువనగిరి ప్రతినిధి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి)** సెప్టెంబర్ 17 ప్రజా పాలన దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతుకి జండేగా అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 17 న నిర్వహించబోయే తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ ఏర్పాట్లను ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించబడుతుందని, ఉదయం 10.00 గంటలకు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకావిష్కరణ గావిస్తారని తెలిపారు. సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను నిర్వహించాలని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, అడిషనల్ డీ.సీ.పీ. లక్ష్మీనారాయణ, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, ఏ.సీ.పీ. రవి కిరణ్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సర్వం కోల్పోయాం.. ఆదుకోండి..

## అపార నష్టం జరిగింది.. కేంద్ర బృందాలకు రైతుల వేడుకోలు





**కోదాడ,సెప్టెంబర్ 12,జనంసాక్షి:** కోదాడ నియోజకవర్గం లోని వరద ప్రభావిత ముప్పు ప్రాంతాలైన అనంతగిరి మండలం గోండ్రియాల,కోదాడ మండలం తొగర్రాయి,నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం లను కేంద్ర అధికారుల బృందం గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వరద నష్టం అంచనాల బృందం కల్నల్ కేపీ సింగ్,మహేష్ కుమార్, శాంతినాథ్ శివప్ప లు కోదాడ నియోజకవర్గం లో పర్యటించి వరద ముప్పు కి గురైన ఇండ్లను,ఇసుక మెటలు పెట్టిన పొలాలను,వరదతో దెబ్బతిన్న విద్యుత్ స్టంబాలను పరిశీలించారు.నిరుపేదలం భరించలేని నష్టం జరిగింది, ఆదుకోవాలని కేంద్ర బృందాల కు రైతుల వేడుకొన్నారు.నీట మునిగిన పొలాలు,ఇసుక మేట వేసిన పంటలు చూసారు,ప్రభుత్వానికి పూర్తి నివేదిక అందిసా_మన్నారు.

**ఖమ్మం జిల్లా బృందానికి,సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆహ్వానం**

ఖమ్మం నుంచి వచ్చిన అధికారుల బృందానికి గోండ్రియాల లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆహ్వానించారు.గోండ్రియాల లో వరద ముప్పు తో కూలిన గూటి పార్వతమ్మ,గంటు గరతయ్య ఇండ్లని పరిశీలించారు. అలాగే వరదతో ఇంట్లోని సామాగ్రి అంత కొట్టుకోనిపోయిన గౌరవరపు రవి ఇంట్లోకి వెళ్ళి చూసారు.అలాగే మండల ప్రాథమిక పాఠశాలను,ఉన్నత పాఠశాలలను అధికారుల బృందం పరిశీలించారు.గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా బ్లీచింగ్ వేదజల్లాలని, యాంటీ లార్వా స్ప్రే చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.గ్రామం లో 15 రోజులలో 3 సార్లు డోర్ టూ డోర్ ఫీవర్ సర్వే చేయాలని వైద్యాధికారులకు సూచించారు.

**తొగర్రాయి గ్రామంలో ముంపుకు గురైన వంతెన పరిశీలన**

తదుపరి తొగర్రాయి గ్రామం లో వరద ముప్పు తో తెగిన రోడ్డు,వంతెన ను పరిశీలించారు.తెగిన రోడ్డు వంతెన వద్ద ఏర్పాటు చేసిన ఛాయ చిత్ర ప్రదర్శన ద్వారా జిల్లా కలెక్టర్ గ్రామం లో వరద వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర అధికారుల బృందానికి వివరించారు. అనంతరం వరద ముప్పు తో దెబ్బ తిన్న నామాల సాయిలు ఇంటికి వెళ్ళి వారితో మాట్లాడినారు.అలాగే వరద తో ఇంట్లో సామాగ్రి అంత కొట్టుకోనిపోయిన వంగాల మమత గారితో మాట్లాడి నష్ట పరిహారం అందేలా చూస్తామని అన్నారు.అలాగే వరదతో కూలిన విద్యుత్ స్తంబాలపై,విద్యుత్ సరఫరా పై అధికారులు కేంద్ర అదికారుల బృందానికి వివరించారు.అనంతరం వరదతో మునిగిపోయిన పంటలు,కోతకు గురై ఇసుక మెటలు పెట్టిన పొలాలు పరిశీలించి రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా రైతులు భారీ వర్షం తో వచ్చిన వరద వళ్ళ తమకి జరిగిన నష్టాన్ని కేంద్ర అధికారులకు వివరించారు.

**కాగిత రామచంద్రపురం వద్ద ఎడమ కాలవ గండి పరిశీలన**

నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం వద్ద యన్ ఎస్ పి ఎడమ కాలువకు పడిన గండి ని పరిశీలించారు.పాలేరు రిజర్వాయర్ లో 9 అడుగులు మేర నీరు ఎక్కువ రావటం తో అవి వెనక్కి వచ్చి గండి పడిందని కలెక్టర్ వివరించారు.వేగవంతంగా కాలువ లైనింగ్ పనులు,గండి పూడ్చటం త్వరగా పూర్తి చేసి ఆయకట్టుకి నీరు విడుదల చేయాలని కేంద్ర అధికారుల బృందం ఇరిగేషన్ అధికారులను ఆదేశించగా వారం రోజుల్లో గండి పూడ్చి నీరు విడుదల చేస్తామని కేంద్ర అధికారుల బృందానికి తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ఆర్ డి ఓ సూర్యనారాయణ,జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి,ఇరిగేషన్ డి ఈ రఘు,తహసీల్దార్లు హిమ బిందు,వాజీద్ అలీ,సరిత,యం పి ఓ పాండు రంగన్న,కార్యదర్శిలు వీర ప్రభాకర్,అభిలాష్,వివిధ విభాగాల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం

## ప్రజా పాలన దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం కార్యక్రమం జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లు, ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లతతో కలిసి సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట పట్టణం, మండలాలలో నిర్వహించే నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జన కార్యక్రమాల పరివేక్షణకు అధికారులకు విధులు కేటాయించామని, ఆయా శాఖ అధికారులు సిబ్బంది షిఫ్టులవారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని తెలిపారు. అంతరాయం లేకుండా విద్యుత్ సౌకర్యం కల్పించటానికి తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. గజ ఈతగాళ్ళని లైఫ్ జాకెట్లు ధరించి సిద్ధంగా ఉండాలని మత్స్యశాఖ అధికారికి ఆదేశించారు.రహదారులపై గుంటలను తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.వాహనాల కొరకు ప్రత్యేక రూట్ మ్యాప్ తయారు చేయాలని తెలిపారు.అన్ని విగ్రహాల కమిటిలు ప్రత్యేక ఐడీ కార్డులు ధరించాలని సూచించారు.భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిమజ్జనోత్సవం జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు యంత్రాంగం సలహాలు సూచనలు పాటించాలని పేర్కొన్నారు. నిమజ్జనం జరిగే రోజున మున్సిపాలిటీలలో, మండలాలలో మద్యం దుకాణాలు మూసివేయాలని కలెక్టర్ ఎక్సైజ్ అధికారులకు ఆదేశించారు.ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో 17న ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల స్టాల్ ను ఏర్పాటు చేయాలని, స్టాల్స్ ఏర్పాట్లను చూడాలని డిఆర్డిఏ పిడి, ఇన్చార్జి జడ్పి సీఈఓ వివి అప్పారావుకు తెలిపారు.ఆ రోజున జరిగే కార్యక్రమం పై డుస్- డోంట్డుస్ తయారు చేయాలని కలెక్టరేట్ సి సెక్షన్ అధికారులకు తెలిపారు.అన్ని పాఠశాలల్లో కాలేజీల్లో, కార్యాలయాల్లో ఉదయం 8 గంటలకల్లా కార్యక్రమం ముగించుకుని తొమ్మిది గంటలకల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రావాలని, అన్ని శాఖల అధికారులు తమ పూర్తి సిబ్బందిని 17న జరిగే ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సతీష్ కుమార్, ఆర్డిఓ వేణు మనోహర్, తహసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, సిపిఓఎల్ కిషన్, డిఈఓ అశోక్,డిఐఈఓ ఆర్.లక్ష్మణ్ నాయక్, డిసిఓ పద్మ , జిఎం ఇండస్ట్రీస్ సీతారాం, డిబిసిడిఓ జి.అనసూయ, డిసిహెచ్ ఎస్ వెంకటేశ్వర్లు ,మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, డిడబ్ల్యూకే నరసింహారావు , డిఎస్ఓ జి.రామచంద్రరావు, డీఎండబ్ల్యూఓ జగదీశ్వర్ రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జానయ్య, ఎంబీఐ ఆదిత్య, డిపిఆర్ఈ మాధవన్ ,డిస్టిక్ ఇరిగేషన్ ఆఫీసర్ సిహెచ్ వి.లక్ష్మారెడ్డి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# నీరవ్ మోదీ ఆస్తుల జప్తుకు ఈడీ చర్యలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** పెద్ద కుంభకోణాలకు పాల్పడి దేశాన్ని వీడి వెళ్లిపోయిన వారి ఆటలు కట్టింటే పనిలో మోదీ సర్కార్ ఉన్నట్లు కనిపిస్తోంది. వారు ప్రస్తుతం ఇండియాలో లేనప్పటికీ వారి నుంచి డబ్బు ముక్కు పిండి వసూలు చేసేందుకు ఈడీని రంగంలోకి దించింది. పరారీలో ఉన్న వ్యాపారవేత్త నీరవ్ మోదీపై ఈడీ చర్యలు ప్రారంభించింది. దీంతో వారికి సంబంధించిన కోట్ల రూపాయల విలువైన ఆస్తులను జప్తు చేస్తోంది. ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు మోసం కేసులో ఈడీ ఈ చర్య తీసుకుంది. ఈ క్రమంలో నీరవ్ మోదీకి చెందిన రూ.29.75 కోట్ల విలువైన స్థిరాస్తులతో పాటు బ్యాంక్ బ్యాలెన్స్‌లను ఈడీ అధికారులు సీజ్ చేసి స్వాధీనపరుచుకున్నారు. వాస్తవానికి ఈ వ్యవహారంలో బ్యాంకు అధికారుల నుంచి అందిన ఫిర్యాదు ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. భారత శిక్షాస్మృతి 1860, అవినీతి నిరోధక చట్టం 1988 సెక్షన్ల కింద నీరవ్ మోదీపై సీబీఐ కేసు నమోదు చేసింది.

దేశం విడిచి పారిపోయిన నీరవ్ మోదీ బ్యాంకులను రూ.6,498.20 కోట్ల మేర మోసగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నప్పుడు, భారతదేశంలోని నీరవ్ మోడీ, అతని కంపెనీలకు చెందిన రూ.29.75 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ గుర్తించింది. వీటిలో భూమి, భవనాలు, బ్యాంకు ఖాతా డిపాజిట్లు కూడా ఉన్నట్లు తేలింది. ఈ కేసులో నీరవ్ మోదీపై మనీలాండరింగ్ నిరోధక చట్టం 2002 కింద కూడా కేసు నమోదైంది. గతంలో విచారణ సందర్భంలో నిందితుడితో పాటు అతని సహచరులకు చెందిన రూ.2,596 కోట్ల విలువైన స్థిరచరాస్తులు జప్తు చేయబడ్డాయి. మరోవైపు ఆర్థిక నేరగాళ్ల చట్టం–2018 కింద నీరవ్ మోదీ, అతని సహచరులకు చెందిన రూ.692.90 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయాలని ముంబైలోని ప్రత్యేక కోర్టు ఆదేశించింది.

కేసులో దర్యాప్తు తర్వాత రూ.1,052.42 కోట్ల విలువైన ఆస్తులు పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇతర బ్యాంకులకు తిరిగి వచ్చాయి. రూ.13 వేల కోట్ల పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాన నిందితుడు నీరవ్ మోదీ గత కొన్నేళ్లుగా పరారీలో ఉన్నాడు. ప్రస్తుతం బ్రిటన్‌లో జైలులో ఉన్న అతడిని భారత్‌కు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చట్టపరమైన మార్గాలను పరిశీలిస్తోంది. నీరవ్ మోడీ మరియు అతని మామ మెహుల్ చోక్సీ బ్యాంకు అధికారులతో కలిసి నకిలీ లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ ద్వారా బ్యాంకులను మోసం చేసిన వ్యవహారం 2018లో వెలుగులోకి వచ్చింది. ఇది భారతీయ బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద ప్రకంపనలు సృష్టించింది.




## టీసీఎస్ ఉద్యోగులకు ఐటీ శాఖ నోటీసులు




**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** టీసీఎస్ ఉద్యోగులకు ఆదాయపు పన్ను శాఖ గట్టి షాక్ ఇచ్చింది. పలువురు ఐటీ విభాగం నుంచి పన్ను నోటీసులు అందుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్)కు సంబంధించి ఈ నోటీసులు వచ్చినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 9న సంస్థలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది వీటిని రిసీవ్ చేసుకున్నట్లు సమాచారం.

ఐటీ చట్టంలోని సెక్షన్ 143(1) ప్రకారం ఆదాయపు పన్ను శాఖ ఈ నోటీసులు పంపించింది. 2024కు గాను పూర్తి పన్ను మొత్తాన్ని కంపెనీ చెల్లించినట్లు ఎటువంటి రికార్డు లేదని అందులో పేర్కొంది. సమస్యకు కారణమైన నగదుతో పాటు దానిపై వడ్డీ మరియు పెనాల్టీలతో కలిపి చెల్లించాలని నోటీసులో స్పష్టం చేసింది. ఉద్యోగులు 50 వేల నుంచి 1.45 లక్షల మేరకు డిమాండ్ నోటీసులు అందుకు న్నారు. 'ఇది సిస్టమ్ లోపం కావచ్చు. టీడీఎస్ క్లెయిమ్ స్వయం చాలకంగా పోర్టల్‌లో అప్‌డేట్ చేయబడదు. కాబట్టి మేము మాన్యువల్‌గా నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా ఇప్పుడు పన్నులో రికార్డ్ కాని భాగాన్ని చెల్లించాలని మాకు సమాచారం అందింది. దీని కారణంగా మా ఆదాయపు పన్ను రీఫండ్ మరింత ఆలస్యం అవుతుంది' అని టీసీఎస్ ఉద్యోగి ఒకరు తెలిపారు. 'ఆదాయపు పన్ను శాఖ జారీచేసిన 26ఏఎస్.. కంపెనీ ఇచ్చిన ఫారమ్ 16లోని టీడీఎస్‌తో అనుసంధానం అవుతుంది. అనంతరం అధికారులు ఐటీ రిటర్న్‌లను తిరిగి ప్రాసెస్ చేస్తారు. ఈ మేరకు నోటీసులు వచ్చిన ఉద్యోగులు నిర్ణీత సమయంలోగా సరిదిద్దిన సమాచారం అందుకుంటారు. డిమాండ్ పన్ను మొత్తాన్ని చెల్లించాల్సిన అవసరం లేదు' అని టీసీఎస్ తన ఉద్యోగులకు అంతర్గత ఈ–మెయిల్‌లో తెలిపింది.

## మార్కెట్ సూపర్ ఫాస్ట్ రికవరీ

**ముంబై, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** భారతీయ స్టాక్ మార్కెట్లు అనూహ్యంగా భారీ ర్యాలీతో రికార్డుల మోద మోగించాయి. దీంతో దేశీయ బెంచ్ మార్క్ ఈక్విటీ సూచీలు జీవితకాల గరిష్ఠాలకు అతిచేరువలో తమ ప్రయాణాన్ని ముగించాయి. మార్కెట్ల ముగింపు నాటికి బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 1440 పాయింట్లు లాభపడగా, మరో కీలక సూచీ నిఫ్టీ 470 పాయింట్ల పెరుగుదలను చూసింది. ఇదే క్రమంలో నిఫ్టీ బ్యాంక్ సూచీ 763 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 702 పాయింట్ల వృద్ధితో నేడు తమ ప్రయాణాన్ని ముగించాయి. ఇదే క్రమంలో అన్ని రంగాలకు చెందిన సూచీలు ఇంట్రాడేలో లాభాల జోరును చూడటంతో చివరికి సానుకూల లాభాలతో ప్రయాణాన్ని ముగించాయి. వీక్లీ ఎక్స్‌పైరీ డే నాటికి మార్కెట్లు దాదాపు రెండు శాతం లాభపడి సరికొత్త గరిష్టానికి చేరుకున్నాయి. సెషన్ చాలా వరకు అణచివేయబడినప్పటికీ, సెక్టార్లలోని హెవీవెయిట్ స్టాక్‌లలో బలమైన కొనుగోళ్లు చివరి గంటల్లో సూచీని బాగా పైకి నడిపించాయని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ నిపుణుడు అజిత్ మిశ్రా వెల్లడించారు. మెటల్స్, ఆటో, ఇంధనం లాభాల్లో ముందుండడంతో అన్ని రంగాలు ర్యాలీకి దోహదపడ్డాయి.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 472 | ₹ 56 |
| వరంగల్ | ₹ 472 | ₹56 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

| హైదరాబాద్ | |
|---|---|
| ₹72,870 (24 క్యారెట్లు) | ₹ 66,800 (22 క్యారెట్లు) |

| చెన్నై | |
|---|---|
| ₹66,800 (22 క్యారెట్లు) | ₹72,870 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 89,500

## భారత్‌కు యూరప్‌తో ఆయిల్ బంధానికి బ్రేక్!




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** యుద్ధం వల్ల పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆర్థిక, వాణిజ్య ఆంక్షలు విధించడంతో యూరోపియన్ దేశాలతో ఉన్న సత్సంబంధాలను కోల్పోయింది. దీంతో తన ముడి చమురును విక్రయించి ఎలాగైనా ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే తపనతో అతి తక్కువ ధరకే ఆయిల్ విక్రయించడం మొదలుపెట్టింది. ఇది భారతీయ రిఫైనర్లకు ప్రయోజనం చేకూరుస్తోంది. యుద్ధానికి ముందు భారత్ ముడి చమురు దిగుమతుల్లో 1 శాతంగా ఉన్న రష్యా వాటా మొదటి 5 నెలల్లోనే 42 శాతానికి పెరిగింది. రష్యా నుంచి ముడి చమురు ఎగుమతులు పెరగడం కారణంగా ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, యూఎస్ వంటి దేశాలతో భారత్‌కు ఉన్న వాణిజ్య సంబంధాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అవి ఇండియాకు చమురు సరఫరాను నిలిపివేస్తున్నాయి. ఇదే సమయంలో దక్షిణ అమెరికా దేశాలకు రష్యా తన ఆయిల్ సరఫరాను పెంచింది. ఇది భారతీయ రిఫైనర్లకు ప్రతికూలంగా పరిణమించింది.

గతంలో భారతీయ ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేసే రష్యా చమురులో ఎక్కువ భాగం యూరప్‌కు ఎగుమతి అయ్యేది. ఫలితంగా అమెరికా పంపిణీ సంస్థలు గట్టి పోటీని ఎదుర్కొన్నాయి. ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ వ్యవహారం సాగిపోయింది. కానీ ఇటీవల రష్యా తన డీజిల్ ఉత్పత్తిని దక్షిణ అమెరికాకు పెంచడంతో, అక్కడ యూఎస్ వాణిజ్యం తీవ్ర సమస్యలను ఎదుర్కొంది. ఫలితంగా అమెరికా తన చమురు ఉత్పత్తిని మిత్రదేశమైన ఐరోపాకు మార్చింది. దీంతో భారత్ ఎగుమతులు పరోక్షంగా దెబ్బతిన్నాయి.

ఏప్రిల్–ఆగస్టు 2024 మధ్య ఐరోపాకు భారత్ డీజిల్ ఎగుమతులు రోజుకు 1.5 లక్షల బ్యారెళ్లకు పడిపోయాయి. గత సంవత్సరం స్థాయిలతో పోలిస్తే ఏకంగా మూడో వంతు తగ్గింది. దీనికితోడు ఇంధన డిమాండ్ సైతం మందగించడం, ఆగ్నేయాసియా మరియు తూర్పు ఆఫ్రికాలో ఆర్థిక మందగమనం వెరసి భారతీయ రిఫైనర్లు మరింత ప్రభావితమయ్యాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 5 నెలల్లో చమురు ఎగుమతులు 6 శాతం క్షీణించాయి. ఎర్ర సముద్రంలో హౌతీ దాడులు కూడా యూరప్‌కు భారత్ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపాయి.




# ఆరు దేశాల్లో వాట్సాప్‌పై నిషేధం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** వాట్సాప్‌కు భారత్‌లోనూ 53కోట్ల మంది యూజర్లు ఉన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన అవసరాల కోసం వాట్సాప్‌ను ఉపయోగించుకుంటున్నారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఆరు దేశాల్లోని ప్రభుత్వాలు మెటా యాజమాన్యంలోని వాట్సాప్‌ని నిషేధించాయనే విషయం చాలా మందికి తెలియదు. ఆయా దేశాలు ఎందుకు వాట్సాప్‌ని బ్యాన్ చేశాయో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఇందులో భారత్‌కు పొరుగుదేశమైన చైనాతో పాటు ఇరాన్, యూఏఈ, ఖతార్, సిరియా, ఉత్తర కొరియా ఉన్నాయి. ఈ దేశాలు తమ దేశాల్లో వాట్సాప్ వాడకాన్ని నిషేధించాయి. బ్యాన్ వెనుక కారణాలు ఒక్కో దేశంలో ఒక్కో రకంగా ఉన్నాయి.

ఉత్తర కొరియాలో వాట్సాప్‌ని బ్యాన్ చేసిన దేశాల్లో ఉత్తర కొరియా ఒక్కటి. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ అన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన ఇంటర్నెట్ విధానాలు ఇక్కడ అమలులో ఉన్నాయి. ఉత్తర కొరియాలో సాధారణ ప్రజలకు ఇంటర్‌నెట్ వినియోగం పరిమితంగా అందుబాటులో ఉంటుంది. ఇక్కడ ప్రభుత్వం కమ్యూనికేషన్‌పై నియంత్రణను కొనసాగిస్తుంది. ఈ క్రమంలో వాట్సాప్ సహా పలు యాప్‌ని వినియోగించకుండా నిషేధం విధించారు. తద్వారా స్థానిక సమాచారాన్ని బయటకు వెల్లడికాకుండా సమాచార వ్యాప్తిని అడ్డుకట్ట వేసేలా కిమ్ వాట్సాప్‌ని బ్యాన్ చేశారు.

భారత్‌కు పొరుగుదేశం చైనాలో దాదాపు పరిస్థితి కాస్త ఉత్తర కొరియా తరహాలోనే ఉంటుంది. ఇక్కడ ఇంటర్‌నెట్ వినియోగంపై ప్రభుత్వానికే నియంత్రణ ఉంటుంది. చైనీస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోని గ్రేట్ ఫైర్‌వాల్ పౌరులు బయటి ప్రపంచానికి సంబంధించిన అనేక విదేశీ యాప్‌లు, వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేయకుండా నిరోధిస్తుంది. విదేశీ యాప్‌లకు బదులుగా వుయ్‌చాట్ తదితర స్వదేశీ యాప్‌లను ప్రోత్సహించేందుకు చైనా ప్రభుత్వం సమగ్ర వ్యూహంపై పని చేస్తుంది. కమ్యూనికేషన్ నియంత్రించడంలో భాగంగా వాట్సాప్‌ని నిషేధించింది.

వాట్సాప్‌ను సిరియాలోనూ నిషేధించారు. సిరియా చాలా కాలంగా అంతర్యుద్ధంతో పోరాడుతోంది. పైగా సిరియాపై అనేక ఆంక్షలు విధించారు. దీని కారణంగా సిరియాలో వాట్సాప్ నిషేధించబడింది. దేశంలో జరిగే విషయాలు బయటికి చేరడం ఇక్కడి ప్రభుత్వానికి సైతం ఇష్టం లేదు. అదే సమయంలో సమగ్ర ఇంటర్నెట్ సెన్సార్‌షిప్ విధానంలో ఓ భాగంగా వాట్సాప్ నిషేధం కూడా భాగమే.

ఇరాన్ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక ఆంక్షలను ఎదుర్కొంటోంది. అణుబాంబు విషయంలో ఇరాన్, అమెరికాల మధ్య వివాదం నడుస్తోంది. దీని కారణంగా వాట్సాప్ ఇరాన్‌లో ఎప్పటికప్పుడు ఆంక్షలను ఎదుర్కోవాల్సి వచ్చింది. రాజకీయ అశాంతి దృష్ట్యా కమ్యూనికేషన్, సమాచార వ్యాప్తిని నియంత్రించడానికి అక్కడి ప్రభుత్వం వాట్సాప్‌ను కూడా నిషేధించింది.

ఖతార్ ప్రభుత్వం వాట్సాప్ వాయిస్, వీడియో కాలింగ్ ఫీచర్స్‌ని బ్లాక్ చేసింది. కేవలం టెక్స్ట్ సందేశాలు పంపుకునేందుకు మాత్రమే అవకాశం ఉన్నది. ఖతార్ ప్రభుత్వం తన టెలికాం కంపెనీలకు మద్దతు ఇచ్చేందుకు కాల్స్‌పై నిషేధం విధించింది.

## కొత్త పార్లమెంటులో టిడిపికి కార్యాలయం

- లోక్‌సభ సెక్రటేరియట్ ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్12 (జనంసాక్షి) :** ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగు దేశం పార్టీకి నూతన పార్లమెంటులో కొత్తగా కార్యాలయం కేటాయించారు. ప్రస్తుత లోక్‌సభలోని వివిధ పార్టీలకు పార్లమెంటరీ పార్టీ కార్యాలయాల కేటాయింపులో భాగంగా టీడీపీకి కేటాయింపు జరిగింది. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ ఉత్తర్వులు జారీ చేసింది. నూతన పార్లమెంటు మొదటి అంతస్తులో తెలుగుదేశం పార్టీకి కార్యాలయం ఇచ్చినట్టు తెలిపింది. మొదటి అంతస్తులోని ఎఫ్09 నుంచి ఇకపై టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. నూతన పార్లమెంటు మొదటి అంతస్తులో ప్రధాని, కేంద్ర మంత్రుల కార్యాలయాలు ఉన్నాయి. గతంలో పాత పార్లమెంటులో (సంవిధాన్ సదన్) టీడీపీ కార్యాలయం ఉండేది. కాగా పాత పార్లమెంటు ప్రాంగణంలో ఇప్పటికీ కొనసాగుతున్న కార్యాలయాలలోనే ఇక ముందు కూడా కొనసాగేందుకు అనేక పార్టీల మొగ్గు చూపాయి. దీంతో ఆయా పార్లమెంటరీ పార్టీల విజ్ఞప్తి మేరకు బీజేపీ, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, జనతాదళ్ యునైటెడ్ సహా పది పార్టీలకు ఆ కార్యాలయాలనే లోక్ సభ సెక్రటేరియట్ కేటాయించింది.

## చంద్రగిరి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు అక్కడిక్కడే దుర్మరణం

**తిరుపతి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** తిరుపతి జిల్లాలో గురువారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. చంద్రగిరి మండలం భాకరాపేట కనుమ రహదారిలో ఓ కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. కలకడ నుంచి చెన్నైకి టమాటా లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ అదుపు తప్పి కారు, బైక్‌ను ఢీకొట్టింది. కంటైనర్ కారుపై పడిపోగా నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరికి గాయాలు కాగా.. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. కారులోని యువకుడు కంటైనర్ కింద చిక్కుకోగా.. తనను కాపాడాలంటూ వేడుకున్న దృశ్యాలు అందరినీ కంటతడి పెట్టించాయి.

## లాలూ ప్రసాద్ యాదవ్‌కు యాంజియోప్లాస్టీ

**పాట్నా, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. లాలూ గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చేరారు. యాంజియోప్లాస్టీ చేయించుకోవాలని కార్డియాలజిస్టులు మాజీ సీఎంకు సూచించగా ఆయన అంగీకరించారు. ఈ క్రమంలో గురువారం వైద్యులు యాంజియోప్లాస్టీ చేశారు. లాలూ గత కొంతకాలంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. గతంలో ఆయన సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకున్న విషయం తెలిసిందే. ఆయన కుమార్తె కిడ్నీ దానం చేసిన విషయం తెలిసిందే. లాలూ ప్రసాద్ యాదవ్ ల్యాండ్ ఫర్ స్కామ్, దాణా కుంభకోణం కేసుల్లో బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆ తర్వాత ఆరోగ్య సమస్యలతో ఆయన నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.

ఈ నెల 10న ఆయన ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైద్య పరీక్షల తర్వాత ఒకటి, రెండురోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని ఆసుపత్రివర్గాలు తెలిపాయి. 2014లో లాలూకు ఇదే ఆస్పత్రిలో అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ జరిగింది.

## టేలర్ స్విఫ్ట్ మూల్యం చెల్లించుకోక తప్పదు

- డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** పాప్ స్టార్ టేలర్ స్విఫ్ట్‌పై అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ప్రత్యర్థి కమలా హారిస్ కు టేలర్ స్విఫ్ట్ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. తాను కమలాకే ఓటు వేస్తానని వెల్లడించారు. అయితే, టేలర్ ప్రకటనను ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె ప్రకటనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టేలర్ కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 'నేను టేలర్ అభిమానిని కాదు. ఆమె ఎప్పుడూ డెమోక్రాట్లనే సమర్థిస్తున్నట్లు అనిపిస్తోంది. అందుకు ఆమె భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు.

కాగా, ఈ ఎన్నికల్లో తాను కమలా హారిస్‌కే మద్దతు ఇస్తానని టేలర్ బుధవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 'అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్, టిమ్ వాజ్‌కు ఓటు వేస్తాను. దేశ ప్రజల హక్కుల కోసం కమలా పోరాడుతున్నారు. మన హక్కులు మనకు కావాలంటే ఒక వారియర్ అవసరమని భావిస్తున్నాను. గందరగోళంతో కాకుండా ప్రశాంతంగా దేశం కోసం ఏదైనా సాధించొచ్చని నమ్ముతున్నాను. అందుకే నేను కమలా హారిస్‌కే మద్దతు ఇస్తున్నాను. ఎంతో ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను' అని తన సోషల్ మీడియా పోస్టులో టేలర్ వెల్లడించారు.

## అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్న జేడీయూ నేత అరెస్ట్

- పార్టీ నుంచి బహిష్కరణ



**పాట్నా, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** అక్రమ మద్యం వ్యాపారంతోపాటు జూదం వ్యవహారంతో సంబంధం ఉన్న జేడీయూ నేతతో సహా 14 మందిని బీహార్ పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వం, ఆయన పార్టీపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ నేతను పార్టీ నుంచి జేడీయూ బహిష్కరించింది. బీహార్‌లో మద్యాన్ని నిషేధించారు. అయితే నలంద జిల్లాలో మద్యం అక్రమ వ్యాపారంతోపాటు జూదం జోరుగా సాగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అంబర్ ప్రాంతంలో రైడ్ చేశారు. జేడీయూ నేత సీతారాం ప్రసాద్‌తో సహా 14 మందిని పోలీసులు అరెస్టు చేశారు. 292 లీటర్ల విదేశీ మద్యం, 10 డెక్ కార్డులు, 9 ద్విచక్ర వాహనాలు, 14 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై బీహార్‌లోని ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. ప్రభుత్వ రక్షణలో 'లిక్కర్ మాఫియా' కొనసాగుతున్నదని ఆర్జేడీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో జేడీయూ స్పందించింది. అస్తవాన్ బ్లాక్ జేడీయూ అధ్యక్షుడు సీతారాం ప్రసాద్‌ను పార్టీ నుంచి బహిష్కరించింది. అన్ని పార్టీ పదవుల నుంచి ఆయనను తొలగించినట్లు జేడీయూ ప్రకటించింది. మరోవైపు ఈ అరెస్టులు బీహార్ ప్రభుత్వం విశ్వసనీయతను తెలియజేస్తోందని ఆ రాష్ట్ర మంత్రి, జేడీయూ నలంద జిల్లా ఇన్‌చార్జి విజయ్ చౌదరి తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సొంత పార్టీ వారు కూడా చట్టపరంగా చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు.

## చైనాతో మెరుగుపడ్డ సంబంధాలు

- విదేశాంగ మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** చైనాతో సంబంధాలు, సరిహద్దు వివాదంపై విదేశాంగ మంత్రి జైశంకర్ గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. స్విట్జర్లాండ్ రాజధాని జెనీవా సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీ ఇంటరాక్టివ్ సెషన్‌లో మాట్లాడారు. చైనాతో దాదాపు 75శాతం సమస్యలు పరిష్కామయ్యాయని.. సరిహద్దుల్లో సైనికీకరణ పెరగడం పెద్ద సమస్యగా అభివర్ణించారు. జూన్ 2020లో గాల్వాన్ వ్యాలీలో జరిగిన ఘర్షణలు భారత్–చైనా సంబంధాలను ప్రభావితం చేశాయన్నారు. సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని.. కొంత వరకు పురోగతి సాధించామని చెప్పారు. బలగాల ఉపసంహారణకు సంబంధించిన సమస్యలు 75 శాతం పరిష్కారం అయ్యాయని తాను చెప్పగలనని.. చేయాల్సిన పనులు కొన్ని ఉన్నాయని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. వివాదాన్ని పరిష్కరించుకుంటే సంబంధాలు మెరుగు పడుతాయన్నారు. పరిష్కారం దొరికితే శాంతి, సామరస్యం నెలకొంటుందని.. ఆ తర్వాత ఇతర అవకాశాలను సైతం పరిశీలించవచ్చన్నారు. తూర్పు లడఖ్‌లోని పలుచోట్ల భారత్ – చైనా మధ్య ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. అయితే, రెండువైపులా విస్తృతమైన దౌత్య, సైనిక చర్చల తర్వాత అనేక ప్రాంతాల నుంచి బలగాలను ఉపసంహ రించారు. అదే సమయంలో రాబోయే రోజుల్లో అమెరికాలో క్వాడ్ సమ్మిట్ జరుగుతుందని భావిస్తున్నామని, కాలం గడుస్తున్న కొద్దీ ఇండో–పసిఫిక్‌లోని చాలా ప్రాంతాల్లో విశ్వాసం పెరుగుతోందని జైశంకర్ పేర్కొన్నారు.

# వరదలను జాతీయ విపత్తుగా గుర్తించాలి

- కేంద్రం రూ.10వేల కోట్ల ప్యాకేజీని ప్రకటించాలి
- అశాస్త్రీయంగా నష్టం అంచనా పరిహారం పెంపుదల చేయాలి
- కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని




**ఖమ్మం, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** తెలంగాణలో సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా గుర్తించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివరావు డిమాండ్ చేశారు. ఓదార్పు మాటలకు కేంద్రం పరిమితం కాకుండా తక్షణ సాయంగా రూ.10వేల కోట్లను ప్రత్యేక ప్యాకేజీగా ప్రకటించి తక్షణం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. వరదల సాయం పెంపుదల చేయాలని, జాతీయ విపత్తుగా గుర్తించాలని సిపిఐ -ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన -సాంబశివరావు మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో ఆగస్టు 30, 31 తేదీలలో రికార్డు స్థాయిలో వర్షం కురిసిందని దీంతో తెలంగాణలోని పలు ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నష్టం -వాటిల్లిందన్నారు. మున్నేరు. ఆకేరు పరివాహక ప్రాంతంలోని నివాస గృహాలు, వ్యవసాయ భూములు దెబ్బతిన్నాయన్నారు. ఆకస్మాత్తుగా -వరదలు రావడంతో కట్టు బట్టలతో ప్రజలు బయటపడ్డారని సాంబశివరావు తెలిపారు. నది పరివాహక ప్రాంతాల్లో భూములు సాగుకు పనికి రాకుండాపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరదల్లో నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ -వరదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు. వరదలు సంభవించినప్పుడు నష్టం అంచనా -అశాస్త్రీయంగా ఉందని నష్టపోయిన ప్రజలకు కనీస ఊరట కలిగించే రీతిలో పరిహారం లేదన్నారు. ఎకరం పంట నష్టం జరిగితే రూ.10వేలు ప్రకటించిన ప్రభుత్వం అసలు సాగుకు పనికిరాకుండాపోయిన భూములకు రూ.10వేలు ఏ మూలకు సరిపోతాయని ఆయన ప్రశ్నించారు. -ఎకర పంటకే ఇప్పటికీ రూ. 25వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చు చేశారని రూ. 10 వేలు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేయడాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. పెట్టుబడి ఆధారంగా పరిహారం ప్రకటించాలని ఇంట్లో వస్తువులు, జరిగిన నష్టాన్ని బట్టి పరిహారం ఇవ్వాలని పూర్తిగా దెబ్బతిన్న ఇండ్ల స్థానంలోనే ఇందిరమ్మ ఇండ్లను, ముంపుకు గురికాని ప్రాంతాలలో కేటాయించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. సాగుకు పనికి రాకుండాపోయిన భూములకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులతో అంచనా వేయించి పరిహారం ప్రకటించాలన లేదంటే ప్రభుత్వమే సాగుకు లాకి అయ్యేవిధంగా భూములను తయారు చేసి ఇవ్వాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. ఇండ్లు -నష్టపోయిన వారికి రూ. 30 వేల పరిహారం ఇవ్వడంతో పాటు పేదలకు రెండు నెలల పాటు నిత్యావసర వస్తువులను అందించాలని, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు భరించేవిధంగా చర్యలు తీసుకోవాలని సాంబశివరావు కోరారు. రూ.10వేల కోట్ల ప్యాకేజీని కేంద్రం ప్రకటించని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన ప్రకటించారు. రాష్ట్ర -వ్యాప్తంగా పలు చెరువులకు గండ్లు పడ్డాయని గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. సాగర్ కాలువకు -ఎరువులు, విత్తనాలు ఉచితంగా అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సానుభూతి మాటలకు పరిమితమై పరిహారం ప్రకటించకపోతే మరోసారి -పడిన గండ్లను పూడ్చి వేయాలని గడిచిన మూడు రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చిందని ఈ మార్పును సద్వినియోగం చేసుకుని గండ్లను పూడ్చి త్వరిత గతిన సాగునీటిని అందించేందుకు కాలువలకు నీటిని వదలాలని ఆయన కోరారు. పూర్తిగా నష్టపోయిన రైతులకురాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేసి పాలనను స్తంభింపజేస్తామని సాంబశివరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ -సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, బిజి క్లెమెంట్, తాటి వెంకటేశ్వరరావు? సిహెచ్ సీతామహాలక్ష్మి, అజ్మీర రామ్మూర్తి, మిడికంటి వెంకటరెడ్డి, దండు ఆదినారాయణ, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, పగడాల -మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, పలువురు మండల కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# కోలుకుంటున్న ఖమ్మం..

**ముంపు ప్రాంతాల ప్రజలకు సహాయ, పునరావాస చర్యలు వేగంగా చేపడుతున్నాం**

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ఖమ్మం, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** ముంపు ప్రాంతాల ప్రజలకు సహాయ, పునరావాస చర్యలు వేగంగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవలి భారీ వర్షాలు, వరదల కారణంగా డివిజన్ నెం. 11, 16, 17, 28, 29, 30, 34, 35, 46, 47, 48, 59, 60 మొత్తంగా 13 డివిజన్లలో నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు. ఇట్టి డివిజన్లలో 14 బృందాలను ఏర్పాటుచేసి, 9,292 కుటుంబాల సర్వే చేపట్టి, డాటా ఎంట్రీ పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో స్వర్ణభారతి ఫంక్షన్ హాల్, దంసలాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రామన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, జూబ్లీక్లబ్ మొత్తం5 చోట్ల రిలీఫ్ క్యాంపులు ఏర్పాటుచేసి, 7,700 మందిని అక్కడకు తరలించి, వసతితో పాటు, 9 రోజులపాటు భోజనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 13 వైద్య శిబిరాల ఏర్పాటు చేసి ఫీవర్ సర్వే చేపట్టామన్నారు. ప్రతి పునరావాస కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ పై సాంస్కృతిక సారథి కళాకారులు, మెప్మా, ఆశా వర్కర్లచే ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటికి అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ప్రజల్లో చైతన్యం తెస్తున్నట్లు ఆయన అన్నారు. ముంపు ప్రాంతాల్లో వరదల కారణంగా సర్టిఫికెట్లు, విలువైన పత్రాలు కోల్పోయిన వారికి అందజేయుటకు 8 ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి, సర్టిఫికెట్లు కోల్పోయిన వారినుండి దరఖాస్తుల స్వీకరణ బుధవారం నుండి చేపట్టామన్నారు. వారం రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించి, రెండోవారంలో సబంధిత శాఖలచే సర్టిఫికెట్ల జారీకి చర్యలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, ప్రజలు జాగ్రత్తలు తీసుకొని, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ అన్నారు.

# నిరంతరం ప్రజల కోసం పనిచేసేది కమ్యూనిస్టు పార్టీ లే

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు**




**ఖమ్మం, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** స్థానిక ఖమ్మం త్రీ టౌన్ గుమస్తాల సంఘ భవనం లో సిపిఎం త్రీ టౌన్ జనరల్ బాడీ సమావేశం 35 వ డివిజన్ కార్పోరేటర్ యల్లంపల్లి వెంకట్రావు గారు అధ్యక్షతన జరిగింది సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరావు గారు మాట్లాడుతూ ప్రజలు కష్టకాలంలో ఉన్నప్పుడు వారిని వెన్ను తట్టి ధైర్యం చెప్పి వారికి శక్తి మేరకు సహకరించేది కమ్యూనిస్టు లేనని ప్రభుత్వం తరఫున ప్రజలకు రావాల్సిన హక్కులను ఆర్థికవనాలను పోరాడి రప్పించడంలో సిపిఎం పార్టీ కృషి చేస్తుందని అలాగనే ఈ మునేరు వద్ద ప్రాంతాలకు అన్ని విధాల శాఖల అందించి ప్రభుత్వం తరఫున కూడా ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వ మూడు లక్షలు కేంద్ర ప్రభుత్వం మూడు లక్షలు ఆర్థిక శాఖ అందించాలని అన్నారు సిపిఎం పార్టీ ఉద్యమంలో భాగంగా పార్టీ మహాసభలు సెప్టెంబర్ అక్టోబర్ నవంబర్ డిసెంబర్ నెలలో శాఖ గ్రామ సభ నుండి మండల స్థాయి సభలు జిల్లా స్థాయి మహాసభలు నిర్వహిస్తున్నట్లు పార్టీ శ్రేణులు అందరూ ఉత్సాహంతో ఉత్తేజంతో పాల్గొనాలని పిలిపించారు స్థానిక సమస్యలపై కేంద్రీకరించి పనిచేయాలని ఎన్నికల ముందు ప్రభుత్వం చేసిన వాగ్దానాలు అమలుకై కృషి చేయాలని మంత్రులను ఎక్కడికక్కడ నిలదీసి వాగ్దానం వారు కృషి చేసేటట్లు పార్టీ శ్రేణులు ప్రజల తరఫున పోరాడాలని పిలుపునిచ్చారు ఇంకా ఈ జనరల్ బాడీ సమావేశంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుల ఎర్ర శ్రీకాంత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై విక్రం జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు బండారు రమేష్ 3 టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాస్ రావు త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు పత్తిపాక నాగ సులోచన శీలం వీరబాబు ఎస్కె సైదులు బండారు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేసిన మాజీ ప్రిన్సిపల్ తిప్పన సిద్దులు

**భద్రాచలం, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** ఇటీవల ఖమ్మాన్ని ముంచెత్తిన మున్నేరు వరదలకు ఖమ్మం పట్టణ ప్రజలు అతలాకుతలమయ్యారు. ఈ క్రమంలో భద్రాచలానికి చెందిన తెలంగాణ తొలి మలిదశ ఉద్యమ నాయకులు, మాజీ ప్రిన్సిపల్ తిప్పన సిద్ధులు శిష్యురాళ్లయిన కాల్వ ఒడ్డులో నివాసం ఉంటున్న నల్ల ఉషశ్రీ,, కళ్యాణిల ఇళ్ళు నీట మునిగాయి. విషయం తెలుసుకున్న ఆయన ఖమ్మం వచ్చి టీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా గురువారం స్థానిక నయాబజార్ జూనియర్ కళాశాలలో వారికి చెరో రూ.5వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ నాయకులు శంకర్రావు, టీఎన్జీవోస్ మాజీ అధ్యక్షులు రాజు, టీజీఎఫ్ కొత్తగూడెం నియోజకవర్గ ఇన్చార్జి మల్లెల రామనాథం, పూనెం ప్రదీప్ కుమార్, రేపాక రామారావు గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## ప్రాజెక్టు అలుగు నిర్మాణానికి మరో ఏడాది కాలం

- మరమ్మత్తులకు రాని ముహూర్తం ఏటికేడు నెట్టుకుపోతున్న వైనం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న మండల రైతాంగం
- మరమ్మతుల పేరిట లక్షలు వృధా అంటూ విమర్శ

**చంద్రుగొండ, సెప్టెంబర్ 12 (జనంసాక్షి ):** మండలంలో ప్రధాన సాగునీటి వనరు జలగం వెంగళరావు ప్రాజెక్టు అలుగు మరమ్మతులకు గుర్రై ఏండ్లు గడుస్తున్నా.. సమస్య కొలిక్కి రాలేదు. ఇటీవలే ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సందర్శించి మరమ్మతులకు ప్రతిపాదనలు చేసే విధంగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. 34 కోట్ల వ్యాయామంతో పనులు చేపడతామని ఈ మేరకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని ఇదివరకే చెప్పారు. దీంతో ఆశలు పెంచుకున్న మండల రైతాంగానికి మళ్లీ నిరాశ ఎదురయింది. తాజాగా గురువారం మరో మారు ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే వచ్చే ఏడాది వర్షాకాలం నాటికి పూర్తిస్థాయి మరమ్మత్తులు జరుగుతాయి అనడంతో బాధిత రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతుల పేరిట నాసిరకంగా పనులు చేపట్టి ఏటా లక్షలు వృధా చేస్తున్నారని విమర్శించారు, మళ్లీ అదే తరహాలో చేసే నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు . దాదాపు ఐదేళ్లపాటు నష్టపోయిన తమకు పూర్తిస్థాయి మరమ్మతులపై ఆశలు వదులుకున్నామని, చెప్పిన మాట ప్రకారం కనీసం వచ్చే ఏడాది నాటికైనా నాణ్యమైన మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపిస్తారో.. లేక మరో 5 ఏళ్లపాటు కాలయాపన చేస్తారో చూద్దామంటూ బహిరంగ చర్చలు జరుగుతున్నాయి.

# ఏచూరి మృతి దేశానికి నష్టం

- పీడిత ప్రజలకు తీరని లోటు
- కమ్యూనిస్టు ఉద్యమాల కీలక తరుణంలో దూరమయ్యారు
- సీపీఐ (ఎం) తెలంగాణ కమిటి తరపున ఏచూరి మృతికి సంతాపం
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



**ఖమ్మం, సెప్టెంబర్ 12, (జనంసాక్షి ):** మతోన్మాదం పెచ్చరిల్లుతున్న తరుణంలో సీపీఐ (ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందడం దేశానికి తీరని నష్టమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కార్మికవర్గానికి, పీడిత ప్రజలకు ఆయన మరణం అత్యంత లోటని పేర్కొన్నారు. 2025 ఏప్రిల్లో తమిళనాడులో పార్టీ జాతీయ మహాసభలలో కీలక కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టాల్సిన తరుణంలో ఏచూరి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు దూరమవడం విషాదకరమని అన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో గురువారం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి మృతికి సంతాపం తెలిపిన అనంతరం తమ్మినేని మీడియాతో మాట్లాడారు. 24 రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఆయన మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పార్లమెంట్లో రాజ్యసభ సభ్యునిగా ఆయన ఉపన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని గుర్తు చేశారు. సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్సింగ్ లాంటి వారు కూడా వారి సెషన్ లేనప్పటికీ, ఏచూరి ప్రసంగాలు వినేందుకు పార్లమెంట్కు హాజరైన సందర్భాలున్నాయన్నారు. సైద్ధాంతిక, రాజకీయ దృఢచిత్తం, స్నేహపూర్వకంగా మెలిగేతత్వం, నేర్చుకునే గుణగణాలున్న వ్యక్తి ఏచూరి అని విశ్లేషించారు. 2015 విశాఖపట్నం మహాసభల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఏచూరి ఎన్నో వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి సైద్ధాంతిక వ్యాప్తికి కృషి చేశారని తెలిపారు. తెలుగు రాష్ట్రాలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాతో ఆయన అనుబంధం ప్రత్యేకమైనదిగా పేర్కొన్నారు. జిల్లాలో అనేక రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య వక్తగా హాజరైన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి ఎన్నికల క్యాంపెయిన్లోనూ పాల్గొన్నారని తెలిపారు. 1988లో కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైనారని, 1990లో తాను ఎన్నికైన విషయాన్ని తమ్మినేని గుర్తు చేశారు. ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నానని అన్నారు. చాలా కీలక సందర్భంలో దేశానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి అవసరమైన తరుణంలో ఏచూరి మృతి చెందారని అన్నారు. ఏచూరి మృతి దేశానికి, కార్మికవర్గానికి, పీడిత ప్రజలకు ఎంతో నష్టమని చెప్పారు. 14వ తేదీ మధ్యాహ్నం వరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఎకెజి భవన్లో సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఉంచుతారని, ఆ తర్వాత పరిశోధనల నిమిత్తం హాస్పిటల్కు అప్పగిస్తారని చెప్పారు. ఏచూరి మృతికి పార్టీ తెలంగాణ కమిటీ తరఫున సంతాపం ప్రకటిస్తున్నట్లు తమ్మినేని చెప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ సంతాప కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, బండి రమేష్, వై.విక్రం, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, సీనియర్ నాయకులు పి.సోమయ్య, ఎం.సుబ్బారావు, ఐలు రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్యనారాయణ, సీతారాం ఏచూరితో ప్రత్యక్ష సంబంధం వున్న అనేకమంది న్యాయవాదులు, ఇతర ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో యువత ముందు ఉండాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి,సెప్టెంబర్ 12(జనంసాక్షి) :** యువత సమాజసేవలో ముందు ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఫార్మసీ కళాశాలలో భారత్ దేఖో అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన యూత్ ఫెలోషిప్ లర్నింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి మాట్లాడుతూ, చదువు కుంటున్న యువత సమాజసేవలో భాగస్వామ్యం కావాలని, వారు నివసిస్తున్న గ్రామాలలోని బడి ఈడు పిల్లలకు ప్రతి వారం ఒకరోజు లేదా రెండు రోజులు కొంత సమయం కేటాయించాలని కలెక్టర్ తెలిపారు.కార్యక్రమాన్ని నిర్వహించిన భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థకు ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ అధికారి డాక్టర్ పిఎం షేక్, భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ సభ్యులు అసరా అబిజిత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు పటిష్ట చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ఓదెల మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి/ఓదెల,సెప్టెంబర్ 12(జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఓదెల మండలంలో విస్తృతంగా పర్యటించారు.ఓదెల మండలం కనగర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వెటర్నరీ హాస్పిటల్, పల్లె దవఖానాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వం కల్పించిన మౌలిక వసతులను వినియోగించుకుంటూ విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని , ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను కలెక్టర్ సూచించారు.మడక గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, పోషక లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన అదనపు పోషకాలు అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు అనంతరం ఓదెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తహసిల్దార్ కార్యాలయం ఎంపీడీవో కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఓదెల ఎంపీడీవో తిరుపతి, మండల పంచాయతీ అధికారి, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ జగదీష్, ఏపీఎం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో అప్రెంటిషిప్ శిక్షణ పొందుటకు దరఖాస్తుల ఆహ్వానం



**యైటింక్లయిన్ కాలనీ సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** సింగరేణిలోని 11ఏరియాలలో అప్రెంటిషిప్ చేసేందుకు ఏరియాలోని సింగరేణి ఉద్యోగుల పిల్లలు, మాజీ ఉద్యోగుల పిల్లలు, ప్రాజెక్టు ప్రభావిత, పునరావాస గ్రామాల యువతి యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి.సూర్యనారాయణ పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి వివిధ ట్రేడ్ల ఐటీఐ (ఎన్వీటీ) అభ్యర్థులకు మినీస్టిరీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్, ఎంటర్ప్రెన్యూర్షిప్ (యంఎస్డీఈ) రీజినల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ప్రెన్యూర్షిప్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ నందు నేషనల్ అప్రెంటిషిప్ ప్రమోషన్ స్కీమ్(యన్.ఏ.పీ.ఎస్) వెబ్ పోర్టల్ నందు ముందుగా అభ్యర్థులు తమ వివరాలను పొందుపరచాలన్నారు. అప్రెంటిస్షిప్ శిక్షణ పొందేందుకు ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు ప్రభుత్వ వెబ్ పోర్టల్లో తమ పేర్లను నమోదు చేసుకున్న తర్వాత మాత్రమే కంపెనీ వెబ్ పోర్టల్లో ఆన్లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలి), లేకపోతే దరఖాస్తు తిరస్కరించబడుతుందన్నారు. సింగరేణి వెబ్ పోర్టల్ 07.09.2024 నుండి 23.09.2024 వరకు తెరవబడుతుందన్నారు.. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును 09.09.2024 నుండి పోర్టల్లో నమోదు చేసుకోవాలని, ఈ నెల 24వ తేదీలోపు ఏరియాలోని ఎంవీటీసీ కార్యాలయంనందు అందజేయాలన్నారు. ఆసక్తి గల వారు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# సొంతగడ్డపై వరల్డ్ కప్ ఫైనల్..!

## భారత షూటర్ల సైన్యమిదే

ఒలింపిక్స్‌లో రెండు పతకాలతో చరిత్ర సృష్టించిన మను భాకర్ కీలక పోటీకి దూరమైంది. షూటింగ్ వరల్డ్ కప్‌లో ఆమె పాల్గొనడం లేదు. దాంతో, స్వదేశంలో జరుగబోయే ఈ టోర్నీ కోసం భారత రైఫిల్ సమాఖ్య స్క్వాడ్‌ను ప్రకటించింది. ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్, ట్రాప్, స్కీట్ విభాగాల్లో పలువరు భారత షూటర్లు పోటీలో ఉన్నట్టు ఐఎస్‌ఎస్ఎఫ్ వెల్లడించింది. పారిస్‌లో పతకం చేజార్చుకున్న అర్జున్ బబుతా, వరుణ్ తోమర్ సహ పలువురు ఫేవరెట్లుగా బరిలోకి దిగనున్నారు. అయితే.. భారత షూటర్లలో రిథమ్ సాంగ్వాన్ ఒక్కడే రెండు విభాగాల్లో బరిలో నిలిచాడు. అక్టోబర్ 13వ తేదీ నుంచి 18వ వరకూ పోటీలు జరుగనున్నాయి. ఎయిర్ రైఫిల్ పురుషులు : దివ్యాన్ష్ సింగ్ పన్వర్, అర్జున్ బబుతా. ఎయిర్ రైఫిల్ మహిళలు : సోన్ ఉత్తమ్ మస్కర్, తిలోత్తమ సేన్. 50 మీటర్ల రైఫిల్ 3పీ పురుషులు : చియాన్ సింగ్, అఖిల్ షెరాన్. 50 మీటర్ల రైఫిల్ 3పీ




మహిళలు : అశిష్ చౌస్కీ, నిశ్చల్. ఎయిర్ పిస్టల్ పురుషులు : అర్జున్ సింగ్ చీమ, వరుణ్ తోమర్. ఎయిర్ పిస్టల్ మహిళలు : రిథమ్ సాంగ్వాన్, సురభి రావు.

### అర్జున్ బబుతా

25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ పురుషులు : అనిశ్, విజయ్‌వీర్ సిద్ధు. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ మహిళలు : రిథమ్ సాంగ్వాన్, సిమ్రన్‌ప్రీత్ కౌర్. ట్రాప్ పురుషులు : వివాన్ కపూర్, భువనేశ్ మెండిరట్ట. ట్రాప్ మహిళలు : రాజేశ్వరి కుమారి, శ్రేయాషి సింగ్. స్కీట్ పురుషులు : అనంత్‌జీత్ సింగ్ నరుక, మైరాజ్ అహ్మద్ ఖాన్. స్కీట్ మహిళలు : గనెమత్ సెఖోన్, మహేశ్వరి చౌహాన్.

### మను 'పతక గర్జన'

టోక్యో ఒలింపిక్స్‌లో పతకం సాధించలేకపోయిన భాకర్.. పారిస్‌లో పతక గర్జన చేసింది. కోచ్ జస్పాల్ రానా సలహాలతో ఆటలో మెరుగైన భాకర్ వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో మను భాకర్ కంచు మోత మోగించింది. తద్వారా ఒకే విశ్వక్రీడల్లో రెండు పతకాలు కొల్లగొట్టిన భారత తొలి షూటర్‌గా ఆమె రికార్డు నెలకొల్పింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత పోటీల్లో మను మూడో స్థానంతో దేశానికి తొలి మెడల్ అందించింది. అనంతరం సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మళ్లీ సత్తా చాటిన ఆమె కాంస్యంతో మెరిసింది.

# వస్తూ వస్తూనే శతకం..!

## ఇషాన్ ధాటికి కుదేలైన ఇండియా బీ

ఏడాది తర్వాత రెడ్ బాల్ క్రికెట్ ఆడుతున్న ఇషాన్ కిషన్ సత్తా చాటాడు. జట్టులో చోటు కోల్పోయిన బాధ.. సెంట్రల్ కాంట్రాక్ట్ రద్దు మిగిలిచ్చిన దుఃఖాన్ని మరిచిపోయేలా దులీప్ ట్రోఫీలో వీరవిహారం చేశాడు. 'ఇండియా సీ' తరఫున బరిలోకి దిగిన ఇషాన్ శతకంతో చెలరేగాడు. పరుగుల దాహంతో ఉన్న అతడు 'ఇండియా బీ' బౌలర్లను ఉతికేస్తూ సూపర్ సెంచరీ బాదాడు. 14 ఫోర్లు, రెండు సిక్సర్లతో వంద కొట్టేసి ఇండియా సీని పటిష్ట స్థితిలో నిలిపాడు. ఈ మెగా టోర్నీలో అతడికి ఇదే తొలి సెంచరీ కావడం విశేషం. నిరుడు బంగ్లాదేశ్‌పై వన్డేల్లో డబుల్ సెంచరీ బాదిన ఇషాన్ కెరీర్‌లో చాలా కష్టమైన దశను ఎదుర్కొన్నాడు. వరల్డ్ కప్ తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లిన ఈ డాషింగ్ బ్యాటర్.. సెలెక్టర్ల తీరు నచ్చక మధ్యలోనే స్వదేశం వచ్చేశాడు. అక్కడితో మొదలైన కష్టాలు సెంట్రల్ కాంట్రాక్ట్ రద్దుతో మరింత పెరిగాయి. బీసీసీఐ ఆదేశించినట్టు రంజీల్లో ఆడనందుకు కాంట్రాక్ట్ కోల్పోయిన ఇషాన్.. ఆ తర్వాత ఎట్టకేలకు దేశవాళీ క్రికెట్ ఆడాడు.

### ఐపీఎల్‌లో మెరుపులు

ఆ తర్వాత ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున మెరుపు



ఇన్నింగ్స్‌లు ఆడాడు. కానీ, జట్టులోకి మాత్రం రాలేదు. దాంతో, ఇలా అయితే జట్టులోకి రావడం సాధ్యం కాదని తెలుసుకున్న ఇషాన్ దులీప్ ట్రోఫీలో బ్యాటుకు పని చెప్పాడు. 97/2తో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చిన ఇషాన్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దంచికొడుతున్న ఇషాన్ జోరుకు ముకేశ్ తెరదించాడు. 111 పరుగుల వద్ద అతడు ఔటవ్వడంతో ఇండియా బీ బౌలర్లు ఊపిరి పీల్చుకున్నారు. విధ్వంసక సెంచరీతో ఇండియా సీని ఆదుకున్న అతడు రెండో ఇన్నింగ్స్‌లోనూ దంచాడంటే మళ్లీ జాతీయ జట్టుకు ఆడడం ఖాయమే అంటున్నారు విశ్లేషకులు

# భార్య కాలేయంతో పునర్జన్మ



## కోలుకుంటున్న ఐర్లాండ్ క్రికెటర్

ఐర్లాండ్ క్రికెటర్ సిమీ సింగ్‌కు ప్రాణాపాయం తప్పింది. కాలేయం పాడవ్వడంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడిన అతడికి భార్య అగమ్‌దీప్ కౌర్ ప్రాణం పోసింది. తన కాలేయంలో కొంత భాగాన్ని ఇచ్చి సిమీని కాపాడుకుంది. గురుగ్రామ్‌లోని మెదంతా హాస్పిటల్ వైద్యులు సిమీకి గురువారం కాలేయ మార్పిడిని విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఐసీయూలోనే ఉన్న అతడు వేగంగా కోలుకుంటున్నాడని డాక్టర్లు చెప్పారు. అసలేం జరిగిందంటే..? భారత్‌కు చెందిన సిమీ సింగ్ ఐర్లాండ్ తరఫున ఆడుతున్నాడు. ఆరు నెలల క్రితం సిమీ తీవ్రమైన జ్వరం వచ్చింది. దాంతో, వెంటనే ఐర్లాండ్ క్రికెట్ సిబ్బంది అతడిని డబ్లిన్‌లోని పెద్ద దవాఖానలో చేర్పించారు. కానీ, అక్కడి వైద్యులకు ఆ జ్వరం ఏంటో అంతుచిక్కలేదు. దాంతో, వాళ్లు సిమీకి చికిత్స చేయలేమని తేల్చి చెప్పారు. దాంతో, దిక్కుతోచని పరిస్థితుల్లో సిమీ స్వదేశం వచ్చేశాడు.

### సిమీ సింగ్

ఐర్లాండ్ నుంచి రాగానే సిమీని హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న ఓ ప్రైవేట్ దవాఖానలో అడ్మిట్ చేశారు. అతడిని అన్ని పరీక్షలు చేసిన వైద్యులు కాలేయం పనితీరు ఆ జ్వరానికి కారణమని కనుగొన్నారు. కాలేయాన్ని మార్పిడి చేస్తే తప్ప బతకడం కష్టమని వైద్యులు చెప్పారు. అందువల్ల అతడి భార్య అగమ్‌దీప్ తన కాలేయాన్ని కొంత వరకూ ఇచ్చేందుకు సిద్ధపడింది. 2017లో ఐర్లాండ్ తరఫున సిమీ అరగేట్రం చేశాడు. స్పిన్నర్ అయిన అతడు ఇప్పటివరకూ 35 వన్డేలు, 53 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.

# యశస్వీ కాదు అతడితో జాగ్రత్త

## ఆస్ట్రేలియాను హెచ్చరించిన పాంటింగ్

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో ఉన్న భారత జట్టుకు ఇక ప్రతి సిరీస్ ఎంతో కీలకం. ముచ్చటగా మూడోసారి టైటిల్ వేటకు సిద్ధవుతున్న టీమిండియాకు నవంబర్‌లో కఠిన సవాల్ ఎదురవ్వనుంది. ఆస్ట్రేలియా గడ్డపై జరుగనున్న బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ రోహిత్ సేన డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాల్ని నిర్ణయించనుంది. ఎంతో కీలకమైన ఈ సిరీస్‌లో విజేతగా నిలిచేది ఎవరు? అనే చర్చకు అప్పుడే తెరలేచింది. భారత్, ఆసీస్‌లకు సమాన అవకాశాలు ఉన్నాయని కొందరు మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ దేశ దిగ్గజం రికీ పాంటింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈసారి తమకు యువకెరటం యశస్వీ జైస్వాల్ నుంచే ముప్పు ఉందంటూ చాలామంది ఆస్ట్రేలియా ఆటగాళ్లు అనుకుంటున్నారు. ఇదే విషయాన్ని స్పిన్నర్ నాథన్ లియాన్ ఓపెన్‌గా చెప్పాడు కూడా. అయితే.. యశస్వీ కంటే ప్రమాదకరమైన ఆటగాడు రిషభ్ పంత్ అని, అతడితో జాగ్రత్తగా ఉండాలని పాంటింగ్ ఆసీస్‌ను



హెచ్చరించాడు. 'గత పర్యటనలో పంత్ చెలరేగిన తీరును అతడు ప్యాట్ కమిన్స్ బృందానికి గుర్తు చేశాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సమర్థుడు పంత్. అతడు ఉతకడం మొదలెడితే అంతే ఉండదు. అంతేకాదు వికెట్ల వెనకాల కూడా అతడు ప్రత్యర్థి బ్యాటర్లను అలవోకగా మోసం చేయగలడు' అని పాంటింగ్ తెలిపాడు.

### 148 పరుగుల భాగస్వామ్యం

టెస్టు క్రికెట్‌లో రిషభ్ పంత్ ఎంత ప్రమాదకర ఆటగాడో అందరికీ తెలిసిందే. టీ20 తరహాలో రెచ్చిపోయి ఆడే పంత్ క్రీజులో ఉన్నాడంటే.. ప్రత్యర్థి కెప్టెన్‌కు హడలే. రెండేండ్ల క్రితం గబ్బా, మెల్‌బోర్న్ స్టేడియంలో ఈ లెఫ్ట్ హ్యాండర్ సృష్టించిన విధ్వంసాన్ని ఆస్ట్రేలియా క్రికెటర్లు కలలో కూడా మర్చిపోలేరు. స్టార్ ఆటగాళ్లంతా చేతులెత్తేసిన చోట పంత్ గబ్బాలో (89 నాటౌట్) చెలరేగిన తీరు వర్ణణాతీతం. ఆపై సిడ్నీలో (97 నాటౌట్) ఛతేశ్వర పుజారాతో కలిసి నాలుగో వికెట్‌కు నెలకొల్పిన 148 పరుగుల భాగస్వామ్యాన్ని ఎంత పొగిడినా తక్కువే. అందుకే పంత్ బోర్డర్ –గవాస్కర్ ట్రోఫీకి వస్తున్నాడంటేనే ఆస్ట్రేలియన్లలో కంగారు మొదలైంది. ఈ ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. 1992 తర్వాత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని తొలిసారి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌గా నిర్వహిస్తున్నారు.

## రాహుల్ గాంధీ భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలి

### బిజెపి జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో భారతదేశాన్ని అగౌరవపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం జిల్లా కేంద్రంలో మహబూబ్ నగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు పి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గతంలో కూడా లండన్ ఆస్ట్రేలియా దేశ పర్యటనలో కూడా భారతదేశాన్ని అఘోరోపరిచే విధంగా మాట్లాడారని , రాహుల్ గాంధీ వ్యాఖ్యలను చూస్తుంటే రాహుల్ భారతదేశ పౌరుడా కాదా అన్న సందేహం దేశ ప్రజల్లో వ్యక్తం అవుతుందని అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ముక్తభారత్ కాంగ్రెస్ ఇచ్చిన పిలుపును అందుకొని, కాంగ్రెస్ నుండి దేశాన్ని విముక్తి కలిగించాలని, అందుకు గాను దేశ ప్రజలందరూ కాంగ్రెస్ కు ఓట్లు వేయకుండా బహిష్కరించాలని ఆయన ప్రజలను కోరారు. రాహుల్ గాంధీ అమెరికాలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, తక్షణమే భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి, బిజెవైఎం, మహిళా మోర్చా, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.



## పారాలింపిక్ పతక విజేతలను కలుసుకున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ (జనంసాక్షి):**

పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన భారత అథ్లెట్లను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఇవాళ ఆయన తన నివాసంలో ఆ అథ్లెట్లను కలిశారు. ఆ క్రీడాకారులకు ఆయన కంగ్రాట్స్ తెలిపారు. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్‌కు 29 పతకాలు వచ్చిన విషయం తెలిసిందే. పతకాలు గెలిచిన పారా అథ్లెట్లను మోదీ ప్రశంసిస్తున్న వీడియోను క్రీడా మంత్రిత్వశాఖ తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది. పారా అథ్లెట్లతో భేటీ సమయంలో క్రీడామంత్రి మన్సూక్ మాండవీయ, పీసీఐ అధినేత దేవేంద్ర జాజారియాలు ఉన్నారు. వీల్‌చైర్ షూటర్ అవనీ లేఖరా పారాలింపిక్స్‌లో వరుసగా రెండోసారి గోల్డ్ సాధించారు. ప్రధాని మోదీతో ఆమె ఫోటో దిగారు. పారాలింపిక్స్‌లో ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతం, 13 కాంస్య పతకాలను ఇండియా గెలిచింది. మెగా టోర్నీకి 84 మందితో భారత బృందం పారిస్‌కు వెళ్లింది. స్వర్ణ పతక విజేతలకు 75 లక్షలు, సిల్వర్ మెడల్ విన్నర్‌కు 50 లక్షలు, కాంస్య పతక విజేతకు 30 లక్షలు అందజేశారు.

# మాట నిలబెట్టుకున్న క్రికెటర్

## బాధిత కుటుంబానికి ప్రైజ్‌మనీ

బంగ్లాదేశ్ యువ క్రికెటర్ మెహిదీ హసన్ మిరాజ్ మాట నిలబెట్టుకున్నాడు. ఈమధ్య స్వదేశంలో చెలరేగిన అల్లర్లలో బలైన ఓ రిక్షా కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశాడు. పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా వచ్చిన ప్రైజ్‌మనీ మొత్తాన్ని బాధితుడి ఫ్యామిలీకి ఇచ్చి ఉదారత చాటుకున్నాడు. గురువారం మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చిన మిరాజ్.. రూ.5 లక్షల చెక్‌ను వాళ్లకు అందజేశాడు. 'గత నెలలో ఆన్‌లైన్‌లో వైరల్ అయిన వీడియో నా కంటపడింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఉద్యమం ఆందోళనకరంగా మారి అల్లరిమూకల దాడిలో ఓ రిక్షా కార్మికుడు ప్రాణాలు విడిచాడు. అతడి కుమారుడు భోరున ఏడుస్తున్న ఆ వీడియో నన్ను ఆలోచనల్లో పడేసింది. ఆ సోదరుడి కుటుంబానికి అండగా నిలవాలనుకున్నా. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా వచ్చిన డబ్బును వాళ్లకు ఇచ్చేస్తానని పాకిస్థాన్‌లో ఉండగానే ప్రామిస్ చేశాను. అనుకున్నట్టుగానే నిన్న రాత్రి నా మాట నిలబెట్టుకున్నా. బాధిత కుటుంబాన్ని కలిసి వాళ్లకు నా ప్రైజ్‌మనీ మొత్తాన్ని అప్పగించాను. ఇలా చేయడంతో చనిపోయిన వ్యక్తి లోటును పూడ్చలేనని తెలుసు. కానీ, వాళ్ల జీవితం ఎంతో కొంత సాఫీగా సాగేందుకు నా ప్రయత్నం ఉపయోగపడనుంది' అని మిరాజ్ తెలిపాడు. సదరు రిక్షా కార్మికుడి కుటుంబంతో ఉన్న ఫొటోను



సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అది చూసిన అభిమానులు 'మిరాజ్.. నీ ఆటే కాదు మనసు కూడా బంగారమే' అంటూ అతడిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

### రెండు హాఫ్ సెంచరీలతో..

నిరుడు భారత జట్టుపై సెంచరీతో చెలరేగిన మిరాజ్ బంగ్లాదేశ్ విజయాల్లో కీలకం అవుతున్నాడు. ఈమధ్యే ముగిసిన పాకిస్థాన్ పర్యటనలోనూ ఈ యువ ఆల్‌రౌండర్ అదిరే ప్రదర్శన చేశాడు. రెండు మ్యాచుల్లో రెండు హాఫ్ సెంచరీలు బాదడమే కాకుండా 77.50 సగటుతో 155 పరుగులు చేశాడు. అంతేకాదు 10 వికెట్లతో బంగ్లాదేశ్ చారిత్రాక సిరీస్ విజయంలో మిరాజ్ భాగమయ్యాడు.



## కలిసిమెలిసి ఐక్యతతో వక్ఫ్ బోర్డ్ స్థలాలను కాపాడుకుందాం

### ఎమ్మెల్సీ ఆమిర్ అలీ ఖాన్

**తాండూరు సెప్టెంబర్ 12(జనంసాక్షి)**

కలిసి మెలిసి ఐక్యతతో వక్ఫ్ బోర్డ్ స్థలాలను కాపాడుకుందామని ఎమ్మెల్సీ ఆమిర్ అలీ ఖాన్ పేర్కొన్నారు. గురువారం తాండూరు పట్టణం సమద్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆమిర్ అలీ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ నాతోటి ముస్లింలు అందరూ కలిసి ఐక్యమై వక్ఫ్ బోర్డ్ సంబంధించిన స్థలాలను కాపాడుకోవాలని సూచించారు. మనం అందరం కలిసి ఐక్యమై ఎన్ ఆర్‌సిసి ఏఏ వంటి ఎన్నో అమెండ్మెంట్ బిల్‌ని వ్యతిరేకించాము. దీన్ని కూడా మనము అందరూ కలిసి ఐక్యమై పార్లమెంట్లో వ్యతిరేకంగా చూపెట్టాలన్నారు. మన తెలంగాణలోనే కాకుండా వేరే రాష్ట్రాల్లో కూడా వక్ఫ్ బోర్డ్ ప్రాపర్టీని గురించి తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై అవగాహన ఎవరికి కూడా తెలియదు. కావునా దాన్ని మనం ఈరోజు నిర్వహించిన ముస్లిం వెల్ఫేర్ తాండూర్‌లో ఐక్యమై ఈ బిల్‌ని గురించి చర్చిస్తున్నా మన్నారు. అదేవిధంగా వేరే రాష్ట్రాల్లో కూడా అవగాహన తెలుపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కమల్ అక్తర్, మాజీ ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షులు అబ్దుల్ ఆహాద్, మొయ్మద్ బాబర్, నాయకులు అబ్దుల్ రౌవుఫ్, మాజీ కౌన్సిలర్ అలీం, కౌన్సిలర్ అబ్దుల్ రజాక్, జూబీర్ లాల, ముస్లిం వెల్ఫేర్ ఉప దక్షులు అబ్దుల్ బాసిత్ అలీ, సెక్రెటరీ ఖలీద్ సైఫుల్లా, ఖయ్యూం అతర్, సుహేల్ ఉమారి,ఖాయమ్, శుకుర్ ఖాన్, ఇంతియాజ్ బాబా, మహమ్మద్ సిరాజ్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి




### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

సెప్టెంబర్ 17న నిర్వహించే ప్రజా పాలన దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీసీ హాల్లో ప్రజా పాలన దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో నిర్వహించిన కోఆర్డినేషన్ మీటింగ్ లో కలెక్టర్ మాట్లాడుతూ..ఈనెల 17న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టరేట్ ఆవరణలో ఈ నెల 17 న ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి హాజరుకానున్నారని కలెక్టర్ తెలిపారు.అయితే 17న కలెక్టరేట్ ఆవరణలోకి ఉదయం 9:45 గంటలకు జిల్లా ఎస్పీ ఆగమనం, 9:50 గంటలకు జిల్లా కలెక్టర్ ఆగమనం,10 గంటలకు ముఖ్య అతిథి చే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుందని కలెక్టరేట్ అధికారి తెలిపారు. ఉదయం 10: 10 నిమిషాల నుంచి 10:30 వరకు ముఖ్య అతిథి సందేశంతో కార్యక్రమం ముగుస్తుందని ఆమె చెప్పారు. ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్ల పై ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు విధిగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పోలీస్ గౌరవ వందన కార్యక్రమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ స్థానిక డిఎస్పీకి సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల, డి.ఎస్.పి నల్లపు లింగయ్య, కలెక్టరేట్ ఏవో జయసుధ, డిఆర్ డిఏ మొగులప్ప, ఎక్సైజ్ అధికారి అశోక్ కుమార్, డిపిఆర్ఓ ఎంఏ రషీద్, డిఎంహెచ్ ఓ డాక్టర్ సౌభాగ్య లక్ష్మి, జిల్లా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# మా డబ్బులు ఎప్పుడు ఇస్తారు?

### అచ్చంపేట ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్‌ని నిలదీసిన ఖాతాదారులు

### ఖాతాదారులను అవస్థలు పెట్టడం తగదు ఊరుకునే ప్రసక్తి లేదు

### టిపిసిసి ఎన్నారై సెల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్ రెడ్డి

**అచ్చంపేట సెప్టెంబర్ 12 (జనంసాక్షి)**



అచ్చంపేట పట్టణంలోని ఎస్ బి ఐ బ్యాంకులో ఖాతాదారులైన మోకురాల దాస్ గౌడ్, సునందల ఈ ఇద్దరి భార్య భర్తల అకౌంట్లో దాచుకున్న పై ఇద్దరి రూ. 5.20 లక్షలతో పాటు 21 మంది ఖాతాదారుల డబ్బులు సుమారు రూ. 95 లక్షలు బ్యాంకులో పనిచేస్తున్న క్లర్క్ కిరణ్ అనే ఉద్యోగి ఖాతాదారులకు తెలవకుండానే నేరుగా అకౌంట్ లో ఉన్న డబ్బులను మాయం చేసిన విషయంపై 15 రోజుల క్రితం బ్యాంకు మేనేజర్‌ని కలిసి తక్షణమే డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరారు. బ్యాంకు అధికారుల నుండి ఎలాంటి వరకు పలుకు లేకపోవడంతో బుధవారం బ్యాంకు వద్దకు ఖాతాదారులు బ్యాంకు వద్దకు వచ్చి మేనేజర్ ను మా డబ్బులు ఎప్పుడు ఇస్తావు అని నిలదీశారు. చిన్నచిన్న అవసరాలకు సైతం డబ్బులు లేక అప్పులు చేసుకోవాల్సి వస్తుందని, రైతుల బాధ అర్థం చేసుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీపిసిసి సెల్ ఎన్నారై అడ్వైజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్ రెడ్డి బాధిత ఖాతాదారులతో అచ్చంపేట స్టేట్ బ్యాంక్ ఇండియా మేనేజర్ హుస్సేన్ భాషను డబ్బులు మాయం చేసిన విషయంపై ఎంతవరకు శాఖా పరమైన చర్యలు తీసుకున్నారు ఖాతాదారులకు నిర్లక్ష్యం చేస్తూ ఎందుకు డబ్బులు ఇవ్వలేకపోతున్నారు, అమాయక రైతులంటే ఇంత చులకన అని మేనేజర్‌ను నిలదీశారు. ఈనెల చివరినాటికి రైతులైన ఖాతాదారులకు మాయమైన డబ్బులు అకౌంట్లో జమ కాకపోతే.. పెద్ద ఎత్తున ఆర్ఎం కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా బ్యాంకు ఉన్నత అధికారులు త్వరతగతిన ఖాతాదారుల పక్షాన ఆలోచన చేసి డబ్బులు అకౌంట్లో పడేలా న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుడుతామన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
13 సెప్టెంబర్ 2024

# భారత్‌కు ఇరాన్‌తో చారిత్రక, సాంస్కృతిక అనుబంధం

- ఇరాన్ పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ శాఖ డిప్యూటీ మంత్రి షల్బాఫియాన్
- పర్యాటక రోడ్ షో పాల్గొన్న ఇరాన్ డిప్యూటీ మంత్రి షల్బాఫియాన్, మంత్రి జూపల్లి, ఇరాన్ కాన్సుల్ జనరల్ మైదీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** శతాబ్దాలుగా భారతదేశానికి ఇరాన్‌తో చారిత్రక, సాంస్కృతిక అనుబంధం ఉందని, భారత్ తో సాంస్కృతిక, పర్యాటక సంబంధాల మార్పిడిని మరింత వేగవంతం చేసుకొనేందుకు పర్యాటక నూతన విధానం అమలు చేస్తున్నట్టు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ శాఖ డిప్యూటీ మంత్రి షల్బాఫియాన్ అన్నారు. ఇరాన్ – భారతదేశం, తెలంగాణ రాష్ట్రాల మధ్య సాంస్కృతిక, పర్యాటక రంగాల్లో పరస్పరం సహకరించుకోవడం లక్ష్యంగా హైదరాబాద్ లోని ఓ హోటల్ లో ఇరాన్ పర్యాటక రోడ్ షో ఈవెంట్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా షల్బాఫియాన్ మాట్లాడుతూ... ఇరాన్ పట్ల సానుకూల వాతావరణాన్ని ప్రమోట్ చేయడం, అంతర్జాతీయ పర్యాటకులను రప్పించడం, కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం, సాంస్కృతిక అనుబంధాన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా భారతదేశంలో పర్యాటక రోడ్ షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సందర్శకుల మార్పిడి వల్ల రెండు దేశాల్లో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్, భారతదేశం మధ్య లోతైన సాంస్కృతిక, కళాత్మక సంబంధాలు ఉన్నాయని, ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో కూడా ఇరాన్ కు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, హైదరాబాద్ రెండు దేశాలను కలిపే వారధిగా నిలుస్తుందని అభివర్ణించారు. ఇరాన్ దేశంలోని చారిత్రక, వారసత్వ, పర్యాటక ప్రాంతాల్లో పర్యటించి, పాశ్చాత్య దేశాలు, మీడియా చిత్రీకరించిన దానికి భిన్నంగా ఇరాన్ ఉందని తెలుసుకుంటారని పేర్కొన్నారు. ఇండియా – ఇరాన్ పర్యాటకులు రెండు దేశాల్లో పర్యటించడం వల్ల ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని, పరస్పరం ఒకరినొకరు అర్థం చేసుకోవడం, సాంస్కృతిక మార్పిడి జరుగుతుందని హైదరాబాద్ లో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ కాన్సుల్ జనరల్ మైదీ షహరొఖి తెలిపారు.

మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఇరాన్ సాంస్కృతిక సంపద గురించి మరింత లోతుగా తెలుసుకోవటానికి, ఇరు దేశాల మధ్య పర్యాటక సంబంధాలను బలోపేతం చేయటానికి ఈ రోడ్ షో ఒక గొప్ప వేదికగా నిలిచిందని అన్నారు. ఇరాన్ పర్యాటక ఆకర్షణలపై అవగాహన కల్పించుకునే అవకాశం లభించిందని తెలిపారు. ప్రపంచ పర్యాటక పటంలో తెలంగాణ ఒక ప్రముఖ గమ్యస్థానంగా ఉద్భవించిందని చెప్పారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ పర్యాటక అమలు చేస్తున్న చురుకైన విధానాలు, కార్యక్రమాలు పర్యాటకాన్ని ప్రోత్సహించడం, మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషించాయని వివరించారు. పర్యాటకులకు మెరుగైన మౌతిక సదుపాయాల కల్పించేందుకు, , వారసత్వ పరిరక్షణ, స్థానిక కళలు, హస్తకళలు ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ యొక్క సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని, కుతుబ్ షాహీ రాజవంశం యొక్క శాశ్వత వారసత్వాన్ని పరిరక్షించడానికి కుతుబ్ షాహీ సమాధుల పునరుద్ధరించడం మా నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇరాన్ సాంస్కృతిక సంపదను తెలుసుకోవడానికి, రెండు ప్రాంతాల మధ్య పర్యాటక సంబంధాలను బలోపేతం చేయటానికి ఇదొక గొప్ప వేదిక అని, తెలంగాణ అందాలను చూపించడానికి ఈ రోడ్ షో వల్ల అవకాశం లభించిందని అన్నారు. పర్యాటకం వల్ల కేవలం కొత్త ప్రదేశాలను సందర్శించడం మాత్రమే కాదని, మనుషులతో సంబంధాలు ఏర్పరచడం, వేరే సంస్కృతులను అర్థం చేసుకోవడం, కొత్త పరిచయాలు ఏర్పరచుకోవడంతో పాటుఆర్థిక అభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ, ప్రపంచ శాంతి కోసం శక్తివంతమైన సాధనంగా నిలుస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, ఇరాన్ కాన్సులేట్ సెకండ్ కన్సుల్ మోహసిన్ మొగద్దమి, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ టూరిజం డైరెక్టర్ జనరల్ షోజెహి, రీజినల్ పాస్పోర్ట్ అధికారి స్నేహజ, తెలంగాణ పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, వివిధ ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# కౌశిక్ రెడ్డి వర్సెస్ గాంధీ

- ఇద్దరి ఇంటి వద్దా భారీ బందోబస్తు ఏర్పాటు
- తన ఇంటికి వస్తానని రానందుకు గాంధీ విమర్శలు
- అనుచరులతో కలసి నేరుగా పాడి ఇంటికి గాంధీ
- ఇరువర్గాల మోహరింపుతో ఉద్రిక్తత



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.. కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్ల వ్యవహారం రాజకీయంగా రచ్చకు దారితీసింది. నగరంలోని మాదాపూర్‌లో ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి అరికపూడి గాంధీ తన అనుచరులను వెంటబెట్టుకొని వెళ్లారు. దీంతో అక్కడ రచ్చరచ్చ జరిగింది. కౌశిక్ ఇంట్లోకి వెళ్లేందుకు అనుమతివ్వాలంటూ గాంధీ అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులను తోసుకొని లోపలకు వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలపై కోడిగుడ్లు, టమాటాలు విసిరినట్టుగా తెలుస్తోంది. ఆయన ఇంటి అద్దాలు కూడా పగిలినట్టుగా సమాచారం. ఊహించని పరిణామంతో అక్కడ బీతావాహ పరిస్థితి నెలకొంది.కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో నియంత్రించడం పోలీసులకు కూడా కాస్త కష్టంగా మారింది. అయినప్పటికీ పోలీసులు అరికపూడి గాంధీని అదుపులోకి తీసుకున్నారు. ఆయనను ఇంటికి తరలించారు. పాడి కౌశిక్ రెడ్డి తన ఇంటికి వస్తానని రాలేదు కాబట్టే తాను ఆయన ఇంటికి వెళ్లానని గాంధీ అన్నారు. నా ఇంటికి నువ్వు రాలేకపోయావ్.. నేనే మీ ఇంటికి వచ్చా. కౌశిక్ రెడ్డి ఒక బ్రోకర్. కౌశిక్ రెడ్డి వచ్చాక బీఆర్ఎస్ నాశనమైంది. అతడి వల్లే పార్టీ ఓడిపోయిందని అన్నారు. తన ఇంటిపై ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అనుచరులు దాడికి పాల్పడిన ఘటనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. గాంధీ తన రౌడీలను తీసుకొని నా ఇంటి మీదకు వచ్చాడు. నాపై హత్యాయత్నం చేశారు. పోలీసులే దగ్గరుండి దాడి చేయించారు. ఈ చర్యకు కచ్చితంగా ప్రతిచర్య ఉంటుంది. రేపు ఏం జరుగుతుందో మీరు చూస్తారు. రేపు కచ్చితంగా అరికపూడి గాంధీ ఇంటికి వెళ్లి తీరుతా' అని అన్నారు.

దాడి ఘటనకు ముందు కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూఅరికపూడి గాంధీపై మండిపడ్డారు. 'బ్రోకర్‌వి నువ్వా నేనా.. టీడీపీలో గెలిచి బాబును మోసం చేశావు.. బీఆర్ఎస్‌లో గెలిచి కేసీఆర్‌ను మోసం చేశావు' అని నిందించారు. 'మిస్టర్ గాంధీ గుర్తు పెట్టుకో.. సీఎం అవుతానని చెప్పుకున్న ఈటెలను బొంద పెట్టిన మగాణ్ణి నేను.. తెలంగాణ గడ్డ మీద పుట్టిన బిడ్డను అంటూ హెచ్చరికలు జారీ చేశారు. 'ఎక్కడ నుంచో వచ్చి నాకు సవాల్ చేస్తే ఊరుకుంటానా?' అంటూ కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. రేపు ఉదయం 11గంటలకు మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుని నాయకత్వంలో గాంధీ ఇంటికి వెళతామని కౌశిక్ రెడ్డి తెలిపారు. జిల్లా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అంతా రావాలని పిలుపునిస్తున్నానన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు అనుమతితో చెబుతున్నానన్నారు. 'నీకు నాకు ఏమైనా తగాదాలు ఉన్నాయా? నీకు నాకు ఏం పంచాయితీ? బీఆర్ఎస్ బి ఫామ్ మీద గెలిచి కాంగ్రెస్ లోకి వెళ్లడానికి సిగ్గు అనిపించడం లేదా?' అని ప్రశ్నించారు. మగాడివి ఐతే రాజీనామా చేసి మళ్లీ గెలువాలంటూ కౌశిక్ రెడ్డి సవాల్ విసిరారు. అక్కడే మీ బలం, మా బలం ఏంటో తేల్చుకుందామన్నారు. అప్పుడు మొనగాడివి అని ఒప్పుకుంటానని కౌశిక్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌లో ఉంటే తెలంగాణ భవన్‌కు రావాలంటూ పాడి కౌశిక్ రెడ్డి సవాల్ విసిరారు. గాంధీ ఇంటికి బయలుదేరుతా అనగానే తన ఇంటి చుట్టూ కంచెలు వేశారని కౌశిక్ రెడ్డి విమర్శించారు. తనను ముందస్తుగా అరెస్ట్ చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తాను కూడా గాంధీకి సహచర ఎమ్మెల్యేనేనని అన్నారు. ఇద్దరం ఒకే పార్టీలో ఉంటే ఇద్దరం కలిసి బీఆర్ఎస్ భవన్‌కు వెళతామన్నానని.. దానికి గాంధీ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ మారనప్పుడు బీఆర్ఎస్ పార్టీ జెండా పెట్టుకోవడానికి ఎందుకు అభ్యంతరం అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో చేరానన్నది మీరే కదా? అని ప్రశ్నించారు. అలాంటప్పుడు మీకెందుకు అంత భయం అవుతుందని నిలదీశారు. ఎప్పుడూ కేసీఆర్ వ్యక్తిగతగా ఏ ఎమ్మెల్యేలకు కండువాలు కప్పలేదని అలా నిరూపిస్తే రాజీనామా చేస్తానని అన్నారు. మరోవైపు అరికెపూడి గాంధీపై కూడా కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే తెలంగాణ భవన్‌కు రావాలని సవాల్ చేశారు. లేకుంటే తానే గాంధీ ఇంటికి వెళ్లి గులాబీ జెండా ఆయన ఇంటిపై ఎగరేసి వస్తానని అన్నారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెడతానంటూ సవాల్ చేశారు. సవాల్ నేపథ్యంలో కౌశిక్ రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేశారు.పోలీసులు ఆయన్ని బయటకు రాకుండా కట్టడి చేస్తున్నారు. మరోవైపు కౌశిక్ రెడ్డి కామెంట్స్‌పై కాంగ్రెస్ మహిళా నేతలు ఫైర్ అయ్యారు. ఆయన చేసిన చీరా గాజుల విమర్శలపై కూడా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసలు బీఆర్ఎస్ పుట్టుకే ఫిరాయింపులతో మొదలైందని అన్నారు. మహిళలను కించపరిచేలా కౌశిక్ రెడ్డి చేసిన కామెంట్స్‌ను మహిళా కమిషన్ సుమోటోగా తీసుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. ఇలాంటి మాటలు పదే పదే మాట్లాడితే మాత్రం కౌశిక్ రెడ్డికి కచ్చితంగా చెప్పుతో బుద్ధి చెబుతామన్నారు. ఆయన మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని అన్నారు. మరోవైపు అరికెపూడి గాంధీ నివాసం వద్ద కూడా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండడం శుభపరిణామం

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** ప్రాజెక్టులు పూర్తి స్థాయి నీటి మట్టం వరకు నిండడం శుభపరిణామం అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మానేరు డ్యాం సందర్శించి నీళ్లల్లో పూలు వదిలి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... గత కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, వరద కాలువ వల్లే మిడ్ మానేరు గాని లోయర్ మానేరు గాని నిండాయని గత పాలకులు కాళేశ్వరం ప్రాజెక్టు నుండి చుక్క నీళ్ళు రాకున్నా ప్రజలను తప్పు దోవ పట్టించారని అన్నారు. రాబోయే వేసవిలో త్రాగు నీరుకు, సాగు నీరుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధి పై మంత్రులకు మాకు పూర్తి అవగాహన ఉందని నిధుల విషయంలో మేయర్ సునీల్ రావు అవాకులు చవాకులు మాట్లాడుచున్నాడని ఐదేండ్లుగా జరిగిన విధ్వంసం సంగతేందని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పోరండ్ల రమేష్, జీడి రమేష్, దన్న సింగ్, ఖంరొద్దిన్, షబానా మహమ్మద్, ఊరడి లత, జ్యోతి రెడ్డి, మహాలక్ష్మి, రజితా రెడ్డి, మూల జైపాల్, మెరుగు స్వప్న, హస్తపురం తిరుమల, బషీర్, వెంకట్ రెడ్డి, అజ్మత్, జమాల్, ఇమామ్, మల్లిఖార్జున్, మాసుం ఖాన్, సాయి, భరత్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల మద్దతు కోరిన నరేందర్‌రెడ్డి

- ఎస్ఆర్ఆర్ కళాశాలలలో సందర్శన



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ప్రఖ్యాతిగాంచిన ఎస్ఆర్ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తాను విద్యను అభ్యసించడం పూర్వజన్మ సుకృతం అని ప్రముఖ విద్యా వేత్త, "అల్ఫోర్స్" విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం రోజు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ , పీజీ కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.... తాను చదువుకున్న ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు విచ్చేసి సమావేశం నిర్వహించడం ఆనందంగా ఉందని, పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిలుస్తున్న సందర్భంగా ప్రభుత్వ లెక్చరర్లను కలిసి వారి మద్దతును కోరుతున్నానని, తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన మంజూరి గురించి ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధి చేయండి



- రహదారి వెడల్పు ఆపండి...
- ప్రభుత్వ విప్ కు మొరపెట్టుకున్న ఇండ్ల యజమానులు..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** వేములవాడ మూలవాగు నుండి రాజన్న ఆలయం వరకు ప్రధాన రహదారి విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గత ఐదు రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో రహదారి ప్రక్కల ఉన్న ఇండ్ల యజమానులు ఆందోళన చెంది గురువారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాసు క్యాంప్ ఆఫీస్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇండ్ల యజమానులు మాట్లాడుతూ వేములవాడకు ఇరు ప్రక్కల రెండు బైపాస్ రోడ్లు ఉండగా, బ్రిడ్జి నుండి ఆలయం వరకు రహదారి విస్తరణ చేయడం అవసరం లేదన్నారు. ప్రధాన రహదారిపై వన్ వే ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని సూచించారు. కొన్ని దశాబ్దాల నుండి వ్యాపారం చేసుకుంటూ జీవన కొనసాగిస్తున్నామని రహదారి వెడల్పులో మా ఇండ్లు పోవడంతో ఉపాధి కోల్పోతుందని విప్ కు మొరపెట్టుకున్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులు చేపట్టండి రహదారి వెడల్పు పనులను మూడు సంవత్సరాల వరకు ఆపాలని సూచించగా వారి సమస్యలు విన్న విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ వీటిడిఏ ఆధ్వర్యంలో గతంలో రహదారి వెడల్పుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని,నేను ఎమ్మెల్యేగా గెలిచాక చేయడం లేదన్నారు. నాలుగైదు రోజుల్లో ఇండ్ల యజమాలతో ఆర్డిఓ, తహసీల్దార్ సమావేశం ఏర్పాటు చేస్తారని, ఈ సమావేశంలో మీ సమస్యలు అధికారుల వివరించలన్నారు. మీ సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచన చేస్తానని, మీరు మాత్రం ఆర్డిఓ,తహసిల్దార్ నిర్వహించే సమావేశానికి వెళ్లి మీ సమస్యలు చెప్పుకోవాలని మీరు కూడా రహదారి వెడల్పులో సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, ఇండ్ల యజమానులు పాల్గొన్నారు.

# ఉప ఎన్నికలు వచ్చినా గెలుపు కాంగ్రెస్‌దే

- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్య




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** తెలంగాణలో ఉపఎన్నికలు రాబోతున్నాయంటూ జోరుగా ప్రచారం జరుగుతున్న వేళ...ఈ ప్రచారంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒకవేళ వచ్చినా కాంగ్రెస్ ఖాతాలోనే చేరుతాయని టీపీసీసీ చీఫ్ తేల్చిచెప్పారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేను మహేష్ కుమార్ కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 60 ఏళ్ళు రాజకీయాల్లో ఉన్న మహానాయకుడు ఏఐసీసీ అధ్యక్షుడిగా ఉన్నారని.. ఖర్గేను కలిసి ఆశీస్సులు తీసుకున్నానని అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని కాంగ్రెస్ బలోపేతానికి పనిచేయాలని ఖర్గే సూచన చేశారన్నారు. కాంగ్రెస్ కార్యకర్త మొదలుకొని సీనియర్ నాయకులను కలుపుకొని వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన స్థానాలకంటే ఎక్కువ సాధించి మళ్ళీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయబోతున్నామన్నారు. మంత్రివర్గ విస్తరణ గురించి సీఎం, ఏఐసీసీ పెద్దలు మాట్లాడారని.. వారే నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కొత్త కమిటీ ఏర్పాటు అయ్యేంత వరకు పాత కమిటీలు పనిచేస్తాయన్నారు. బాధ్యతలు చేపట్టాక కొత్త కార్యవర్గంపై అధిష్టానంతో చర్చలు జరుపుతానని చెప్పారు. ప్రజలు నమ్మకంతో కాంగ్రెస్‌కు అధికారాన్ని ఇచ్చారని.. సమన్వయంతో పనిచేస్తున్నామని తెలిపారు. కమిటీల్లో అన్ని సామాజికవర్గాలకు సముచిత ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు సమయం ఇచ్చిందని... మరికొంతమంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేటీఆర్ సవాళ్ళను పట్టించుకునే స్థితిలో లేరని... ప్రతిపక్ష పాత్ర ఇస్తే దాన్ని కూడా సమర్ధవంతంగా నిర్వహించే స్థితిలో లేరని విమర్శించారు. వర్షాలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. అలాగే అరికపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని.. సాంకేతికంగా ఆయనకు పీఏసీ చైర్మన్ ఇచ్చామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

# ఖమ్మంలో కేంద్రబృందం పర్యటన

- మున్నేరు ప్రాంతంలో ఇళ్ల పరిశీలన



**ఖమ్మం, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** ఖమ్మం నగరంలో కేంద్ర బృందం గురువారం ఉదయం పర్యటించింది. బొక్కల గడ్డ, జలగం నగర్, మోతీ నగర్, ప్రకాష్ నగర్, దంసలాపురం ప్రాంతాలలో కేంద్ర బృందం పర్యటించింది. మున్నేరు వరద కారణంగా నష్టపోయిన ఇళ్లను బృందం సభ్యులు పరిశీలించారు. రెండు బృందాలుగా మున్నేరు వరద ప్రాంతాలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. నష్టపోయిన వరద బాధితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన కుటుంబాలకు అండగా ఉంటామని కేంద్ర బృందం హామీ ఇచ్చింది. జలగం నగర్ నుంచి కోదాడ కేంద్ర బృందం బయలుదేరింది. కేంద్ర బృందానికి వరదనష్టం వివరాలను జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలియ జేశారు. ఖమ్మం జిల్లాలో మున్నేరు వరద బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దాదాపు పదిరోజుల పాటు జిల్లా ప్రజలను మున్నేరు వణికించింది. గ్రామాలకు గ్రామాలు వరద నీటిలోని ఉండిపోయాయి. వెంటనే ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ప్రభుత్వం ముమ్మరం చేసింది. మున్నేరు వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారికి ఆహారం, తాగునీరు, వైద్యసాయాన్ని అందించారు. వరద ముంపు ప్రాంతా ల్లో అధికార, ప్రతిపక్ష నేతలు పర్యటించి అక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. యితే వరద ముంపు తగ్గాక ఇంటికి వెళ్లిన బాధితులు అక్కడ పరిస్థితి చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. వరద ధాటికి కొట్టుకుపోయిన ఇళ్లను చూసి రోదించారు. మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు దయనీయ స్థితిలో ఉన్నారు. వేలాది మంది ప్రజలు సర్వం కోల్పోయి నడి వీధిలో నిలబడ్డారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని మున్నేరు వరద ముంపు బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370